భారతి

పాఠకులకు మనవి

అనివార్యకారణాలవలన భారతి (మాసపత్రిక) ఫిబ్రవరి నెల సంచిక నుండి వెల ఈ క్రిందివిధంగా ఉంటుందని పాఠకులకు మనవి చేసుకుంటున్నాము.

విడిప్రతి రు. 1–50 పై.

చందా వివరాలు

	పోస్టు ద్వారా
సంవత్సరానికి	రు. 19–20
అర్థ సంవత్సరం	రు. 9–60

గమనిక:— ఇదివరకే చెల్లించిన చందాలు పైరేట్ల కనుగుణంగా సవరించబడును.

మేనేజరు

భారతి.

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938–1972)

★

ఫిబ్రవరి 1974

సంపుటము : 51 : సంచిక : 2 :

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

ఫిబ్రవరి 1974

శిలాభారతి

శ్రీ వఝ్ఝల వేంకటేశ్వర్లు

శ్రీపాద ముద్రా భద్రమ్మైన ఈ పురాణ శిలావేది మీద
ఈ పవిత్ర భారత జనయిత్రీ శ్రీ చరణ సన్నిధిలో
సుదీర్ఘ సుగంభీర ధ్యాన నిష్ఠా గరిష్ఠ సమాధిలో
అంతర్ముఖుడవై అహోరాత్రాలు తపించి తపించి,
చీకటిలో మ్రగ్గే లోకానికి ఆలోకం చూపుటకై
మేను దాల్చిన యేసయ్య జన్మ దినపు శుభ వేళలో,
మాయాదేవీ తనయుడు మహాబోధి వటచ్ఛాయలో
మాయాతీతుడై బుద్ధ భగవానుడైన చాయగా,
అవ్యయానంద రసానుభూతిలో, ఆత్మజ్ఞాన జ్యోతిలో
దివ్య దర్శనం పొందిన వివేకానంద యోగి మౌళీ,
జోహారులు నీకు, స్వామీ, జోహారులు.

ఈ ప్రశాంత పవిత్ర వివిక్త శిలాద్వీప యుగళం
నాడు నీకు స్వాగతం పలికిన జననీ స్నిగ్ధగళం;
ఆ అమృత ముహూర్తంలో ఈ సాగర లహరీ ధ్వానం
ఐనది నీ శ్రవః కుహరాలకు ప్రేమమయాహ్వానం;
మేలుకొన్నది నీ లోపలి ఆత్మశక్తి మహాజ్వాల,
వ్రేలినది నీ మెడలో పద్మహారమ్మై చల దూర్మిమాల;
ఈ బృహత్తర విశాల శిలాంక పీఠిపై వసించి,
ఉత్తరాభిముఖముగా దీప్తదృష్టి సారించి,
చేకూర్చుకొన్నావు దేశ మాతృమూర్తి సాక్షాత్కృతి,
ఆకళించుకొన్నావు నేటి భారతజాతి అధోగతి;
తిరిగినది నీ మనోవీథిలో ఒక కరుణ దృశ్యం,
అజ్ఞాన దారిద్ర్య రుజాసేవ్య శోకదేవతా నృత్యం.

జ్ఞాన పూర్ణ చింతాధారా స్రవంతిని ఇంకించిన
అర్థహీన అంధవిశ్వాస మూఢాచార మరుక్షేత్రాలు;
పరధర్మ పరిష్వంగంలో మాటువడ్డ వ్యక్తిత్వాలు,
అవివేకాహతులకు గాయపడ్డ జీవితాదర్శాలు;
సత్య—అహింసా—త్యాగ—క్షమాది దివ్య సంప్రదాయాలకు
సంకెళ్లు వేసిన అధర్మ రాక్షస శక్తి ప్రభావాలు—

అనలోకితమైనది అస్తవ్యస్తం, అవ్యవస్థితం,
అయోమయం, తమోమయం ఐన నేటి జాతి జీవితం.
అంతరంగ గగనంలో తీవ్రభావ సంఘర్షణ,
బైట శిలా ఘాతోద్ధత తరంగమాలా ఘోషణ;
ఆ ఘర్షణలో ఉదయించిన దొక విద్యుత్ ప్రకాశం,
ఆ ఘోషణలో వినిపించిన దొక దివ్య ప్రబోధం.
అది మాతృదేవి ఆదేశం, విశ్వానికి నీ సందేశం,
నీ జీవితం మలుపు తిరిగిన క్రాంతి సన్నివేశం.
లేచి నడుము కట్టి జాతి పునర్నవీకరణానికి
విశ్వంలోనికి పురోగమించిన ధర్మ ప్రవక్తా,
జోహారులు నీకు, స్వామీ, జోహారులు.

నీ తపస్సు పండిన యీ పునీత శిలాతలం మీద
నేడు నిల్చి భాసిల్లును నీ స్మృతికి అనర్ఘాకృతి;
దాక్షిణాత్య శైలీ కల్పిత శిల్ప శోభా నిలయం,
శ్రీపాద వివేకానంద ధ్యాన నామ మండపత్రయం;
చాటును లోకానికి ఆ కల్పం నీ ధర్మ ప్రబోధం,
కోటికోటి దర్శకులకు కూర్చును నూతనోత్తేజం.
గర్భ గృహాంత ర్ద్యోతమాన సమున్నత కాంస్యమూర్తీ,
వివేకానంద సత్త్వ తేజఃస్ఫూర్తీ, ఆచార్య చక్రవర్తీ,
జోహారులు నీకు, స్వామీ, జోహారులు.

మాతృదేవత భారత రత్నగర్భ ప్రసవించిన
మహోజ్జ్వల మహస్సులు ప్రసరించిన కుమార మణీ,
జోహారులు నీకు, స్వామీ, జోహారులు.

ఆధ్యాత్మికతా దారిద్ర్యంలో ఆకలిగొన్న మానవాళికి
ఆర్ష వేదాంత పాయసం పంచియిచ్చిన త్యాగమూర్తీ,
జోహారులు నీకు స్వామీ, జోహారులు.

దూర దేశాంతరాల దిగ్దిగంతాలలో దివ్య సందేశాల
భూరి సౌరభాలు గుబాళింప చేసిన పారిజాత శాఖీ,
జోహారులు నీకు, స్వామీ, జోహారులు.

ప్రతిమారాధన మాత్రమే పరమార్థ సాధనం కాదని,
పతితమానవసేవయే భగవదారాధన అని
ప్రపంచానికి పరమధర్మ రహస్యం ప్రవచించిన
పరివ్రాజక ప్రబోద్ధా, పరమహంస—అంతే వాసీ,
జోహారులు నీకు, స్వామీ, జోహారులు.*

* స్వామి వివేకానంద 112 వ జయంతి (12–1–1974) సందర్భ స్మృత్యంజలి.

మన ప్రవర

శ్రీ వే. వేమూరి

"నేనెవరు?' అన్నది అనాదిగా మానవజాతిని ఎదుర్కొంటూ వున్న సమస్య. ఈ సమస్యని అనేకులు అనేకవిధాలుగా అర్థం చేసికొని, అనేక విధాలుగా పరిష్కరించడానికి ప్రయత్నం చేసేరు. ఆధ్యాత్మిక చింత ప్రబలంగావున్న రోజులలో యీ ప్రశ్నకి చాలా మంది వేదాంత ధోరణిలో సమాధానాలు చెప్పేరు. ఆధునిక విజ్ఞానశాస్త్రం యీ సమస్యని మరొక కోణం నుండి ఎదుర్కొంది. 'నేను ఎక్కడ నుండి ఎప్పుడు, ఎలా, ఎందుకు వచ్చేనో తెలిస్తే, నేనెవరో అదే తెలుస్తుంది!'' అన్నది యీ శాస్త్రజ్ఞుల పరిశోధనకి పునాది రాయి వంటిది. ఈ నమ్మకంతో భూ, భౌతిక, రసాయనిక, ఖగోళాది శాస్త్రాలు చేతులు కలిపి విశ్వప్రయత్నం చేశాయి, యింకా నేటికీ చేస్తున్నాయి. ఫలితం? ఇప్పటికీ సృష్టి రహస్యం పరిపూర్ణంగా అర్థం కాలేదు.

సృష్టి అంటే తల్లి కడుపున బిడ్డ పుట్టడంవంటి విషయంకాదు, నేను ప్రస్తావిస్తూవున్నది. ఈభూలోకంలో మానవుడు ఎలా అవతరించేడు? ఈ భూమిమీద ప్రాణి ఎప్పుడు ఎలా వుద్భవించి, ఎలా పరిణతి చెందింది? ఈ మహావిశ్వంలో మానవునిపోలిన జీవికాని మరేరకమయిన జీవికాని, యింకెక్కడయినా వుందా? ఒకజీవి ఒక రూపంలో జన్మించి కాలక్రమేణా పరిణతి చెందడానికి కావలసిన వాతావరణాది పరిస్థితులు ఏమిటి?...వగయిరా ప్రశ్నలకి యిదమిద్ధమయిన సమాధానాలు యింతవరకు దొరకలేదంటే అతిశయోక్తి కాదు.

ఈ మహా విశ్వంలో సూర్యునికి ఒక ప్రత్యేక స్థానం వుందనీ, సౌర కుటుంబంవంటి గ్రహ, వుపగ్రహాలతోకూడిన సంతతి మరే నక్షత్రానికీ లేదనీ, యీ సౌర కుటుంబంలో భూగ్రహానికి మరీ ప్రత్యేకమయిన స్థానం వుందనీ, యీ భూగ్రహంమీద తప్ప, యితర గ్రహాలమీద కాని, విశ్వాంతరాళంలో కాని, మానవుని పోలిన జీవియొక్క వునికి అసంభవమనీ కొందరి నమ్మకం. ఈ రకం నమ్మకం చాల సంకుచితమయినదనీ, నిజానికి సూర్యుడు ఒక సామాన్యమయిన మధ్యతరగతి నక్షత్రమనీ, పేదవానికి పిల్లలెక్కువన్నట్లు సూర్యునివంటి మధ్యతరగతి నక్షత్రాల కెన్నిటికో గ్రహ, వుపగ్రహ సమేతమయిన కుటుంబాలు వుండడం ఎంతో సంభవమనీ, కనుక భూగ్రహాన్ని పోలిన గ్రహాలు యీ విశ్వంలో నందలాది వున్నా వింతేమీ లేదనీ, వీటిలో కొన్నింటి మీదనయినా ప్రాణులు వుండడానికి అవకాశం లేకపోలేదనీ, యీ జీవులలో కొన్ని మానవుని కన్నా వున్నతస్థాయి చేరుకొని వుండవచ్చనీ మరికొందరి వాదం. ఈ రెండింటిలో ఏ ఒక్కటీ పరిపూర్ణమయిన విజయం సాధించలేదు.

నేటి వైజ్ఞానిక జగత్తులో యిటువంటి చిక్కువిడని సమస్యలు ఎన్నో వున్నాయి. ఆధారాలను బట్టి గళ్ల నుడికట్టు నింపినట్లు ప్రత్యక్ష నిదర్శనాలను ఆధారాలుగా చేసికొని యీ చిక్కులను విడదీయడానికి శాస్త్రవేత్తలు సర్వదా ప్రయత్నిస్తూనే వున్నారు. సర్వవ్యాప్తమయిన సత్యం మనిషి కొక విధంగా కనిపిస్తుంది. ఒకరి విందు మరొకరికి ముందయినట్లు, ఒక శాస్త్రీయరంగంలో నిరుపయోగమయిన విషయాలు మరొక రంగంలో వుపయోగింపవచ్చు. ఉదాహరణకి భూలోకంలో జరిగిన పరిణతికి,


భూమి చుట్టూ చంద్రుడు పరిభ్రమించే కక్ష్యకి కొంత అవినాభావ సంబంధం వున్నట్లు గోచరిస్తుంది. ఇది ఎలాగో చూద్దాం.

దరిదాపు మూడు బిలియన్ల(3000000000) సంవత్సరాల క్రితం భూలోకంలోని సముద్రాలలో మొట్టమొదట జీవి అవతరించిందని చాలమంది పెద్ద వాళ్ల నమ్మకం. (ప్రాణి ఎక్కడ వుంటే అక్కడ పాపం పెరుగుతుందంటారు కనుక దశావతారాలలో మొదటి అవతారం సముద్రంలో చేప రూపంలో అవతరించింది.) ఇలా సముద్రంలో జనించిన జీవి అలా 260 మిలియన్ల (260 000 000) సంవత్సరాలపాటు అలా సముద్రంలోనే పరిణతి చెందుతూ వుండిపోయింది. దరిదాపు 400 మిలియన్ల (400000 000) సంవత్సరాల క్రితమే జలచరాలు నీటిని వదలి నేల మీద బతకడం నేర్చుకున్నాయని విశ్వసనీయమయిన ఆధారాలవల్ల తెలుస్తూన్నది. అంటే, భూగ్రహంమీద ప్రాణి పుట్టినప్పటినుండి యిప్పటివరకు జరిగిన కాలంలో ఎనిమిదింట ఏడువంతుల కాలం ఆ ప్రాణి అలా నీటిలోనే గడిపిందన్న మాట; నేలమీద ప్రాణి లేనే లేదు. అంటే, ఏమిటన్నమాట? భూలోకంలో ప్రాణి ఏడాది కిందట పుట్టిందని వూహించుకుంటే, ఆ ప్రాణి 46 వారాలపాటు నీటిలోనే వుండి, ఆరు వారాలక్రితమే నేలమీదకి వచ్చిందన్నమాట. ఈ నమూనా ప్రకారం, గత ఆరువారాలలోనే డైనా సోరులు పుట్టిగిట్టేయి; యీ ఆరువారాలలోనే మానవుడు పుట్టి, రెండు ప్రపంచ యుద్ధాలు చేశాడు, మారణాయుధాలతో యీ లోకాన్ని సర్వనాశనం చెయ్యబోయాడు, చంద్రుడిమీద కాలుపెట్టేడు. స్తబ్దంగా వున్న భూగ్రహం అకస్మాత్తుగా చైతన్యవంతం అయిందన్నమాట. (ఈ ఆరు వారాల కాలంలోనే దశావతారాలలో తొమ్మిది సంభవించేయి. ఈ తొమ్మిదింటిలో ఆరు నొక్కటి మానవుడు పుట్టిన తర్వాత! 'ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగే, యుగే' అన్న భగవానుని వాక్కే నిజమయితే, మానవుడు పుట్టిన తర్వాత అధర్మం ఎలా ప్రబలిపోయిందో అర్థం అవుతుంది. ఈ లెక్కని మానవ జన్మ ఎంత పాపిష్టిదో అనిపిస్తున్నది.)


సృష్టిక్రియ పైన సూచించిన పథంలోనే నడచివుంటే ఒక చమత్కారమయిన సమస్య ఎదురవుతుంది. 260 మిలియన్ల సంవత్సరాలు నీటిలోనే బతికిన జీవి అలా నీటిలోనే ఎందుకు మగ్గింది? తర్వాత నేలమీదికి ఎందుకు వచ్చింది? నీటిలో మనుగడకి ముప్పు వచ్చిందా? లేక కేవలం నేలమీద బతుకు ఎలా వుంటుందోనన్న కుతూహలంతో జలచరాలు నేలమీదికి వచ్చాయా?అలాగయితే జలచరాలకి ఆలోచనా శక్తి వుండేదా? కేవలం కుతూహలంతో నేలమీదకివచ్చేయనుకుంటే, యిటువంటి కుతూహలం 400 మిలియన్ల సంవత్సరాలకి పూర్వం పుట్టలేదా?

నీటినుండి నేలమీదకి వలస వెళ్లిన మొదటి ప్రాణులు ఉభయచరాలు, అంటే నీటిలోను, నేల మీద సంచరించ గలిగేవి, అయివుండాలి. (దశావతారాలలో రెండవది కూర్మావతారం. ఉభయచరాలతో పాటు పాపం నేలమీదకి వచ్చేసరికి భగవానుడు ఉభయచరం కావలసివచ్చింది.) తరతరాలపాటు నీటిలో బ్రతికిన ప్రాణికి, నేలమీద మనుగడ మజాకా కాదు. మానవుడు రోదసిలోకి వెళ్లినట్లు జలచరాలు బుద్ధి పూర్వకంగా నీటినుండి నేలమీదకి వెళ్లడం అనేది కొద్దిగా అసంభవంలా కనిపిస్తుంది. కనుక ఏదో తీవ్రమయిన పరిస్థితుల ప్రభావానికి లొంగి, జలచరాలు గత్యంతరం లేక, పొడిగావున్న నేలమీద బ్రతకడం క్రమేపీ నేర్చుకొని వుండివుండాలి. అప్పుడు డార్విన్ సిద్ధాంతం ప్రకారం ఎన్నిక అయిన జాతులు నేల మీద మన్ని వుంటాయి. తరతరాలుగా, సజావుగా సముద్రంలో బతుకుతూవున్న ప్రాణుల పాలిట ఏదో వుప్పెన లాంటిది 400 మిలియన్ల సంవత్సరాల కిందట సంభవించి వుండాలి. ఈ వుప్పెన ఏమిటి?

ఈ ప్రశ్నకి సమాధానం మరొక చోట వెతుకుదాం. సముద్రానికి పోటు పోటులు వస్తాయని మన కందరికీ తెలుసు. రోజుకి రెండుసార్లు సముద్రానికి



గోండ్వానా ఖండం



50,000,000
సంవత్సరాలకిందటి భూమి

పోటు వస్తుంది. ఈ సమయంలో సముద్రం పొంగుకి పల్లపు ప్రదేశాలు మునిగిపోతాయి. కొంతసేపు పోయిన తర్వాత నీరు వెనకకి వెళ్ళిపోతుంది. ఈ సందర్భంలో జలచరాలు కొన్ని నీటితో వెనకకి పోకుండా ఇసుక తిన్నెలవద్ద చిక్కుకొనిపోవడం సహజం—తీర్థంలో పిల్లలు తప్పడి పోయినట్లు! (ద్వందార్థం మాశారా?) ఇలా ఇసుకతిన్నెలవద్ద చిక్కుపడ్డ జీవాల. మళ్ళా పోటు వచ్చేవరకు ప్రాణాలు వుగ్గబట్టుకొని వుండడం అయినా నేర్చుకోవాలి లేదా హరీమని పోవాలి, నీరు లేకుండా మనగలిగిన జీవాలు, క్రమేపీ నేలమీద బతుకుకి అల వాటుపడి వుండివుంటాయి.

ఈ తర్కం మరొక ప్రశ్నని లేవ దీస్తుంది. నీటి నుండి నేలమీదకి ప్రాణివలస వెళ్ళడానికి సముద్రపు పాటు పోటులు కారణం అయితే, ఇూపాటు పోటులు 400 మిలియన్ల సంవత్సరాలక్రితం లేవా? అన్న సందేహం వస్తుంది. ఈప్రశ్నకి సమాధానం కావా లంటే పాటు పోటులకి కారణం ఏదో తెలియాలి. పున్నానికీ, అమావాశ్యకీ సముద్రం పొంగుతుందని మనం అంతా చిన్నప్పుడు ఖగోళశాస్త్రంలో చదువు కున్నాం. ఈపాటు పోటులకి చంద్రుడే కారణమని కూడ చాలమందికి తెలుసు. దీనినిబట్టి తేలినది ఏమిటి? 400 మిలియన్ల సంవత్సరాల కిందట సముద్రంలో పాటు పోటులు మొట్టమొదటిసారిగా వచ్చేయనుకుంటే, అంతకుపూర్వం లేవన్న మాటేగా? అంతకుపూర్వం చంద్రుడు సముద్రానికి పాటుపోటులు ఆపాదించలేదా? ఎందుకు? దీనికి సమాధానం చాల సులభం. 40 మిలియన్ల సంవత్సరాల కిందట చంద్రుడు లేడు. అప్పటికి చంద్రుడు 'పుట్టలేదు!!

ఇదంతా వితండవాదంలా వుంది. ఈ చిక్కుని భేదించడానికి మరొక మార్గం అవలంబిద్దాం.

సౌరకుటుంబంలో నవగ్రహాలు వున్నాయి కదా! అవి: బుధుడు, శుక్రుడు, భూమి, అంగారకుడు (కుజుడు) గురుడు, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో. వీటిలో అయిదు కైవారంలోనూ, భారం లోనూ చిన్నవి; అవి: బుధుడు, శుక్రుడు, భూమి, అంగారకుడు, ప్లూటో. మిగిలిన నాలుగు బ్రహ్మాండం మయిన గ్రహాలు. ఈపెద్ద గ్రహాలన్నిటికి పెద్ద పెద్ద వుపగ్రహాలు కూడ వున్నాయి. చిన్న గ్రహాలలో ఒక్క భూమికితప్ప మరే గ్రహానికి చెప్పుకోదగ్గ వుపగ్రహాలు లేనేలేవు. అంగారకుడికి నామకః, గోళీకాయల లాంటివి రెండు వుపగ్రహాలున్నాయి కాని అవి వుపగ్రహాలకోవకి చెందవు. నిజానికి భూమి కథమాత్రం వేరు. భూమి చుట్టూ తిరుగుతూవున్న చంద్రుడు సౌరకుటుంబం లోని పెద్ద పెద్ద వుపగ్రహాలలో ఒకడు. నిజానికి చంద్రుడువంటి పెద్దనభోమూర్తి భూమివంటి చిన్న గ్రహానికి తగడు. ఇదే విషయాన్ని మరొక విధంగా చెబుతాను. సూర్యమండలంలోని వుపగ్రహాలన్నీ వాటి వాటి మాతృ గ్రహాలలో వెయ్యవ వంతుకి మించి లేవు; కాని చంద్రుడుమాత్రం భూమిలో ఎనభయ్యవ వంతు వున్నాడు. అంటే, వాటి వాటి మాతృ గ్రహాలతో పోల్చిచూస్తే, భూమికి వుపగ్రహంగావున్న చంద్రుడు ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించేడన్నమాట.

మరొక విధంగా చూసినా చంద్రుడి పరిస్థితి అంతా తిరకాసుగానే కనిపిస్తుంది. సౌరకుటుంబం లోని గ్రహాలన్నీ, దరిదాపుగా, సూర్యుని మధ్యతలం (Equatorial p'ane)లో పరిభ్రమిస్తున్నాయి. ఇదే విధంగా సౌరకుటుంబంలోని వుపగ్రహాలన్నీ, దరిదాపుగా వాటి వాటి మాతృ గ్రహాల మధ్యతలంలో పరిభ్ర మిస్తున్నాయి—ఒక్కచంద్రుడు తప్ప. చంద్రుడు ఎలా పరిభ్రమిస్తున్నాడు? తిరిగేది భూమిచుట్టూ అయినా, మిగిలిన గ్రహాలవలె చంద్రుడు, సూర్యునియొక్క మధ్యతలంలో పరిభ్రమిస్తున్నాడు. ఆకారంలోను, భారంలోను, ప్రవర్తనలోను చంద్రుడు గ్రహంవలె ప్రవర్తిస్తున్నాడు కాని వుపగ్రహంలా ప్రవర్తించడం లేదు. (ఇంత తిరకాసుగావున్న చంద్రుడి కళలతో భూమివిూద మనుష్యుల కళలు మారతాయంటే ఆశ్చర్యం లేదు!) ఈ ఆధారాలనిబట్టి చంద్రుడు ఒకానొకప్పుడు, సూర్యునిచుట్టూ గ్రహంలా తిరిగే వాడేమోనని అనుమానం రాకపోదు. (వరాహ మిహి రుడు జాతక శాస్త్రంలో చంద్రుడిని గ్రహంలాగే గౌర వించేడు కాని వుపగ్రహంలా కించపరచలేదు.)

ఈ మధ్య మనవాళ్ళు చంద్రగ్రహం విూద కాలుపెట్టి వచ్చారు కదా! అక్కడనుండి వాళ్ళు కొన్ని రాళ్ళు పట్టుకొచ్చేరు. ఈ రాళ్లలో కొన్ని కొలిమిలో పెట్టి కాల్చినట్లు బాగా కాలివున్నాయిట. చంద్రుడు

ప్రస్తుతం భూమిచుట్టూ తిరుగుతూవున్న కక్ష్యలోనే ఎల్లప్పుడూ తిరిగివుంటే చంద్ర శిలలు అంతలా మాడి నట్లు వుండడానికి అవకాశం లేదుట. ఈ ఆధారాలని బట్టి చంద్రుడు ఎప్పుడో ఒకప్పుడు సూర్యునికి దగ్గ రగా వున్న కక్ష్యలో పరిభ్రమించి వుండాలని శాస్త్ర వేత్తల అంచనా. ఇటువంటివి అనేక ఆధారాలను పరిశీ లించి ఆధునిక శాస్త్రవేత్తలు ఏమంటున్నారంటే: ఒకానొకప్పుడు చంద్రుడు, మిగిలిన గ్రహాల వలె సూర్యుని చుట్టూ తిరిగేవాడనీ, అప్పుడు చంద్రుని కక్ష్య దీర్ఘ వృత్తాకారంలో వుండేదనీ, యీ దీర్ఘ వృత్తాగ్రం ఒకటి సూర్యునికి దగ్గరగాను, మరొక అగ్రం భూమికి దగ్గరగాను వుండేదనీ, క్రమేపీ భూమి ఆకర్షణ శక్తికి లోనయి చంద్రుడు భూమికి వుపగ్రహంగా మారేడనీ, యిదంతా దరిదాపు 60 మిలి యన్ల సంవత్సరాల క్రితం జరిగిందనీ వాదిస్తున్నారు.

ఈ సంఘటన జరిగిన కొత్తలో చంద్రుడు భూమికి యింకా దగ్గరగా వుండేవాడనడానికి ఆధారాలు వున్నాయి. చంద్రుడు భూమి చుట్టూ పరిభ్రమిం చడం మొదలుఅయిన దగ్గరనుండీ ఆవర్తకంగా సము ద్రంలో పాటుపోటులు రావడం మొదలయిందన్న మాట. చంద్రుడు దగ్గర కావడంవల్ల ఆ రోజులలో యీ పాటుపోట్లు బాగా తీవ్రంగా వుండేవన్న మాట. (క్షీరసాగర మధనంలో చంద్రుడు పుట్టడం కాదు; చంద్రుని 'పుట్టుక'వల్ల మన సాగరాలు మథించబడ్డా యన్న మాట.) చైతన్యవంతమయిన ఆ రోజులలో జలచరాలు నెమ్మదిగా నేలమీదకి వచ్చివుండాలి.

ఈ గాథంతా నిజమే అయితే మన మనుగడ చంద్రుడి మీద ఎంత ఆధారపడివుందో అర్థం అవు తుంది. ఈ గాథంతా నిజమయితే పొడిగావున్న నేలమీద ప్రాణి ఆరంభం అవడానికి చంద్రునివంటి వుపగ్రహం వుండాలన్న మాట. సూర్యునివంటి సామాన్యమయిన నక్షత్రం వుండాలి. ఆనక్షత్రానికి గ్రహకూటమివుండాలి. ఆ గ్రహాలలో ఒకటి ఆ నక్షత్రానికి మరీ దూరంకాకుండా, మరీ దగ్గర కాకుండా, వుండాలి. అలావున్న గ్రహంమీద నీరువుండాలి. ఉంటే ఆ నీటిలో ప్రాణి పుట్టడానికి అవకాశం వుందన్నమాట. ఆ గ్రహానికి చంద్రునివంటి పెద్ద వుపగ్రహంకూడ వుంటే నీటిలోని ప్రాణి నేల మీదకివచ్చి, వర్ధిల్లి మానవుని వంటిప్రాణి పుట్టడానికి అవకాశం కలుగుతుందన్నమాట. ఈగొంతే లమ్మ కోరిక లన్నీ యీ మహావిశ్వంలో మరెక్కడయినా నెరవేరితే అక్కడ మనలాంటి వాళ్లు, మనలాగే కొట్టుకుంటూ వుండవచ్చు.

ఇంతవరకు వ్రాసిన విషయాన్ని ఒకసారి నెమరువేద్దాం. చంద్రుడు ఒకానొకప్పుడు సూర్యుని చుట్టూ తిరుగుతూ వుండేవాడు. కారణాంతరాలవల్ల యీ చంద్రుడిని భూమి తస్కరించింది. తత్కా రణంగా చంద్రుడు భూమిచుట్టూ తిరగడం మొదలు పెట్టేడు. చంద్రుడికీ, భూమికీ మధ్యనున్న గురుత్వా కర్షణశక్తివల్ల భూమిమీద సముద్రాలలో పాటు పోటులు రావడం మొదలయాయి. ఈపాటు పోటుల కారణంగా సముద్రంలోని ప్రాణులు కొన్ని సముద్రపు టొడ్డున చిక్కుపడి పోయాయి. ఈ చిక్కుపడ్డ జీవాలు క్రమేపీ మార్పులు చెంది, యీరోజున మనం చూస్తూవున్న నానావిధ రూపాలలో వర్ధిల్లుతున్నాయి. ఇదంతా దరిదాపు 400-600 మిలియన్ల సంవత్స రాల క్రితం జరిగి వుండివుండాలని అంచనా. పాఠ కులు ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. పైన నేను వ్రాసినది కొంతవరకు పెద్ద పెద్ద విద్వాంసులు ప్రతిపాదించినది; కొంతవరకు నా వూహాగానం! నిజం ఆ పరమాత్ముడికే ఎరుక! మనం చెయ్యగలిగేది అల్లా తార్కికంగా ఆలోచించి, మన వూహాలకి బలం చేకూర్చడమే.

ప్రాణి నీటిలోనుండి నేలమీదకి ఏయే పరి స్థితులలో వచ్చి వుండవచ్చో వూహాగానం చేశాము. ఈ సంఘటన యీ భూలోకంలో ఎక్కడ జరిగింది? అంటే, యీ నేలమీదకి వచ్చిన ప్రాణులు భారత దేశంలో నేలమీదకి వచ్చాయా? అమెరికాలోనా? ఆస్ట్రేలియాలోనా?...ఈ సందేహం సహజం.

ఈ ప్రశ్నకి సమాధానం కావాలంటే భూగర్భ శాస్త్రాన్ని మరొక దిశనుండి పరీక్షించాలి. ఈ భూగోళంమీద ఆరు ఖండాలున్నాయన్నది అందరికీ తెలిసినదే. అవి: ఆశియా, ఆఫ్రికా, ఐరోపా, అమె రికా, ఆస్ట్రేలియా, అంటార్కిటికా. ఈ అంటా ర్కిటికా అనేది దక్షిణ ధృవం దగ్గరవున్న భూభాగ మని యీ మధ్యనే తెలిసింది. ఈ ఆరు ఖండాలనీ విడగొడుతూ అయిదు మహాసముద్రాలు వున్నాయి. ఇది నేటి సంగతి. కొన్ని మిలియన్ల సంవత్సరాల

కిందట భూమిమీద ఒకే ఒక ఖండం ఒకే ఒక మహా సముద్రం వుండేవని అనడానికి చాల ఆధారాలు వున్నాయి. ఈ మహాఖండాన్ని 'గొండ్వానా ఖండం' అని పిలుస్తారు శాస్త్రవేత్తలు. ఈ మహాఖండం 100–200 మిలియన్ల సంవత్సరాల కిందట బద్ద లయి పోయిందట. ఈ పగుళ్ల వెంబడి యీ భూభాగం విడిపోయి, ఏ ముక్కకాముక్క నాలుగు దిశలా నెమ్మదిగా ప్రయాణం చేస్తూ వెళ్లిపోయిందిట. ఈ గొండ్వానా ఖండం విడిపోక పూర్వము ఎలా వుండేదో, విడిపోయిన తర్వాత ఎలా వుండేదో రెండు విడివిడి పటాలుగీసి చూపేను. (పటం చూడండి!) ఈ సిద్ధాంతమే నిజమయితే భారతదేశం ఒకానొకప్పుడు దక్షిణ ధృవం దగ్గర వుండేదన్నమాట. గొండ్వానా ఖండం బద్దలయి పోయిన తర్వాత, ప్రస్తుతం మన భారతదేశం అనే భూభాగం, అలా 30—40 మిలియన సంవత్సరాలపాటు హిందూ మహాసముద్రంలో 5000 కిలోమీటర్లు పెళ్లి నడకలు నడిచిందిట. ఏడాదికి 7–20 సెంటిమీటర్ల చొప్పున యిలా వుత్తర దిశగా ప్రయాణం చేసింది. ఈ 30–40 మిలియన్ల సంవత్సరాలు భారతదేశం నాలుగుపక్కలా హిందూ మహాసముద్రమే వుండేది. అంటే, 30–40 మిలియన్ల సంవత్సరాలపాటు భారతదేశం ఒక ద్వీపం అన్నమాట: అందుచేతనే మన వాళ్లు భారతదేశాన్ని 'జంబూ ద్వీపం' అన్నారేమో! ఈ జంబూ ద్వీపం అలా ప్రయాణంచేసి యూరేశియా భూభాగాన్ని ఢీకొందిట. అప్పుడు భూమి దద్దరిలి వుండాలి! ఈ ఢీకారానికి ఫలితంగా భూమికి బొప్పి కట్టింది. ఆ బొప్పే మన హిమాలయా పర్వతాలు అని కొందరి నమ్మకం.

ఈ భారతం అంతా ఎందుకు చెబుతున్నాను అని మీరు చిరాకు పడవచ్చు. దీనికి కారణం వుంది. నీటినుండి నేలమీదకి ప్రాణివచ్చి దరిదాపు 400 మిలియన్ల సంవత్సరాలు అయిందని కదా అనుకున్నాము. 100–200 సంవత్సరాల కిందట గొండ్వానా ఖండం బద్దలయిందని కూడ అనుకున్నాం. అంటే, జీవ రాసులు యీ గొండ్వానా ఖండంమీద దరిదాపు 200 మిలియన్ల సంవత్సరాలు వర్ధిల్లిన తర్వాత యీ ఖండం విడిపోయింది. జంబూ ద్వీపం పుట్టింది. పడవలలో ప్రయాణీకులలాగ అప్పుడు ఏ ఖండంలోవున్న జీవరాసులు ఆ ఖండంలోనే చిక్కడి పోయాయి. ఈ జీవరాసులు ఆయా ఖండాలలోవున్న వాతావరణాది పరిస్థితులకి తలవొగ్గి డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతము ప్రకారం పరిణతి చెందివుంటాయి. జంబూ ద్వీపం 5000 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసింది కనుక, యీ ప్రయాణ కాలంలో విపరీతమయిన వాతావరణపు మార్పులకు లోనయి వుంటుంది. విపరీత మయిన వాతావరణపు మార్పులు జీవరాసుల పరిణతిని త్వరితీకరిస్తాయన్నది ప్రజాదరణ పొందిన భావం. వాతావరణపు మార్పువల్లనే కదా నీటిలోని జీవి నేల మీదకి వచ్చిందన్నాము. పయనను యే ఖండా లన్నిటిలోను ఎక్కువ దూరం పయనించినది జంబూ ద్వీపం కనుక, యీ ద్వీపంలో వచ్చిన వాతావరణాది మార్పులకి, యీ జంబూ ద్వీపంలోనే మొట్టమొదటి మానవుని పోలిన ప్రాణి పుట్టివుండవచ్చుని నా అను మానం. ఈ తర్కం నిజమయితే జంబూ ద్వీపం ఆశియా ఖండపు భూభాగాన్ని ఢీకొనే వేళకి మాన వుని ముత్తాతలు అవతరించి వుండాలి. దీనికి రుజువేదీ?

భూగర్భంలో దొరికే శిలాస్తులు (Fossils) పరిశీలించి అనాదిలో జరిగిన విషయాలను వూహించ వచ్చు. అయిదారు సంవత్సరాల కిందటివరకు లభ్య మయిన శిలాస్తులనిబట్టి మానవుడు దరిదాపు 500,000 సంవత్సరాల కిందటే యీ లోకంలో అవతరించేడని శాస్త్రవేత్తలు నమ్మేవారు. ఈ మధ్య దొరకిన కొత్త కొత్త ఆధారాలనుబట్టి (అంటే మరీ పాత పాత శిలాస్తులు దొరికేయన్నమాట) మానవుడు 1000000 (మిలియను) సంవత్సరాల కిందటే పుట్టి వుండవచ్చునంటున్నారు. కాని, 30 మిలియన్ల సంవత్సరాల కిందట జంబూ ద్వీపంలో మానవుడు వున్నాడా అంటే ఇదమిద్ధంగా సమాధానం చెప్పలేము. ఒక మిలియనుకి ముప్పయి మిలియన్లకి నక్కకీ నాగ లోకానికి వున్నంత దూరం వుంది. కాని అసంభవం అనుకున్న వెన్నో సంభవమని రుజువు చేశారు శాస్త్ర వేత్తలు. 'ఇవన్నీ మా వేదాలలో వున్నాయిషా! అని అప్రమత్తతతోవుండేకంటె వేదాలలోవున్న విషయాలలో సత్యం ఎంతో పరిశోధనచేసి తేల్చాలి. దీనికి వేదాలలో ఏమిటివుందో మనకి తెలియాలి. వేదంవరకు ఎందుకు? మంత్ర పుష్పం అంటే ఏమిటో తెలియని మహానుభావులున్నారు.

కుండలీకరణం

దేవిప్రియ

బావిలో నీళ్ళకూ
సంకెళ్ళు తగిలించబడ్డ కాళ్ళకూ
నీకూ మధ్య కనిపించదేం రవంతైనా వ్యత్యాసం

ఆఫీసులో టైపు రైటరూ
యింట్లో టేబుల్ లైటూ;
ఒకటి నాదబ్రహ్మ
మరొకటి పరంజ్యోతి
నీలోనే నీకు సమాధి

విశ్వమంతా నిండి
అనంత జీవరాశి నరాలగుండా
స్వరాలాపన చేసుకుంటూ
సమస్త ప్రాణ వృక్ష సంతతినీ ఊపేస్తూ
ప్రవహిస్తూవున్న గాలి స్పర్శ నీలో
ఆకు కదిలిన మాత్రమైనా
చలనం కలిగించదు.

ఈ వేకువ ఈ సాయం సంధ్య
ఈ పక్షుల రెక్కల రెపరెపలు
ఈ ప్రాణ సముద్రంలో
కదలాడుతున్న స్పందన కెరటాలు
తెల్ల కాగితం ఆకాశాలమీద
పాకుతున్న పాళీ మెరుపులు............
నీకు కదలడం వ్యాపించడం
గర్భ శత్రువులు.
జీవితాన్ని కుండలీకరించుకుని
బ్రాకెట్లమధ్యనే బతుకు సుఖం
—అనుభవిస్తున్న నీకూ

ఆలోచనని విశ్లేషించుకుని
సమాజం పుస్తకంలో చకా చకా
పేజీలు దాటుతున్న నాకూ
ఎంత వ్యత్యాసం !

కథానిక :

"ఆల్కెమీ"

"జానకీ జాని"

'అన్నం వడ్డించాను నాన్నా'.

గుమ్మం దగ్గర నిలబడి మెల్లిగా అంది విమల. 'వచ్చేస్తున్నానమ్మా' టెస్ట్ ట్యూబుని తదేక ధ్యానంతో చూస్తూ అన్నాడు ప్రొఫెసర్ రాజశేఖరం. టెస్ట్ ట్యూబులో ద్రవంలాగే అతని ముఖమూ రంగులు మార్చుకుంటోంది. అంతలో ఆనందం, అంతలో నిరాశ, అంతలో ఉత్సాహం, అంతలోనే విసుగూ—పరస్పర విరుద్ధాలైన భావాలు అతని మనస్సులో ఒక వలయం మీద నిలబడి ఒకదాన్నొకటి తరుము కుంటూ పోతున్నాయి. దృష్టిని టెస్ట్‌ట్యూబు మీదే కేంద్రీకరిస్తూ ఆలోచిస్తున్నాడు రాజశేఖరం.

'నాన్నా, అన్నం చల్లారిపోతోంది'. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అంది విమల.

'ఒక్క నిమిషం తల్లీ, వచ్చేస్తున్నాను.'

అటు తిరక్కుండానే అన్నాడు రాజశేఖరం. ఈ సమాధానాలకి రాజశేఖరం ఆలస్యానికీ అలవాటుపడ్డ విమల గదిలోంచి డైనింగ్ హాలులోకి దారి తీసింది.

రాజశేఖరం మరో టెస్టు ట్యూబులోకి ఇంకో రకం ద్రవం తీసుకుని పరిశోధన కొనసాగిస్తూనే వున్నా, అతని మనస్సు మాత్రం ఏవేవో ఆలోచన లతో సుళ్లు తిరుగుతూనే వుంది.

మూడేళ్ల క్రితం కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా రిటై రయి ఇంట్లోనే లేబొరేటరీ ఏర్పాటు చేసుకున్నాడు రాజశేఖరం. అంతవరకూ ఎందరో ప్రయత్నించిందీ, ఎవరూ సఫలం కానిదీ అయిన దాంట్లో విజయం సాధించాలని అతని ఆశయం. 'మిస్టర్ రాజశేఖరం, నీ ఆలోచనే నీదిగాని, బేస్ మెటల్స్‌ని బంగారంగా మార్చగలంటయ్యా. వృధా ప్రయత్నం మాని ఇంకేదైనా ఉపయోగకరమైన పని పెట్టుకో''

రెండేళ్లక్రితమే సలహా యిచ్చాడు తనతోపాటే రిటైరయిన ఇంగ్లీషు ప్రొఫెసర్ విశ్వనాధం. ఎవరెన్ని విధాల చెబుతున్నా రాజశేఖరం నిర్ణయం సడలలేదు. ఆ లేబొరేటరీలోనే నిద్రాహారాలు లేకుండా గడపటం అతనికి ఇంచుమించు దినచర్యగా పరిణమించింది.

ఇక రెండేళ్లకి రిటైరవుతాడనగా రాజశేఖరానికి భార్యావియోగం కలిగింది. విశాలమైన కాళీస్థలంలో అన్ని హంగులూ వుండేటట్టు మేడ కట్టుకున్నాక అన్నింటినీ వదలిపెట్టి వెళ్లిపోయిందామె. ఉన్న ఒక్క కూతుర్నీ చదివిస్తూ కాలక్షేపానికని పెట్టుకున్న ఈ కార్యక్రమం అతనికో వ్యసనంలా పరిణమించింది. తను అందులో చిక్కుకున్నాడు. ఫలితం సాధించనూ లేదు. పని విరమించనూ లేదు.

ఆ పూటకి పరిశోధన ఆపి గదినుంచి బయ టకు నడిచాడు రాజశేఖరం. ఎదురుగా కిటికీ గుమ్మం దగ్గర నుంచుంది విమల. అతని మనస్సు చివుక్కు మంది.

''విమలకి పెళ్లీడు వచ్చింది. మంచి సంబంధం చూసి పెళ్లి చేసెయ్యాలి.'' విమల కిటికీ దగ్గర నుంచోటం చూసినప్పుడల్లా అనుకుంటాడు రాజ శేఖరం. తను లేబొరేటరీలో అడుగు పెట్టగానే అన్నీ

కథానిక :

"ఆల్కెమీ"

"జానకీ జాని"

'అన్నం వడ్డించాను నాన్నా'.

గుమ్మం దగ్గర నిలబడి మెల్లిగా అంది విమల. 'వచ్చేస్తున్నానమ్మా' టెస్ట్ ట్యూబుని తదేక ధ్యానంతో చూస్తూ అన్నాడు ప్రొఫెసర్ రాజశేఖరం. టెస్ట్ ట్యూబులో ద్రవంలాగే అతని ముఖమూ రంగులు మార్చుకుంటోంది. అంతలో ఆనందం, అంతలో నిరాశ, అంతలో ఉత్సాహం, అంతలోనే విసుగూ— పరస్పర విరుద్ధాలైన భావాలు అతని మనస్సులో ఒక వలయం మీద నిలబడి ఒకదాన్నొకటి తరుము కుంటూ పోతున్నాయి. దృష్టిని టెస్ట్‌ట్యూబు మీదే కేంద్రీకరిస్తూ ఆలోచిస్తున్నాడు రాజశేఖరం.

'నాన్నా, అన్నం చల్లారిపోతోంది'. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అంది విమల.

'ఒక్క నిమిషం తల్లీ, వచ్చేస్తున్నాను.'

అటు తిరక్కుండానే అన్నాడు రాజశేఖరం. ఈ సమాధానాలకి రాజశేఖరం ఆలస్యానికీ అలవాటుపడ్డ విమల గదిలోంచి డైనింగ్ హాలులోకి దారి తీసింది.

రాజశేఖరం మరో టెస్టు ట్యూబులోకి ఇంకో రకం ద్రవం తీసుకుని పరిశోధన కొనసాగిస్తూనే వున్నా, అతని మనస్సు మాత్రం ఏవేవో ఆలోచన లతో సుళ్లు తిరుగుతూనే వుంది.

మూడేళ్ల క్రితం కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా రిటై రయి ఇంట్లోనే లేబొరేటరీ ఏర్పాటు చేసుకున్నాడు రాజశేఖరం. అంతవరకూ ఎందరో ప్రయత్నించిందీ, ఎవరూ సఫలం కానిదీ అయిన దాంట్లో విజయం సాధించాలని అతని ఆశయం. 'మిస్టర్ రాజశేఖరం, నీ ఆలోచనే నీదిగాని, బేస్ మెటల్స్‌ని బంగారంగా మార్చగలంటయ్యా. వృథా ప్రయత్నం మాని ఇంకేదైనా ఉపయోగకరమైన పని పెట్టుకో"

రెండేళ్ల క్రితమే సలహా యిచ్చాడు తనతోపాటే రిటైరయిన ఇంగ్లీషు ప్రొఫెసర్ విశ్వనాథం. ఎవరెన్ని విధాల చెబుతున్నా రాజశేఖరం నిర్ణయం సడలలేదు. ఆ లేబొరేటరీలోనే నిద్రాహారాలు లేకుండా గడపటం అతనికి ఇంచుమించు దినచర్యగా పరిణమించింది.

ఇక రెండేళ్లకి రిటైరవుతాడనగా రాజశేఖరానికి భార్యావియోగం కలిగింది. విశాలమైన కాళీస్థలంలో అన్ని హంగులూ వుండేటట్టు మేడ కట్టుకున్నాక అన్నింటినీ వదలిపెట్టి వెళ్లిపోయిందామె. ఉన్న ఒక్క కూతుర్నీ చదివిస్తూ కాలక్షేపానికని పెట్టుకున్న ఈ కార్యక్రమం అతనికో వ్యసనంలా పరిణమించింది. తను అందులో చిక్కుకున్నాడు. ఫలితం సాధించనూ లేదు. పని విరమించనూ లేదు.

ఆ పూటకి పరిశోధన ఆపి గదినుంచి బయ టకు నడిచాడు రాజశేఖరం. ఎదురుగా కిటికీ గుమ్మం దగ్గర నుంచుంది విమల. అతని మనస్సు చివుక్కు మంది.

"విమలకి పెళ్లీడు వచ్చింది. మంచి సంబంధం చూసి పెళ్లి చేసెయ్యాలి." విమల కిటికీ దగ్గర నుంచోటం చూసినప్పుడల్లా అనుకుంటాడు రాజ శేఖరం. తను లేబొరేటరీలో అడుగు పెట్టగానే అన్నీ

కుండలీకరణం

దేవిప్రియ

బావిలో నీళ్ళకూ
సంకెళ్ళు తగిలించబడ్డ కాళ్ళకూ
నీకూ మధ్య కనిపించదేం రవంతైనా వ్యత్యాసం

ఆఫీసులో టైపు రైటరూ
యింట్లో టేబుల్ లైటూ;
ఒకటి నాదబ్రహ్మ
మరొకటి పరంజ్యోతి
నీలోనే నీకు సమాధి

విశ్వమంతా నిండి
అనంత జీవరాశి నరాలగుండా
స్వరాలాపన చేసుకుంటూ
సమస్త ప్రాణ వృక్ష సంతతినీ ఊపేస్తూ
ప్రవహిస్తూవున్న గాలి స్పర్శ నీలో
ఆకు కదిలిన మాత్రమైనా
చలనం కలిగించదు.

ఈ వేకువ ఈ సాయం సంధ్య
ఈ పక్షుల రెక్కల రెపరెపలు
ఈ ప్రాణ సముద్రంలో
కదలాడుతున్న స్పందన కెరటాలు
తెల్ల కాగితం ఆకాశాలమీద
పాకుతున్న పాలీ మెరుపులు............
నీకు కదలడం వ్యాపించడం
గర్భ శత్రువులు.
జీవితాన్ని కుండలీకరించుకుని
బ్రాకెట్లమధ్యనే బతుకు సుఖం
—అనుభవిస్తున్న నీకూ

ఆలోచనని విశ్లేషించుకుని
సమాజం పుస్తకంలో చకా చకా
పేజీలు దాటుతున్న నాకూ
ఎంత వ్యత్యాసం !

మరచిపోతాడు. రాజశేఖరం మనస్సులో చెప్పలేనంత వేగంగా వీస్తోంది ఈదురుగాలి.

అతనికి నెలరోజుల క్రితం జరిగిన సంగతి జ్ఞాపకం వచ్చింది. కిటికీ దగ్గర నుంచున్న విమలవెనకే వెళ్ళి తనూకిందకి చూశాడు. అప్పటికిగాని అతనికి అర్థం కాలేదు. రోజుకి ఎన్నో సార్లు తన ఇంటి ముందు నుంచి వెళ్ళటానికి కారణం. అతనికి విమలమీదకంటె తనమీదే ఎక్కువ కోపం వచ్చింది.

‘నిజమే తప్పు విమలది కాదు. వయస్సుది. ఇంకా ఆలోచిస్తే తనది.’

రాజశేఖరం తాపీగా అనుకున్నాడు. ఆ సాయంత్రం తను షికారుకి వెళ్ళి తిరిగి వస్తూండగా ఇంటి గేటు దగ్గర నిలబడ్డ కుర్రాణ్ణి పరీక్షగా చూశాడు. అతను తనదగ్గిర చదువుకున్నవాడే. తన్నిచూసి కంగారు పడిపోయాడు. మెల్లిగా బుజంమీద చెయ్యివేస్తూ అన్నాడు. ‘చూడు మిస్టర్. ఇటువంటి పనులు నాకు గిట్టవ్. నీకు నిజంగా విమలని పెళ్ళి చేసుకోవాల నుంటే మా తల్లి దండ్రులని సంప్రతించి, అప్పుడు నా దగ్గరకు రా. అంతేగాని పొద్దస్తమానమూ ఇక్కడ పేరేడ్ చెయ్యటం ఏమీ బాగుండదు.’

సమాధానం చెప్పకుండా బెరుగ్గా వెళ్ళిపోతున్న కుర్రాడివంక చూస్తూ నవ్వుకున్నాడు రాజశేఖరం. ఇది జరిగి నెల కావస్తోంది. ఐనా ఆ కుర్రాడువచ్చి తనను కలుసుకోనూ లేదు ఇంటికి రావటం మాననూ లేదు.

ఎవరో ఏడుస్తున్నట్లు వినిపించటంతో ఆలోచనల్లోంచి తేరుకుని డైనింగ్ హాలులోంచి ముందు వరండాలోకి వచ్చాడు రాజశేఖరం.

ఏడుస్తున్న అసిరమ్మని ఓదారుస్తోంది విమల.

‘ఏనమ్మా మళ్ళీ ఏమయింది?’ ఆదుర్దాగా అడిగాడు రాజశేఖరం.

‘ఏటుంది బాబూ. ఆ సచ్చినోడు తెగతాగిసి గొడ్డునా బాదీసి నాడు. అడ్డొచ్చిన పిల్లదాని ఒల్లు ఊసం అయిపోనాది’ ఏడుస్తోంది అసిరమ్మ.

‘నే కనుక్కుంటాలే కాని నువ్వూరుకో. పోయి పిల్లల్ని చూసుకో’ ఓదార్పు ధోరణిలో అన్నాడు రాజశేఖరం.

‘అది కాదు నాన్నా, నువ్వు చంద్రిగాడికి గట్టిగా బుద్ధిచెప్పాలి. ఇక్కడికి రెండేళ్ళనుంచీ సాగుతోంది ఈ భాగవతం. ఒక్కసారి పోలీసు రిపోర్టిచ్చి జైల్లో పెట్టించ రాదూ:’

అమాయికంగా అంది విమల.

‘అలాగే తల్లీ. ఆ విషయం నేచూస్తాగా. నువ్వు ఇంట్లోకి పద. ఒంటిగంట కావస్తోంది. ఇంకా భోజనాలు కానేలేదు.’ లోపలికి నడుస్తూ అన్నాడు రాజశేఖరం. అతని మనస్సంతా చంద్రిగాడు ఆక్రమించుకున్నాడు.

విశాలమైన స్థలంలో ఒక్కళ్ళూ వుండలేక గేటుపక్క పాకవేసి చంద్రిగాణ్ణి కావలా పెట్టాడు రాజశేఖరం. వాడు కార్ల కంపెనీలో మెకానిక్కు. అక్కడ వచ్చేజీతంకాక ఆపనీ, ఈ పనీచేసి ఎంతో సంపాదిస్తాడు. నిజానికి వాళ్ళు ఆ ఇద్దరు పిల్లల్నీ పెట్టుకుని ఏంతో రాజ్యాంగంగా బతకొచ్చు. కాని చంద్రిగాడిలో అన్ని సద్గుణాలతోబాటూ ఓ రెండు మచ్చలూ వున్నాయి. వాడికి బ్రాకెట్లపిచ్చి. డబ్బంతా దానికోసం తగలేస్తాడు. అర్థం కాకపోయినా భూతద్దం కొనుక్కొని ఇంగ్లీషు పత్రికలు తిరిగేస్తాడు. తెలిసినా తెలియకపోయినా పెద్ద ఛార్టు తయారుచేసి కాళీ వున్నప్పుడల్లా చూస్తూ కూచుంటాడు.

చంద్రిగా ఎందుకురా డబ్బులా వూరికే తగలేస్తావు? బ్రాకెట్లవల్ల బాగుపడ్డవాణ్ణి ఒక్కణ్ణైనా చూశావా? పెళ్ళాం పిల్లల్ని చూసుకుంటూ సుఖంగా బ్రతకలేక ఎందుకొచ్చిన పాడుబుద్ధి చెప్పు?’

రాజశేఖరం ఎన్నోసార్లు చివాట్లు వేశాడు చంద్రిగాణ్ణి. ‘మానేత్తాను బాబూ. టీకొట్టు ముత్యాలికి నాలుగొందలు రానేదా? ఒక్క ఠాన్సు చూసి మానేత్తాను.’

చంద్రిగాడు ఈ సమాధానం రెండేళ్ళనుంచీ

చెబుతున్నాడు. రాజశేఖరానికి అసిరమ్మ మీద కూడా కోపం వచ్చింది. మొగుడు డబ్బు తగలేస్తున్నప్పుడు అదెంత జాగ్రత్తగా వుండాలి? ఓ అర్ధ రూపాయి కళ్లబడితే చాలు సినిమాకి తుర్రుమంటుంది. నిజానికి అసిరమ్మ చూడని సినిమా లేదు. ఒక్కసారే చూసిన సినిమా కూడా లేదు. అదే అంటాడు చంద్రిగాడు. 'నన్నూరికే ఆడిపోసుకుంటావ్. నువ్వు సేసే పనేటే' అని ఈ మాట వాడనగానే అసిరమ్మ గుడిసెలోకి జారుకుంటుంది. చిత్రమైనవాళ్ల దాంపత్యం విషయం ఆలోచిస్తూనే ఎలాగో భోజనం అయిందనిపించాడు రాజశేఖరం.

భోజనంచేసి పడక్కుర్చీ మీదే ఓ అరగంట నడుం వాల్చటం అలవాటు రాజశేఖరానికి. కాస్త బడలిక తీరగానే మళ్లీ లేబొరేటరీ పిలుస్తుంది. సూదంటు రాయిచేత ఆకర్షింపబడే ఇనుపముక్కలా అందులో ప్రవేశిస్తాడు. ఈగల్లా ముసురుకుంటున్న ఆలోచనలని అణచటానికి ప్రయత్నిస్తున్న రాజశేఖరానికి ఎప్పుడు పట్టిందో కాస్త కునుకు పట్టింది. ఆ నిద్రలోనే ఓ పక్క ఇనుమూ ఓ పక్క బంగారమూ కనిపించాయి. ఇనుమంతా పోయి ఒక్క బంగారమే కనిపించాలని అతని ఆశ. కాని కలలోకూడా ఇనుము కనిపించడంతో ఒక్కసారి అతనికి మెలకువ వచ్చింది. బద్ధకంగా ఒళ్లు విరుచుకుని ముందు గదిలోకి వచ్చాడు.

రాజశేఖరానికి మళ్లీ విమల పెళ్లి జ్ఞాపకం వచ్చింది. చప్పుడు చెయ్యకుండావెళ్ళి ఆమె వెనకగా నుంచున్నాడు. కిటికీలోంచి కనిపించిన దృశ్యం అతణ్ణి ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. గేటుముందర ఆగివున్న ఎర్రస్కూటరుమీద కూమని విమలవంకే చూస్తున్నాడు కుర్రాడు. గేటుపక్క పాకలోంచి బయటికి పరుగెత్తుకు వచ్చిన అసిరమ్మని జుట్టు పట్టుకుని వీపుమీద గుద్దుతున్నాడు చంద్రిగాడు. అసిరమ్మా, అసిరమ్మతోపాటు పిల్లలూ బిగ్గరగా ఏడుస్తున్నారు.

ఒక్కఉదుటున వెనక్కి తిరిగాడు రాజశేఖరం. 'బ్రాకెట్లు పిచ్చి వదులుకోలేక అసిరమ్మని తంతూ వుండే తాగుబోతు చంద్రిగాడు. తన్నులు తింటున్నా సినిమాలు చూడటం మానలేని అసిరమ్మ. చివాట్లు పెట్టినా గేటుదగ్గర ఆగకుండా వుండలేని ఎర్ర స్కూటరు కుర్రాడు. కిటికీలోంచి చూడటం తప్పన్నా గ్రహించుకోలేని విమల–ఏమిటో ఈ మనుష్యులు. అందరి మనస్తత్త్వమూ ఒకటే.' బరువెక్కిన ఆలోచనలతో అడుగుముందుకు వేశాడు రాజశేఖరం.

'అప్పుడే లేచిపోయావా నాన్నా!' ఎప్పుడు చూసిందో వెంటవస్తూ అంది విమల. 'హాయిగా విశ్రాంతి తీసుకోక ఎందుకొచ్చిన బాధ చెప్పు. శతాబ్దాల తరబడి ఎందరో సైంటిస్టులు కృషి చేసి ఆశ వదులుకున్నదాన్ని నువ్వు సాధించగలవా? నీ పిచ్చిగాని ఇనుము ఇనుమే బంగారం బంగారమే. హాయిగా కృష్ణారామా అంటూ కూర్చోక ఎందుకు నాన్నా నీ కీ శ్రమ.'

తాపీగా అంది విమల.

'నిజమే తల్లీ. నాది వృథా శ్రమలాగే వుంది. రేపటినుంచీ లేబొరేటరీలో చస్తే అడుగుపెట్టను. ఇదిగో ఇవ్వాళ్టికి ఈ ఒక్క రియాక్షను చూసి వచ్చేస్తాను.'

రాజశేఖరం వెనక్కి తిరకుండా లేబొరేటరీలోకి వెళ్లాడు. తండ్రి వెళ్లిన వైపే చూస్తూ ఒక్క నిట్టూర్పు విడచి ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలా కిటికీ దగ్గరకు నడిచింది విమల.

అరవై యేళ్ళ ఆంధ్రసాహిత్యంలో నిలిచేది

శ్రీ నోరి నరసింహశాస్త్రి

[వ్యాసంలో వెల్లడించిన భావాలు రచయితవే. సం.]

(గత సంచిక తరువాయి)

ఇక నండూరి సుబ్బారావుగారి ఎంకిపాటలు నిజానికి చాలా చిన్న ఖండికల చిన్నసంపుటి. ఐనా అన్నిటిలో అనుబంధంగా 'ఎంకి' ఉన్నది గనుక 'అతి చిన్నది' అనలేము. దాన్ని నిలిచేవాటిలో పరిగణించక పోతే దాని అభిమానులు బ్రతుక నివ్వరు. అందులోని భాష జానపద భాష కాదనీ, కృతకంగా ఆ భాష అనిపించేట్లు మలచబడినదనీ మాబోంట్ల ధర్మ సందేహము. అందులో హృదయంగమ మైన భావన లున్నవి కనుక నిలుస్తుంది. భాష ఏమైతే ఏమి?

శ్రీ కొడాలి సుబ్బారావు 'హంపీ క్షేత్రము'లో ఒకానొక చిత్రమైన మోటుదనముతో కలసిన శక్తి ఉన్నది. సరిగ్గా ఆయన శరీరానికే అది ప్రతిబింబము. అది నిలవడానికి దాని శక్తీ వస్తు గౌరవమూ దోహదిస్తాయి.

శ్రీ విశ్వనాథ ప్రధాన మిత్రులలో ఒకరుగా అప్పట్లో ప్రసిద్ధి కెక్కిన శ్రీ నాయని సుబ్బారావు 'సౌభద్రుని ప్రణయ యాత్ర' 'మాతృగీతాలు' నిలుస్తవి. ఆ రెండిటిలో ఎగుడు దిగుడు భాషతో హృదయవేదనను వ్యక్తము చేసే సుకుమార గుణ మున్నది. అవి నిలుస్తవి. 'వేయి పడగలలో కిరీటి'పేరుతో సౌభద్రుని ప్రణయ యాత్రావృత్తాంతమే ఎక్కించబడినదని జగద్విదితము!

ఎక్కువ వ్యాప్తి పొందక పోయినా, శ్రీ విశ్వనాథ వెంకటేశ్వర్లు 'కాళిందీ పరిణయము' నిలిచే కావ్యాలలో ఒకటి. అందులో కాళింది ప్రేమ అమృత మధురంగా ఉపాసనానుభవంతో, పుష్టమైన పద్యాలలో ప్రదర్శింప బడ్డది. ఆం. ప్ర. సాహిత్య అకాడెమీ మొదటి సంవత్సరమే ఉత్తమ కావ్యంగా పరిగణించి బహూకరించింది.

ఆంధ్రాభిమానాన్ని పురస్కరించుకొని వచ్చిన శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రిగారి 'ఆంధ్ర పురాణము' విస్తార వ్యాప్తి పొందినది. అందులో పద్య రచన ప్రౌఢమై నిర్దుష్ట మైనది. ఐనా అందులో ఆంధ్రాభిమాన మున్నంతగా కవితాస్ఫూర్తి కనిపింప నందున నిలిచే వాటిలో చేర్చడంలేదు.

శ్రీ ఏటుకూరి రచనలలో కర్కశమైన మాధుర్య మున్నది. ఆయన 'మగువ మాంచాల' నిలుస్తుంది.

శ్రీ దువ్వూరి రామిరెడ్డి విస్తార సంస్కారమున్న కర్షక కవి. ఆయన 'కృషీవలుడు' 'వనకుమారి' నాలుగు కాలాల పాటు నిలుస్తవి. ఆయన మంచికవి అనడానికి శ్రీ అక్కిరాజు ఉమాకాన్తంగారి తీవ్ర విమర్శకు గురి కావడమే పెద్ద తార్కాణ!

శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి మరియొక అచ్చపు కృషీవల కవి. ఆయన వ్రాసినవి ఎక్కువ భాగము ఖండకావ్యాలు. నిర్దుష్టమైన భాష, నిజాయితీగల హృదయం. ఆయన వ్రాసిన మహాకావ్యము 'బాపుజీ ఆత్మకథ!' అది భాషాంతరీకరణమై పోయినది. అనువాద సాహిత్యానికి ఈ వ్యాసంలో స్థానం లేదు.

శ్రీ చింతా దీక్షితులు చిత్రమైన కావ్య మొకటి వ్రాసినాడు, 'హనుమంతుని తోక' 'హనుమంతుని కొక తోక ఉన్నదీ, అందమైన తోక' అని ప్రారంభించి రామాయణ కథ చాలా భాగం హనుమంతుని తోకతో నడిపించాడు. హనుమద్రామచంద్ర భక్తి విస్తారమున్న ఆంధ్రంలో అది తప్పక కలకాల ముంటుంది.

ఈ మధ్య శ్రీ ఊటుకూరి సత్యనారాయణ 'ఉదయ రేఖలు' అనే చిత్రమైన కావ్యము వచ్చినది. అందులో వచనము వ్యావహారిక భాష, పద్యాలు నిర్దుష్ట మనదగిన గ్రాంథికము. ఆ కావ్యంలో మహాభక్తుని ఆర్తి, వరాహస్వామి కిరణావళి ప్రత్యక్ష మవుతున్నవి. ఆ కావ్యం తప్పక నిలుస్తుంది.

శ్రీమాన్ వానమామలై వరదాచార్యుల 'పోతన చరిత్ర' విస్తార ప్రచారము పొంది, ఆం. ప్ర. సాహిత్య అకాడెమీ బహుమతి పొందినది. ఈ వ్యాసకర్తకు దానిని శాంతముగా పఠించే అవకాశము కలుగ లేదు. శ్రీ వరదాచార్యులు శ్రావ్యంగా వినిపింపగా పలుమార్లు శ్రద్ధగా విన్నాడు. వారి పాఠ మాధుర్యానికి ముగ్ధుడనైతినా అనే సందేహ మొకమూల బాధిస్తూనే ఉన్నది. ఐనా అది చరిత్ర కాదు. పోతననుగూర్చి లోకంలో ప్రచారంలో ఉన్న పుక్కిటి పురాణాలకే రూప మిచ్చినది. పోతన మీద ఆంధ్ర పాఠకులకున్న అభిమానం వల్ల కూడా అది నిలుస్తుంది.

ఈ అరవై యేళ్లలో ఆంధ్రాభిమానంతోపాటు జాతీయాభిమానంకూడా వెల్లివిరిసింది. కవులు ఆంధ్రవీరులను వదలి,

రాజస్థానానికీ మహారాష్ట్రానికీ ప్రయాణాలు చేశారు. అట్టి కావ్యాలలో శ్రీ దుర్భా రాజశేఖర శతావధాని 'రాణాప్రతాప సింహ చరిత్ర' అగ్రగణ్యము. ఆ తర్వాత ఎన్నదగినది శ్రీ గడియారం వెంకటశేషశాస్త్రి 'శివభారతము'. ఆయిద్దరి మహా వీరుల స్మరణే వాటిని ఎల్లకాలము నిలిచేట్లు చేస్తుంది.

శ్రీ జాషువా కవిత్వానికి అభిమానులు చాలామంది ఉన్నారు. ఆయన పద్యాలు ఎంతోసొగసుగా సాగుతూ అకస్మాత్తుగా అనుచిత శబ్ద ప్రయోగంతో కరకరలాడుతవని మాబోంట్ల బాధ! ఆ లక్షణమే ఆయన అభిమానులకు ప్రత్యేకమభిమానపాత్రమంటే రుచి భేదాన్ని తెలుపుతుంది. ఆయన ఆజన్మ క్రైస్తవుడు. క్రీస్తుప్రభావంలో పుట్టి పెరిగినవాడు. ఆయన 'క్రీస్తు చరిత్ర' నేటికాలపు కవులు బుద్ధుని విశేషాలు తెలుసుకోకుండా తమ తమ, వూహలకొద్దీ వ్రాస్తున్న బుద్ధ కావ్యాలవలె గాక, ఉచితమైన వాతావరణాన్ని చిత్రిస్తుందన డానికి సందేహములేదు. అది నిలుస్తుందనుకుంటాము. కేంద్ర సాహిత్య అకాడమీ బహూకృతి లభించడము ఈ అభిప్రాయానికి బలం చేకూరుస్తున్నది.

శ్రీ కవికొండల వెంకటరావు ఎన్నో వాకావ్యాలు, మంచివీ, సామాన్యపువీ వ్రాసినారు. వాటిలో 'శివరాత్రిప్రభ' తప్పక నిలుస్తుంది.

శ్రీ మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి సభారంజన కోసము పద్యాలెన్నో వ్రాసి చదివి చదివి మెప్పులు పొంది, నిజమైన కవితాశక్తిని కుంఠితము చేసుకున్నాడు. పాపము! అయినా ఆయన 'పంచవటి' నిలుస్తుందనవచ్చు.

ఇంకా మరికొందరు 'సభారంజనకవు'లున్నారు. వారు వ్రాసిన కావ్యాలు నిలుస్తవనుకోము.

శ్రీ దాశరథి తీవ్రత కల కవులలో ఒకరు. ఆయన 'మహాబోధి' తప్ప తక్కినవి ఖండికలు. అందులో సిద్ధార్థుని మారధరణము, మహాబోధి, మూడు జాతక కథలూ ఏదో విధంగా కలిపి రచన చేసినాడు. అందులో నిలిచే లక్షణాలు కనబడలేదు.

శ్రీ నారాయణరెడ్డి మూడు దీర్ఘకావ్యాలు వ్రాసినాడు. 'నాగార్జున సాగరం', 'కర్పూర వసంతరాయలు', 'విశ్వనాథ నాయకుడు'. ఆయన నవ్యాంధ్రకవుల పోకడలన్నీ పఠనచేసి సిద్ధాంత గ్రంథంకూడా వ్రాసినాడు. అభ్యుదయకవులతోనూ వచనకవులతోనూ కవిత్వం కంటే శబ్దాలగారడీ ఎక్కువ ప్రచారంలోకి వచ్చింది. శ్రీనారాయణరెడ్డి తెలిసి తెలిసి అప్రయత్నంగా వాతావరణంలోని శబ్దచమత్కృతికి వశుడైపోవడం విషాదకరం. అయినా ఆయన 'నాగార్జున సాగరం' నిలుస్తుంది.

ఈ అరవైయేళ్లలో కేవలకవిత్వంగా (Pure poetry) పుట్టిన విశిష్టకావ్యము శ్రీ పుట్టపర్తి నారాయణచార్యుల 'శివతాండవము'. అది ఆయన చదువుతుంటే బాగుంటుం దంటారు. ఈ మధ్య వినడం తటస్థించింది. కాని విన్నప్పటి కంటే కూడా శాంతంగా చదువుకున్నప్పుడే ఎక్కువ ఆనందం కలిగించింది. అది ఈ అరవైయేళ్ల ఆంధ్రకవుల తపస్సులో నుంచి పుట్టిన ఉత్తమోత్తమ కావ్యాలలో ఒకటి. దానికి బహుకాలము నిలిచేశక్తి ఉన్నది.

ఇతర కవులూ అభిమానులూ వారి వారి గ్రంథాలను పొరపాటున వదిలినందుకు మన్నిస్తారు గాని, వచన కవితాకవులు, శ్రీశ్రీ అభిమానులూ అట్లా ఊరుకోరు గనుక వాళ్లనుగూర్చి 'చేదుసత్యం' వ్రాయడ మవసర మనిపించింది.

ముందు శ్రీశ్రీ! ఆయన ముందు భావకవిగా శ్రీ రాయప్రోలును అబ్బూరిని. అనుకరించి 'ప్రభవ' ప్రచురించినాడు. ఈ వ్యాసకర్తకు ఒక కాపీ బహూకరించినాడు కూడాను. తర్వాత కొన్నాళ్ళకు 'మహాప్రస్థానగీతములతో', 'ఎర్రబావుటాథగథగలు' మెరిపించి, అభ్యుదయ కవిగా అవతరించి సామ్యవాదుల ప్రచారంతో మహాకవిగా చలామణి ఐనాడు. ద్వితీయమహాసంగ్రామంలో, రష్యా యుద్ధంలోకి దిగకముందే, బ్రిటిషువారిసైన్యంలో చేరి కొన్నాళ్లు ఉండి ఎందువల్లనో తిరిగి వచ్చినాడు. ఆతర్వాత బ్రిటిషువారు దెబ్బలు తింటున్న రోజులలో భారతదేశాన్ని జోకొట్టడానికి చేపట్టిన కార్యక్రమంలో చేరి 'నటాళీబృందము' అనే పేరుగల కన్యకల బృందంచేత గేయనాటిక ఒకటి ఆడిస్తూ దేశ పర్యటన చేశాడు. మా రేపల్లెలో జరిగిన ప్రదర్శనమూ, ప్రేక్షకుల గోలా, ఇంకా జ్ఞాపకమున్నవి. ఆ బ్రిటిషువారు ఆడుతున్న నాటకం మీద అసహ్యం వల్ల ఈ వ్యాసకర్త వెళ్లదలచక పోయినా, మిత్రుడు శ్రీశ్రీ అభ్యర్థన వల్ల వెళ్లవలసి వచ్చింది. గోలను శాంతింపజేయడానికి రంగస్థలం మీదికి ఎక్కడం కూడా తప్పలేదు.

ఆ తర్వాత అధివాస్తవికత 'Surrealism' అనే పడమటి గాలి చేపట్టి కొన్ని అధివాస్తవికరచనలు చేశాడు. తర్వాత రష్యా వెళ్లివచ్చి రష్యాకు ఆకాశానికెత్తడంతో పత్రికలలో పెద్ద గాలిదుమారం రేగింది. దానితో జబ్బుపడ్డంత అవస్థ పడగా, ఆసుపత్రిలో 15 రోజులు చికిత్సపొందినాడు. అభ్యుదయ కవిగా ప్రచారము పొందుతున్నందున ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యునిగా ఎన్నుకున్నది. అందుకు అంగీకరించి, శాలువ మెడలు తోపాటు ప్రశంస అందుకుని సంవత్సరం తిరగకుండానే రాజీనామా చేశాడు. అవసరానికి సినిమాపాటలు వ్రాసి ప్రస్తుతం సంపన్నుడైనట్లు తెలుస్తుంది. ఇంతలో షష్టిపూర్తి సందర్భంగా దాదాపు స్వార్థ

సంఘాలు సమ్మానం తలపెట గా అంగీకరించి హైదరా బాదుకు వచ్చినాడు. ఈ మధ్యలో'జనధర్మ'వారు ఆయనను ఇంటర్వ్యూచేసి, ఆయనకు మార్క్సిజము సుష్ఠుగా తెలియదని తేల్చివేసినారు. అంతటితో అంగీకరించిన సమ్మానాలన్నీ ఒక్కపెట్టున నిరాకరించి, అభ్యుదయకవితకు విడాకులిచ్చి ఆ అర్ధరాత్రికే 'విప్లవరచయితల సంఘము' స్థాపించి దానికి అధ్యక్షుడైనాడు. ఈ మధ్య దానికి కూడా రాజీనామా చేసిన వార్తలు వచ్చినవి. గత సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ ఆయన గ్రంథానికి బహుమతి ఇచ్చిన సందర్భంలో కూడా గొడవ ఏదో జరిగినట్లు వార్తలు వచ్చినవి.

ఇదీ శ్రీశ్రీ పల్లకు జీవితము. ఆయన కవిత! ఎప్పటి కప్పుడు సరికొత్తమార్గంలో చిత్రరచన చేయడమే ఆయన ధ్యేయము. ఆధునికులలో పూర్వాంధ్ర గ్రంథాలు కృష్ణంగా చదివి భాషమీద అధికారం సంపాదించిన కొద్దిమందిలో ఆయన ఒకడు. పాశ్చాత్యులలో నవీనమార్గాలు తొక్కేవారిని గూర్చి నిరంతర పరిశోధన చేస్తూ ఉంటాడు. అన్నిటికీ తోడు అసమానప్రతిభాశాలి ఐన నారాయణదాసుగారు హరికథలలో నిక్షేపించిన అపూర్వమైనమెట్ల నడకలను ఎన్నిటినో స్వాయత్తం చేసుకున్నాడు. ఆంధ్రభాష మైనమువలె ఆయన చేతికి స్వాధీనమై ఉంటుంది. ఇట్లా నడకలో, భాషలో, భావములో చిత్రము చూపడము అభ్యసించి సిద్ధహస్తుడైన మేధావి. అందువల్లనే ఆయన కవితలో చిత్రకవితాస్థాయిని ఎన్నడూ దాటలేక పోతున్నాడు. అటువంటి నూతన చిత్ర కవితా ప్రక్రియకు ప్రతీకలుగా రెండుగీతాలు ఆయనవి నిలుస్తవి. ఒకటి 'మహాప్రస్థాన'గీతము. రెండవది ఏదో వెండితెర చిత్రానికి వ్రాసిన హనుమంతుణ్ణి లేవమనేగేయము.

ఇక వచన కవులున్నారు. వారు వ్రాసినవి చాలాభాగము ఖండికలు కనుక గ్రహించే వీలులేదు. సకృత్తుగా శ్రీ ఆరుద్ర, శ్రీ కుందుర్తి దీర్ఘరచనలు చేసినారు. అవి నిలిచేస్థాయికి చేరలేదు. కవితావస్తువును మననము చేయడమూ, ఆత్మలో అవలోకనము చేయడము వారికింకా అభ్యస్తము కాలేదు. భాషను ఎట్లా వాడవలె, అంత్యానుప్రాసలు ఎట్లాకూర్చవలె, వచనత్వమూ ఎట్లా విరచవలె, అనే బాహ్యదృష్టికంటె లోతుకు పోలేకున్నారు. వారికి నేటి ప్రపంచపు తీరులమీద కలుగుతున్న వేదన బహిర్ముఖులను మాత్రమే చేయగలుగుతున్నది. ఏదో విధమైన సమాధి దశ సాధిస్తే తప్ప రచనకు నిలిచేశక్తి ఉండదు. ఆ సమాధి తరుచుగా లోపిస్తున్నందు వల్లనే జగత్ప్రసిద్ధుడే గాక, అనితర సాధారణ ప్రతిభాశాలి ఐన శ్రీ విశ్వనాథ రచనలనే ఎన్నిటినో ఇందులో గ్రహించలేక పోతున్నాము. ఈ బహిర్ముఖత్వము ఈకాలపు ధర్మమై కవితను ధ్వంసం చేస్తున్నది.

4 నాటికలు నాటకాలు.

నాటకముగాని నాటిక కాని మరీ పెద్దది కాదు, మరీ చిన్నదీ కాదు. కనుక అవి నిలిచేందుకు ఎక్కువ అవకాశమున్నది. అంతేకాక ప్రపంచ సాహిత్యంలో నాటకానికి అత్యున్నతస్థానమున్నది. ఆంధ్రములో గద్యనాటకాలు, పద్యగద్యమిశ్రితమైనవీ, కేవల గేయ పద్యనాటకాలు కూడా వచ్చినవి. అన్నిటినీ ఏకముఖంగా విచారిద్దాము.

ఆంధ్రలో రంగస్థలం మీద ఆకర్షించి విశేషప్రశస్తి పొందిన నాటకాలెన్నో ఉన్నవి. వాటిలో చాలా భాగము నటీనటుల ప్రజ్ఞవల్లనూ, ప్రేక్షకుల అల్పస్థాయి రుచివల్లనూ ప్రసిద్ధికి వచ్చినవే కాని సాహిత్య స్థాయివల్ల కాదు. ఐనా సాహిత్యస్థాయికూడా ఉన్నవీ, సాహిత్యస్థాయి మాత్రమే ఉన్నవీ నాటికలు నాటకాలూ రాకపోలేదు. అట్టివి నిలుస్తవి.

ముందు పేర్కొన దగినది శ్రీ తిరుపతివేంకటేశ్వరుల పాండవోద్యోగాలు. ఇందులో అభిప్రాయ భేదముండదు. నిర్ణయించిన కాల పరిధి అందులో ఉన్నందున అవి స్వీకృతమైనవి.

తర్వాత పేర్కొన దగినది శ్రీ పానుగంటి వారి 'రాధాకృష్ణ'.

శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవి ఎన్నో నాటకాలు వ్రాశారు. వాటిలో 'సత్యహరిశ్చంద్ర' కలకాలము నిలుస్తుంది.

శ్రీ విశ్వనాథ 'నర్తనశాల' 'వేనరాజు' రంగ ప్రదర్శనకు ఉద్దేశించి వ్రాసినారు. కాని వారి 'అనార్కలి' రచనకు అట్టి ఉద్దేశమున్నట్లు తోచదు. మొగలు యువరాజు సలీమును ప్రేమించి అతని ప్రేమపొందిన బానిసకన్య విషాద గాథ అది! అనార్కలిని గూర్చి తెలుగులో కావ్యనాటకాలు ఎన్నో వ్రాసినారు. కాని శ్రీ విశ్వనాథ దానిని అపూర్వ మనోజ్ఞ కవితా స్థాయికి ఆద్యంతము నిల్పినట్లు నిల్పినవారు లేరు. ఆ 'దానిమ్మ పువ్వు' శ్రీ విశ్వనాథ రచనా మహాసముద్రంలో వెలసిన అనర్ఘ రత్నము. అందులో పద్యాలు గేయాలు రకరకాలుగా నడిచి కాళిదాసు విక్రమోర్వశీయము చతుర్థాంకాన్ని స్మరణకు తెస్తున్నవి. దాని అనుకరణ కాదు. శ్రీ విశ్వనాథ 'అనార్కలి'కి ఎన్నటికీ క్షతిలేదని ఘంటాపథంగా ఉద్ఘోషించ వచ్చును.

శ్రీ శివశంకరుల సంస్కృతి కవితాశక్తి ముఖ్యంగా వారి పద్యగేయనాటికలలో మూర్తీభవించినది. వాటిలో ముఖ్యంగా పద్మావతి చరణ చారణ చక్రవర్తి 'దీక్షిత దుహిత' 'కవిప్రియ' స్థిరంగా నిలుస్తవి. వాటిలో మొదటి రెండూ రంగస్థలం మీదకూడా విజయవంతంగా ప్రదర్శింప బడ్డవి.

శ్రీ దేవులపల్లి పరిణతదశలో ఆయన కవితాత్మ రేడియో నాటికలలో రూపొందినది. వాటిలో 'శర్మిష్ఠ' కవితాశక్తికీ, 'ధనుర్దాసు' భక్తికీ అగ్రశ్రేణిలో పేర్కొనవలె. గ్రంథరూపంగా ప్రచురిస్తే అవి చిరస్థాయిగా ఉంటవి.

శ్రీ చింతా దీక్షితులు 'శబరి' ఈ యుగంలో పుట్టిన భక్తినాటకాలలో అద్వితీయమైనది. శబరి, హనుమంతుడు

ఇందులో నూతన వ్యక్తిత్వముతో ప్రత్యక్షమవుతారు. అది తప్పక నిలిచే నాటకము. ఆయన 'చక్రవాక మిథునము'కూడా నిలుస్తుంది. అది మనోజ్ఞ కల్పనగల మధుర నాటిక. గోదావరి వరదవల్ల వేరైన చక్రవాక మిథునము ఒక్క రాత్రిపడ్డ విరహబాధను అది ప్రదర్శిస్తుంది.

శ్రీ చలం 'భానుమతి' స్వతంత్రమైన కల్పన. శ్రీ బుచ్చిబాబు 'శిష్య రక్షిత' అధ్యాత్మభావన మీద కామవిజయము చిత్రిస్తుంది. శ్రీ రాజమన్నారు 'నిష్ఫలం' వేశ్యలలో వసంతసేన లున్నారని నిరూపిస్తుంది. ఇవి మూడూ నిలుస్తవి.

శ్రీ జి. వి. కృష్ణారావు 'భిక్షాపాత్ర'వ్యాసుని కాశీ నిష్క్రసన కథను ఆధునిక దృక్పథంతో ప్రదర్శించే శక్తిమంతమైన నాటిక. శ్రీ మొదలి సుబ్రహ్మణ్య శర్మ 'విధినిర్వహణము' అద్వితీయమైన మంచి నాటిక, ఆ రెండూ నిలుస్తవి.

శ్రీ శ్రీనివాస శిరోమణి 'పరివర్తనము' అశోకుని మనః పరివర్తనము సమర్థతతో చిత్రించిన మంచినాటిక. అది నిలుస్తుంది.

శ్రీ వావిలాల సోమయాజులు 'నాయకురాలు' బహు ప్రదేశాలలో బహుపర్యాయాలు విజయవంతంగా ప్రదర్శింపబడ్డ నాటకము. దానికి సాహిత్యస్థాయి కూడా ఉన్నది. అది నిలుస్తుంది.

శ్రీ నోరి వ్రాసిన గేయనాటికలలో 'షణ్ణవతి' ఆద్యంతము భక్తి, విరక్తి, ధర్మరక్తి కవితాశక్తితో కలిపిన మంచి నాటిక. ఆయన 'సుహృత్సౌదామము' కుచేల భక్తిని భాగవత కథకు విరుద్ధంగాని నూతన దృక్పథంతో ప్రదర్శించే స్వతంత్ర నాటకము. ఆయన 'పూజావనము' పుష్పాలలోని పుణ్యగంధమూ తేజస్సూ ప్రదర్శించి, భారతీయ భక్త కవులనేకాక ప్రపంచ భక్తకవుల నందరినీ పూజావనంలో అవతరింప జేసి, తుదకు పాపాత్ములకు కూడా భగవంతుని అపారకరుణాసముద్రంలో స్థానమిచ్చిన పుణ్య నాటిక. ఆధ్యాత్మిక భావనలు ఆంధ్ర దేశంలో పూర్తిగా విస్మృతము లయ్యే దాకా ఆ మూడు నాటికలూ నిలుస్తవి.

సహాయ నిరాకరణోద్యమంతో పుట్టి ఆనాడు జనాన్ని ఉర్రూతలూగించిన నాటకాలెన్నో ఉన్నవి. వాటికి సాహిత్య స్థాయి లేదు. వాటి ప్రయోజనము తీరింది గనుక వాటి విషయస్మరణ మాత్ర ముంటుంది.

శ్రీ మల్లాది విశ్వనాథ కవిరాజు, ఆయన కుమారుడు శ్రీ అవధాని వ్రాసిన నాటిక లెన్నో ఉన్నవి. ఇద్దరికీరంగ స్థలానుభవమూ సంభాషణ నడిపే శక్తీ అద్వితీయంగా ఉన్నవి. తండ్రిగారి 'డొంకలో షరాబు' 'దొంగాటకం' 'రాజీ' నిలుస్తవి. శ్రీ అవధాని నాటికలలో రెండు నాటికలు 30 సం. నుంచీ ఈ వ్యాసకర్త దృక్పథంలో ఉన్నవి. ఒకటి దుర్గా భక్తురాలు దుర్గా విగ్రహం నాశనం కాకుండా, దండెత్తివచ్చిన ముసల్మాను సేనానికి తన్ను అర్పించుకున్న నాటిక. రెండవది ఇటలీదేశంలో సన్యాసినిగా మారిన ప్రియురాలికోసం పరితపించే ప్రేమికుని నాటిక. వ్యాసకర్త నిల్వచేసిన వాటిలో కనబడలేదు. శ్రీ పి. యస్. ఆర్. అప్పారావుగారి గ్రంథంలో గాని, శ్రీనివాస చక్రవర్తిగారి గ్రంథంలోగాని వెదకినా కనపడలేదు. అవి మళ్లీ ప్రచురిస్తే నిలుస్తవి. లేకుంటే ఈ వ్యాసకర్త జీవితకాలము మధురస్మృతులు గా నిలుస్తవి. వాటిపేరు జ్ఞాపకం రావడంలేదు.

శ్రీ దువ్వూరి రామిరెడ్డి 'కుంభరాణా' నిలుస్తుంది. శ్రీ నార్ల వెంకటేశ్వరరావు 'పైసంట' నిలుస్తుంది.

నేటితరం కవులలో పద్యగేయనాటికలు ఎన్నోవ్రాసినవారు శ్రీ నారాయణరెడ్డి. వారి రచనలలో శబ్దచమత్కారము ఆకర్షించినంతగా కవితాస్థాయి గాని నాటకీయతగాని ఆకర్షించదు. కేవల గేయనాటిక కాదు కాని వారి 'రామప్పగుడి' వస్తుగౌరవం వల్లనూ దానికి వచ్చిన అధిక ప్రచారము వల్లనూ నిలవ వచ్చు.

ఎన్నోనాటకాలూ పద్యగేయ నృత్యనాటకాలు వ్రాసిన శ్రీ బోయి భీమన్న ఉన్నాడు. ఆయనకు రచనాశిల్పము తక్కువ. ఐనా ఆయన భావనలకి ఒకానొక ప్రాకృతికమైన elemental పటుత్వమున్నది. ఆయన 'మానవుని మరొక మజిలీ' మోటుగా చెప్పిన మానవాభ్యుదయచరిత్ర. ఆ గేయనాటకం నిస్సంశయంగా నిలుస్తుంది.

బౌద్ధాన్ని చిత్రించవలె నని ప్రయత్నాలు చాలా జరిగినవి కాని సాధించినవి అల్పసంఖ్యాకాలు. వాటిలో బౌద్ధము క్షీణదశను చక్కగా చిత్రించిన చాలా మంచి నాటకము శ్రీ ఆమంచర్ల గోపాలరావు 'విశ్వంతర'. దానికి కేంద్ర బహూకృతి కూడా లభించింది. అది నిలుస్తుంది.

శ్రీ రాయప్రోలు సుబ్బారావు 'రూపనవనీతము'అనే నాటకము వ్రాసినట్లు తెలిసినవారు కొద్దిమంది. చదివినవారికి అందులోని కవితా వచనరచన వెగటుపుట్టిస్తుంది. ఐనా దానిలోని భావన, రూపచిత్రణా విశిష్టమూ హృదయంగమమూ ఐనవి. అది నిలవదగినది. (సశేషము.)

అపటిక్షేపాది వివరణము

కీ. శే. నేలటూరు రామదాసయ్యంగార్

ప్రాంతకాలాన సంస్కృత నాటకములందు

తెర–పరదా.

'సంభ్రాన్తః పటాక్షేపణ ప్రవిశ్య'

'సంభ్రాన్తః అపటీక్షేపేణ ప్రవిశ్య'

అన్ని సంస్కృత నాటకములందును కవి కావించు నీ ప్రయోగోపదేశము.

'తతః ప్రవిశతి పటాక్షేపేణ సంభ్రాన్తః' కాన నగుచుండును. దీని కర్థమేమగును? 'పట+అక్షేపేణ'—తెరవేయక అనియా? 'పట+ఆక్షేపేణ'—తెర పూర్తిగా లేక ఇంచుక వేసి యనియా? అ+పటీ+క్షేపేణ—తెరతీయక యనియా? అపటీ+క్షేపేణ–తెరతీసి యనియా? మఱియు క్షేపేణ అనఁగా వేయుటయా, కాదా తీయుటయా? మఱియు ఈ సూచన పాత్రమునకా నాటక ప్రయోగము విచారించుకొను సూత్రి తత్ప్రరి జనమునకా? దీనికి ఇన్ని విధాల విప్రతిపత్తి లేవఁ దగియుండును. మఱి యిందులకు సమాధానమెట్లు?

ఇట తొలుత నాటకాల గీర్వాణ వ్యాఖ్యాతలును ఆంగ్ల టీకాకారులును దీనింగూర్చి ఏమి చెప్పిరో పరికింపఁదగును.

1. భాసచారుదత్తము–ద్వితీయాంకము.

Dr. P. S. Sane-M. A., B. T., Ph. D., Principal & Prof. S. A. Upadhyaya —M. A.

'Then enters with a toss of the curtain.

G. S. Kale—జవనికాం అనపసార్య ఏవ

క్షేపః నిరసనమ్, జవనికాయా అపసారణమ్ (అ=) వినైవ.

(: e. with only a toss of the Curtain.

2. కాళిదాస శాకుంతలము.

Prof. A. B. Gajendragadkar-Bombay Elphinston College.

'Entering with a toss of the Curtain in hurry without సూచన'

జీవానంద విద్యాసాగర.

అపటీక్షేపేణ యవనికాయా అపసారణం వినైవ పాత్రప్రవేశావసరే యవనికాపసారణ నియమః, అత్రతు సంభ్రమ ద్యోతనాయ యవని కాపసారణం వినైవ. తదుక్తమ్—పటీక్షేపో న కర్తవ్య ఆర్తరాజ ప్రవేశనే.

వైఖానస శ్రీనివాసాచార్య—పటస్య యవనికా పహోదనేన సూచనం వినైవ ప్రవిశ్య—హర్షశోకాది జనీంత సంభ్రమ యుక్తాన్యపాత్యస్య ప్రవేశః పటాక్షేపేణ క్రియతే.

శతావధాన శ్రీనివాసాచార్య. అక్షేపేణ అపాకర్షణేన;

ఆక్షేపేణ స్వయ ముత్సారణేన వా.

3. రాఘవభట్ట విక్రమోర్వశీయము.

రఙ్గనాథః—అపటీక్షేపేణ జవనికాయా అపసారణేన Pandit M. A. అదే

Karmarkar – entering without tossing is the ordinary సూచిత ప్రవేశ.

entering with a toss is at సంభ్రమప్రవేశ.

4. నాగానందము.

Principal Narurkar M. A -పటాక్షేపేణ- by tossing aside the Curtain, Also పటీక్షేపేణ and అపటీక్షేపణ mean the same thing.

5. ముద్రారాక్షసము–ఢుంఢిరాజు-అసూచితస్య సమ్భ్రమేణ ప్రవేశః పటాక్షేపః

Divan Bahadur Dhruva – pushing aside the curtain.

6. మృచ్ఛకటికమ్–Dr. G. K. Bhat M. A, Ph. D, Profssor and Director of researches – తన యుపోద్ఘాతమున వ్రాసినాడు.

'The Stage was thus divided by the use of one or two curtains.' ఇట్లనుటచే రంగాన అక్కఱకు ఒదవునట్లుగా తెరల యునికి అంగీకృతము అనుట. 'When the entry of a character was not normal a special device was used, indicated by 'అపటీక్షేపేణ' which means tossing or drawing the curtain.' తాను నాకు 18–8–'71 వ్రాసిన జాబులో దానికే ఇంచుక వివరము ఇట్లు వ్రాసినాడు. 'The tossing is literal as when we would enter a hall in unusual circumstances not by holding the curtain aside but by 'throwing' it aside.

7. Dr. V. Raghavan M. A. Ph. D., Professor of Sanskrit, Madras University (retired), 'Jawaharlal Nehru fellow' అను గొప్ప బిరుదులు గల పండిత ప్రకాండుడు, దానిని నాకు సుబోధము చేయు కడంకతో 10–2–1972 'పటాక్షేపేణం' గూర్చి నాకు ఇట్లు జాబు వ్రాసెను. Normally there are two types of entering – one, by the complete removal of the curtain, another, by the curtain being in position and the actor rushing by pushing aside the end of the curtain with one hand. The after is called Apatiksepa. It is adopted in a situation in which there is some haste (Sambhrama) and somebody has to rush in. There is a third kind also in which a character does not-enter but peeps over the curtain in position. This is what happens in the opening of the Mudraraksasa. In ancient Indian theatre the curtains were fixed. But in the dance drama tradition prevalent all over the country in medieval India, the curtain was held by two persons and behind that the actor first danced and then entered, sometimes looking over the curtain from behind in the midst of his dance and making the final entry for the scene proper with the curtain completely taken off by the two persons holding it. In this kind of drama there is no apati-ksepa.

8. Professor K. Visvanathan M. A. Head of the Deportment of English, Andhra University – భరతనాట్య సంస్కృత నాటకములందు ఎంతయు లోతుగా పాండిత్య మార్జించినవాడు. 12–5–1972 'నేను ఇదమిత్థం' అని నిర్ణయము చేయను గాని పలువురు - మహాపండితులు కావించిన నిర్ణయముల నుదాహరింతును' అని నాకు జాబు వ్రాసి పంపెను.

(1) 'Ancient Indian theatre did have one curtain. (2) It was placed between ranga Sirsa and ranga pitha (3 N. S. Mentions yavanika being drawn aside on 2 Sides. (4) Whether the curtain is parted in the middle or tossed aside (apatiksepena) is not clear. De' does not agree with the toss of the curtain and Mankad does not agree with the perting in the middle. (5) The ancient Indian theatre had no 'drop curtain'. The ending of Skt, dramas proves this. (6) Stage direction like 'pravisati asanasthah' indicates a curtain which drawn aside shows the characters seated (7) Bloch's interpretation of Jogimara and Sitabenga Caves Wilson's theory of transverse curtains A. K. Coomaraswamy's idea of two curtains are not conclusively proved...... (8) Perhaps yavani girls drew aside the curtains......'

9. డాక్టరు 'డే' పండితుడు నేటి భారత దేశ పండిత ప్రకాండులలో ఒకడు. 'భారతీయ విద్యా' అను పత్రికయు చాల ప్రామాణికపు వ్రాతల పత్రిక యని ప్రసిద్ధి గలది. అందు ఆయన చెప్పుచున్నాడు.

– (చూ. Vol. IX –1948 Pg 129 - 31

'The curtain appears to have been simply tossed aside when actors entered. Even in the case of hurried abrupt or

violent entrance, the position of the curtain whether between the Ranga pitha Sirsa or between the Ranga Sirsa and the Nepathya grha would not hindes it The Stage direction for hurried entrance 'అపటీక్షేపేణ ప్రవిశతి' would therefore simply mean 'enters without a toss of the curtain'...

That the curtain was tossed aside when actors entered is indicated by the following passage from భరతనాట్య శాస్త్ర XII—2-3.

'యథా మార్గరసోపేతం ప్రకృతీనాం ప్రవేశనే
ధ్రువాయాం సంప్రవృత్తాయాం పటీ చైవాపకర్షితే
కార్యః ప్రవేశః పాత్రాణాం నానార్థ రససమ్భవః'

అని ఈ శ్లోకాలకు అర్థమేమగునో ఆయన చెప్పలేదు. 'యథామార్గ రసోపేతం' అనఁగా నేమో, 'ప్రకృతీనాం ప్రవేశనే' అనగా నేమో ఆయన తెలియఁజెప్పలేదు. ఇది నాట్యమునకు సంబంధించినది, నాటకమునకుఁ గాదు. మఱి యిందు 'పటీ చైవాపకర్షితే కార్యః ప్రవేశః పాత్రాణాం' అను దానిని మాత్రము గ్రహించి చెప్పినట్లున్నది తన మాటను — 'The curtain appears to have been simply tossed aside when actors entered'. అని. మఱి తెర తాను చెప్పినచోట నుండును గదా! ఈ 'పటీ చైవాపకర్షితే' అనుట ఆ తెరంగూర్చియే కదా? 'అపకర్షితే' అనగా అంతవఱకు ఆతెర పఱపఁబడియున్నదని-కదా గ్రహింపఁదగును. అట్టి దానిం గూర్చి కదా 'అపకర్షితే=అపసారితాయాం' అని యనఁదగును. పాత్రములు సాధారణముగా ఇట్లు అపకర్షణ యనంతరము ప్రవేశింతురు అనుట తన మాట మఱి దాని తరువాతి మాటగా 'Therefore the stage direction 'అపటీక్షేపేణ ప్రవిశతి' Would simply mean 'enters without a toss of the curtain'. అని అన్నాఁడు. మఱి పటము అపకర్షించినంతట సాధారణపాత్ర ప్రవేశమైన, సంభ్రాంతుఁడు వడిగాను ప్రవేశింపవలయువాడు తెర తీయక వేసియే యున్న నెట్లు ప్రవేశింపఁగలడు? ఆపఱచియుండు తెర వానికి అడ్డము—ప్రతిరోధకము — గాదా? జే డాక్టరుగారి యీ మాటలు ఏమియు బోధపడకున్నది. 'Without a toss' అనుట ఎట్లు పొసఁగును? 'నఞ్'ను ఎట్లు గ్రహింపఁదగును? అభినవగుప్తాచార్యుని యాఘట్టపు మాటలు పరికింపఁదగును. 'పటే అపకర్షితే యవనికాయా మపసారితాయాం. తథా సామాజికానాం నేపథ్య గృహా దయ మాగత ఇతి నటీ నివర్తతే అని. అనఁగా అంతవఱకు నటి రంగమందున్నట్లును పాత్రప్రవేశమునకు పటక్షేపము—పటము పఱచుట అగుటయు, అంతట ప్రావేశికీ ధ్రువాగానము, అంతట ఆ తెరకు అపసారణము, అంతట పాత్ర ప్రవేశమును—ఇక సామాజికులకు వీఁడు వచ్చినాఁడులే అని నటి తాను నిష్క్రమించుటయు అని. మఱియు 'యద్యపి పాత్రాణాం అధ్రువా అపి ప్రవేశా వక్ష్యన్తే.' (భర. నాట్య. XIII 57) అని. అధ్రువా ప్రవేశములుం జెప్పఁబడగలవని యొండెడ అభినవ భారతిలోఁ గలదు. ఇదెల్ల నాట్య విషయము, నాటకముది గాదు. ఈ యధ్యాయములలో 'నాటక' అని ప్రయోగించినం గూడ అది నాటకముం జెప్పదు, నాట్యమునే చెప్పును అని అభినవ భారతి—XIIi 57 లో తెలివిడి గలదు.

'నాటక శబ్దోఽత్ర న రూపక విశేషే, అపి తు నాట్య ఏవ. యథా—

హాస్య స్థానాని యాని స్యుః కాశ్యోత్పన్నాని నాటకే XXII మఱి దీనిని 'అ+పటీ' 'పట+అ' క్షేపములకు సాధకముగా ఆ పండితుఁడు గ్రహించి, దానఁ దోచిన విప్రతిపత్తిం దీర్చి అంతయుం బ్రసన్నము గావించినట్లు తలంచినాఁడే! మఱి పటమువేసి యుండనే యున్న, దానికి 'టాస్' లేక ఆ సంభ్రాంతుఁడు ఎట్లు ప్రవేశించును!

మఱి యిది మన నాటకాలకు ఎందులకు పనికి వచ్చును? ఏ సందేహముం దీర్చును?

ప్రాయికముగా మన నాటకాలలో ధ్రువాగానమును, దాన పాత్ర సూచన ప్రవేశములును లేవు. అయినను ఏ పాత్ర ప్రవేశమునకును ఎట్టిదో సూచనయు, పటక్షేపము—తెరపఱుపును, తదపసారణమును, అనఁగా అదే అట్లు పాత్ర ప్రవేశమును గలదు. పాత్ర పని

ముగిసిన తర్వాత 'యవనిక యా తిరోధాన రూపం నిష్క్రమణం దర్శనీయమ్' అని యభినవగుప్తుఁడు నిర్వచించినట్లు అట్టి నిష్క్రమణముం గలదు. ఐనను నాటకాన తెరంగూర్చిన యుపదేశమునకు శైలి ఇది కాదు.

అవధారు!—

భరతముని నాట్యశాస్త్ర ద్వితీయాధ్యాయమున నాట్యమండప నిర్మాణముంగూర్చి సమగ్రముగా ఉపదేశించి యున్నాఁడు. మొట్టమొదట గట్టినేలను, నల్లని దానినో పచ్చని దానినో ఏరుకొనవలసినది. దానిని దున్ని చీల యెమ్ముక గొజు మొదలైనది ఏదియు లేకుండ పరిశుభ్రపఱుప వలసినది. మండపము తూర్పు మొగము గలది యగునట్లుగా, పడమటికొసన నేపథ్య గృహమును—నటులు వేసము వేసికొనుటకైనది, దానికి ముందు రంగము రెండు భాగములు—తొలిది రంగశీర్షమనియు రెండవది రంగపీఠమనియుం జెప్పఁబడునవియు, ఆ రంగమునకు ఇరువైపుల నుండు అంచులు, మత వారణములని చెప్పఁబడునవియు, ఆ యన్నింటికి ముందు ఉన్నట్టిది సామాజికులు—ప్రేక్షకులు కూర్చుండు చోటు అనియు ఎన్నుకొని, ఒక్కొక్కదానిని నూలుపట్టి కొలుచుకొని గుర్తుపెట్టుకొనవలయును. 'ఏవం మానవిధిం స్థాపనవిధిం భిత్తివిధిం చ కృత్వా స్తంభవిధిః కార్య ఇతి—దర్శయతి—ఇత్యాదిగా దానిని అభినవ భారతిలో సంగ్రహించినాఁడు, అభినవగుప్తుఁడు. అంతట ఆ గుర్తు ప్రకారము నేల త్రవ్వి ఇటికలతో స్థాపనము—'అస్థిభారము, బెస్మెంట్, ఫౌండేషన్' అందురే అది—కట్టి మంచిమట్టిని పోసి నేలను నున్నగా చదునుగా చేయవలసినది. అంతట కొయ్యపని. స్తంభములు నిలుపుట వానికి అడుగున నెలకట్లు, పైన నాగదంతములు, బొమ్మలు మొదలైనవన్నియు చాల నందముగా అమర్చుట. అంతట గోడపని తొడంగి స్థాపనపై కావలసిన యెత్తుకు ఇటికగోడలు లేపి, వానియందు వాకిళ్లు కిటికీలు మొదలైనవి అమర్చుకొనవలసినది. నాట్యమండపమును శైలగుహాకారముగా తీర్పవలసినది. అట్లు చేసిన, మాట పాట ధీరఠబ ముగా వినంబడును. ఇట్లంతయు ఇంకను ఎన్నియో సూక్ష్మ వివరములతో చెప్పియున్నాఁడు.

కాని ఈ మండపమునకు పైకప్పు ఇట్టిది యని —పెంకా లాదా గుడ్డయా పూరియా తాటియాకా, ఔంకాయవియా—ఏదియు చెప్పలేదు. అది వారివారి యిచ్చకు అనుకూలమునకు వదలఁబడినది. కప్పులేని నాట్యమండపము ఎందులకు పనికివచ్చును? అన్ని గోడలును అన్ని స్తంభాలును వాకిళ్లు కిటికీలును కప్పుయొక్క యపేక్షను అక్కఱను సూచించును. నాట్యమండపమునకు ధీరశబ్దోత్థాన రక్షణలకు వలయు శైలగుహాకాంతకును కప్పు లేకున్న నెట్లు? శబ్దము కాఱిపోదా అధీరముగాదా? కావున కప్పు తప్పక ఉండ వలసినదే.

అట్లే రంగాన ముని ఆ నిర్మాణాధ్యాయమున (11) తెరలం జెప్పలేదు. మఱి తెరలు అవి నాట్యరంగమున నెంత యక్కఱ! దేనికి మానరాని యక్కఱయో, మఱిం దేనింగూర్చి నియమ నిషేధ విశేషములు లేవో దానికి స్వేచ్ఛయు అనుకూలమునే తత్పరులకు ప్రవర్తకమగునని శాస్త్రము వోలె పరిగ్రాహ్యమగును. మండపానికి కప్పును రంగానికి తెరయు నటులకు అట్టివి, మఱి తాను ఏనవ (V) యధ్యాయమున పూర్వరంగ విధి యుపదేశమున తెరలను 'సిద్ధవత్తుగా' 'స్థితవత్తుగా'నేకొని,

(8) అ స్యాఙ్గాని తు యథావ దను పూర్వశః' అని యా యంగములం జెప్పచో

11) ఏతాని తు బహిర్గీతా న్యన్తర్జ వనికా గతైః
ప్రయోక్తృభిః ప్రయోజ్యాని
తన్త్రీభాణ్డ కృతాని చ
తతః సర్వేస్తు కుతపైః
సంయుక్తా నీహ కారయేత్
విఘట్య వై యవనికాం
నృత్త పాఠ్య కృతాని తు
....

16) ఏతా న్యఙ్గాని కార్యాణి పూర్వ రఙ్గ విధౌ తు చ అని, 'అన్తర్య వనికా గతైః' అని జవనిక—పరదా—యు, దాని—మఱుఁగుననుండి కొందఱు కొన్ని యంగములు నిర్వర్తింపవలయుటయు, అంతట 'విఘాట్యైవ యవనికాం' అని యవనికను 'విఘటించి' అనఁగా తొలఁగించి, అంతట కొన్ని యంగములు నిర్వర్తింపవలయుటయు చెప్పినాఁడు. 'అన్త ర్యవనికాస్థితైః' అనఁగా వారు 'ప్రవేశింపక' చూపఱకు అగపడక ఉండుట. 'విఘట్యచ' అనఁగా వారు ప్రవేశించుట, యనఁగా చూపఱకు అగపడుట—అన్నమాటయే కదా. అభినవభారతిలో అభినవ గుప్తాచార్యుఁడు ఈ సందర్భమున ఈ తెలివిడిం జెప్పినాఁడు. (చూ. బరోడా. నాట్య శా. పు. 212) 'యస్మాదేతాని పూర్వరఙ్గే సంభవన్తి, తస్మా దస్య సమ్బన్ధిత్వేన కార్యాణి. తత్ర యవనికా రఙ్గపీఠ తచ్ఛిరసో ర్మధ్యే. తస్యా అన్తరాగతైః ప్రయోక్తృభిః నర్తైః ప్రాధాన్యాత్, యదివా వైణికాదిభి రేవ ప్రయోక్తృభిః ప్రయోజ్యాని. ప్రత్యాహారాదీని గీతకపిణ్డ్యా దీని తు యవని కాయా మపసారితాయాం; 'గీతానా' మిత్యాదినా శ్లోకేన గీతక వర్ధమానాన్య తరప్రయోగ ఉక్తః' అని వివరించినాఁడు. మఱియు ఆ పూర్వ రంగా ధ్యాయముననే (భర. నాట్యV)

171) అన్తర్యవనికా సంస్థః
కుర్యా దాశ్రావణాం తతః
ఆశ్రావణావసానే చ
నాన్దీం కృత్వా స సూత్ర ధృత్

172) పునః ప్రవిశ్య రఙ్గం తు
కుర్యా త్ప్ర స్తావనాం తతః
ప్రయుజ్య విధి నైవం తు
పూర్వ రఙ్గం ప్రయోగతః
స్థాపకః ప్రవిశే త్తత్ర
సూత్రధార గుణాకృతిః
....
....
....
....
ప్రవిశ్య రఙ్గం తై రేవ
సూత్రధార పదై ర్వ్రజేత్
....
....
ప్రస్తా వ్యేవం తు నిష్క్రమేత్
కావ్య ప్రస్తావక స్తతః.

[ఇట అభినవభారతి—ద్వివిధా ప్రస్తావనా (1) పూర్వరఙ్గ శేషభూతా, (2) భారత్యఙ్గ శేషభూతా చ.........తత్ర పూర్వరఙ్గాఙ్గే అస్యాః కవి రుదాసీనః, స్థాపక ఏవ స్వతన్త్రో నిర్మాతా. ద్వితీయాయాః నాటక కవిః.]

285—ప్రయుజ్య గీతవాద్యే తు
నిష్క్రామే న్నర్తకీ తతః
అనే నైవ విధానేన ప్రవిశ
న్త్య పరాః పృథక్.

ఇట్లు పలుచోట్ల యవనిక 'మఱుఁగున నుండి' కొంత పని చేయుటయు, దానిని 'అపసారించి' వెలువడి కొంత పని చేయుటయుం జెప్పినందున, తెరయు, అక్కఱకొలఁది దానిని వేయుటయు, అక్కఱకొలఁది తివియుటయు రంగద్వార ప్రస్తావనల ప్రస్తావముతోఁ గూడఁ జెప్పినట్లే దాన 'సంభవము' 'సంబంధముం' జెప్పి, అక్కఱకొలఁదిగా తెరకు శాస్త్రకారోపదేశానుమతులు సిద్ధించినదని గ్రహింపఁదగును. అదియే శాస్త్రకారులగు పెద్దల యుపదేశ శైలి. పాణిని సూత్రాది శాస్త్రముల నెందేని దోఁచు వెలితియు సందేహమును వార్తికములచేతను, మహాభాష్యాది ప్రయోముచేతను పూరణమో నిర్ణయమో పొంది చెల్లుబడిం గూర్చును గదా. కాఁగా యవనిక వేయుట తీయుటలకు అక్కఱయే నిర్ణాయకమును అనుమంతృకమునై ఇట్లు శాస్త్రాన యథేచ్ఛానుమతి యొసంగఁబడినదని గ్రహింపఁదగును. ఈ పూర్వ రంగాధ్యాయోక్తమున కెల్ల దశరూపక సాహిత్య దర్పణకారికలును ఒక తెలుఁగు వ్యాఖ్యగాఁ గొనందగును.

రంగాన తెర వేయుటకు 'క్షేపము' వాడుకగా ప్రయోగించు మాట కాఁబోలును. ఏలన తీయుటకు

'విఘటనము' ముని ప్రయోగము, అపసారణము అభినవగుప్త ప్రయోగము. మఱి వేయుటకో? (a) వేయుటకు 'క్షేపము' అగును. ఈ క్షేపము హరివంశమున వఁట, కాదా మఱెందో పురాణముననే ఇట్లు ప్రయోగింపఁబడి యున్నది. 'ప్రేక్షాగారాణి (పా. గృహాణి) రేజు ర్యవనికాక్షేపైః సపక్షా ఇవ ఖే నగాః' అని. అట్లే ప్రాచీన నాటకవ్యాఖ్యలలో 'పటాక్షేప' అపటీక్షేప' ఇత్యాదికి వివరణలో 'పటక్షేపో న కర్తవ్య ఆర్తరాజ ప్రవేశనే ఇతి భరతః' అని 'క్షేపతోనే ఉదాహరింపబడి యున్నది. నూరు నాటకముల యందైనను ఈ యెచ్చరికకు అ—క్షేపణ అనుటయే అపసారణేన ప్రసారేణ ఇత్యాది యేమార్పులేదు. దాని వివరణమైన యా 'పటక్షేపో న కర్తవ్యః' అన్నమాటల కూర్పు ఒక వాక్యమై అందు 'క్షేపమునకు' అపసారణమున కన్న 'పఱచుటయే పొందుపడుసట్లున్నదని తలంపఁదగును. ఆ పై హరివంశముది యన్న శ్లోకమునకు అర్థమేమగును? ఇందు మంచి ఉపమ చెప్పఁబడినది. ఇందు క్షేపమునకు విఘటనావసరణార్థములు పొసఁగునా? ప్రేక్షాగృహములు జవనికాక్షేపములతో మింట రెక్కలతోడి కొండలవలె ఒప్పారినవి—అని. 'మింట' అనుటచే కొండలు విప్పారచాపినట్టి తటపటలాడు పెనురెక్కలతో ఎగురుచున్నవనుట. కావున ప్రేక్షాగృహములు గాలికి పట తటలాడు యవనికల పఱుపులతో— తద్విఘటనాపసరణములతో కాదు— ప్రకాశించినవి — అనుట వాక్యార్థము: 'క్షేపైః' అను బహువచనమును పరికింపఁదగును. 'పటక్షేపో న కర్తవ్యః—ఇతి భరతః' అని ప్రాచీన వ్యాఖ్యాతలు 'పటాక్షేపేణ' వివరణమున ఉదాహరించినారు. 'పటక్షేపో న కర్తవ్యః' అను వాక్యమునకు అపసారణముగాక 'పఱపే' చక్కఁగా పొందిక పడునని తజ్జ్ఞులకుం దోచును. 'పటమును తొలగించుట చేయఁగూడదు' అని నిషేధము ప్రవేశవిషయమున ఒక యెచ్చరికగా నుండునా? పఱపఁగూడదనుట నాణెముగా కుదురును. మఱి 'పటాక్షేపేణ'కు కర్త యెవరు? పాత్రమా, పాత్రప్రవేశ నిష్క్రమణాదులకు రంగాన నేర్పాట్లుచేయు సూత్రియు తత్పరిజనమునా? తక్కిన యన్ని ప్రవేశ నిష్క్రమణములకైన తెరలపనికి కర్తలు ఆజన మగును గాని పాత్రలు కాదు. మఱి యీ యొక్క దానికి మాత్రము పాత్రమా? పాత్రముకాదని 'న కర్తవ్యః' ఇత్యాదివాక్యము ఎంతయు పొందుపడ సూచించుచున్నది. కావున పటక్షేపమునకు 'పఱుపు' అను నర్థమే లెస్సగా కుదురును. మఱియాకారిక ఇపుడు ముద్రణముంగన్న బొంబాయి బరోడా కాశీల భరత నాట్య శాస్త్ర గ్రంథమున ఉపలబ్ధము కాలేదని యొక మాట గలదు. 'డే' పండితుఁడును అట్లే అనెను. మఱి 'ఇతి భరతః' అని సంప్రదాయోక్తిగా 'కణ్ఠస్థా యా భవే ద్విద్యా' అను నట్టి పండితులు కంఠాన ధరించి చెప్పినదిగా, ఇప్పటికి నూతేండ్లకుం బూర్వమునుండి వచ్చుచుండు ప్రాచీన నాటక వ్యాఖ్యానములందు దాని యుదాహరణము గలదు. కావున అది భరతునిదే కాఁదగును. ఈ యాకరములలో తప్పిపోయి యగపడకున్నను—అవి తలంపఁదగును. మఱి యాకారిక రెండవ సగమునకు 'ఆర్తరాజ ప్రవేశనే' అనుపాఠము సరిగా నున్నదా? దానిని విచారింపఁదగును. 'ఆర్త' సరిగానే యున్నది కాఁబోలు. 'రాజా' 'రంహః'కు పొరపాటగునా? 'ఆర్త రంహః ప్రవేశనే' అని సాధు పాఠమగునా? ఇది వట్టి నా యూహ, ఉన్నతీఱున సరియైన యర్థము కుదురమిచేత. ఐనను ఊరక కుదురమిం జెప్పుదును గాని పాఠ సంస్కరణ స్వాతంత్ర మవలంబింపను. పెద్దలు చిత్తగింతురుగాక. నాట్యశాస్త్రమున పెక్కెడల జవనికంగూర్చి అపసరణ విఘటన ములు సమానార్థకములు, తివియుటకుం బ్రయోగింపఁబడి యున్నవి. మఱి జవనికకు 'పఱుపు' వలదా? పఱచిన దానికిఁ గదా విఘటనము? కావున 'క్షేపము' పఱుపునకు సంప్రదాయపుఁ మాటగా పరిభాషవోలెఁ గొనఁదగును. (h) 'క్షేపమునకు' పఱుపు ఒక ఒక్కని యర్థమే యగును—'Casting the Curtain' ఆప్టే నిఘంటువునఁ 'Cast' అని చెప్పియున్నాఁడు.

(సశేషము)

నీడజాడచాలు!

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

పోరే పడలే నంటావూ
పోతా పోతా పోతా నంటావ్
పోతే పోయ్‌నావు గానీ
పోతా పోతా ఒక్క మాటా
యిని పించు కోయే! అమ్మా!! —

ఊరి ముందర వంకొకటుంది
వంక మిందగ ఒక్క వారగా
అడుగు మిందగ అడుగేసుకుంటూ
నడిసి నువ్వు పోయ్ నా వంటే
అడుగు కొక్క ముద్దిడుకుంటూ
అక్కణ్ణే పడిగాపు లుంటా!

అది గూడ నీవల్ల కాదంటె వంటే--
దారి పక్కనా గుంటొకటుంది
గుంట నిండుకు దావరపూలే
పువ్వుల్లో పువ్వయి పోతే
పువ్వులాంటి నీ ముద్దు మొకము
పొద్దస్తమానం పూజించుకొంటా!

అది గూడ నీవల్ల కాదంటె వంటే—
ఎక్కడైనా ఎండ పొద్దునా
నీడకోసం నిలబడి నువ్వా
నీడ జాడా నిలిపిపోతే
నీడలోనే మేడ గట్టి
మేడలోనే కలవరిస్తుంటా!

అది గూడ నీవల్ల కాదంటె వంటే—
నువ్వు పొయ్యే దారి లోనా
నిలువు రాయీ ఒకటుండాది.
నీ రూపూ రాసేసిపోతే
మాపు రేపు సూసుకొంటుంటా!

పోరే పడలేనంటావూ
పోతా పోతా పోతా నంటావ్
పోతే పొయ్యినావు గానీ
పోతా పోతా ఒక్క మాటా
యినిపించుకోయే! అమ్మా!!



భీతి

శ్రీ కె. ఎస్. వి. నరసింహమ్

అన్నం సయించడం లేదు.

మజ్జిగ కలుపుకున్నాడు. అతి కష్టమ్మీద ముద్దలు మింగుతున్నాడు. ఊఁహూఁ—వల్ల కాలేదు.

'అన్నమంతా వదిలేశారేమండీ—'

సుబ్బారావు చేయి కడుక్కుని తువ్వాలుతో చేతులు తుడుచుకుంటున్నానన్న ధ్యాసలేకుండా తుడుచు కున్నాడు.

చెంతలో గాజుల చప్పుడైతే గ్లాసందుకుని నీళ్ళు త్రాగాడు.

* * *

పడగ్గది కిటికీ చిన్నదికాదు. పడగ్గది చిన్నది కాదు. అది వేసవికాదు.

కాని,

సుబ్బారావుకు గాలిలేనట్లు తోచింది. ప్రపంచం యిరుకై యిరుకై తనను ఊపిరి సలపనీకుండా చేస్తున్నట్టనిపిస్తోంది. అంత చల్లని రాత్రికూడా—మండుటెండలో ఒయాసిస్సుల్లేని ఎడారిలో కాళ్ళు విరిగి పడిపోయినట్టు కూడా అనిపిస్తోంది.

పడగ్గది గుమ్మంలో అలికిడి,

'ఇంకేమైనా కావాలా?—'

సుబ్బారావుకు అనుమానంగా ఉన్నట్టుంది. అనుమానం—పడగ్గది పైకప్పు ఢభేల్‌మని ఎందుకు కూలిపోలేదని కావచ్చు, అనుమానం—తను హఠాత్తుగా కూచున్నవాడు కూచున్నట్టే (మంచంతోసహా) పాతాళ లోకాలకెందుకు దిగబడిపోలేదని కావచ్చు.

ప్రక్కనే గాజులు చప్పుడౌతున్నాయి.

(మెషీన్లు తాంబూలాలు వేసుకుంటాయా? మనకి తెలీదు. కాని—) సుబ్బారావు మెషీన్‌లాగ నోటి కందుతూన్న తమలపాకు చిలకల్ని నములుతున్నాడు.

సుబ్బారావు ఆవేళ విచిత్రంగా ఉన్నట్టు కని పించకుండా వుండాలని ప్రయత్నిస్తున్నట్టు కనబడు తున్నాడు.

ప్రక్కనే పొడిదగ్గు వినిపించింది.

సుబ్బారావు తాంబూలాల రసం మింగి మళ్ళీ చివరి చిలక నములుతున్నాడు. సుబ్బారావుకి బహుశా ఆశ్చర్యంగా ఉన్నట్టుంది—కిటికీ అవతల కనిపిస్తూన్న నగరం మంటల్లో లేదేమా అని! (అతనొక 'నీరో' కాదు; కాలేదు అనికూడా అతనికి తెలుసునులా ఉంది.)

పడగ్గదిలో లైటు ఆరిపోయింది.

(మెషీన్లకు 'చీకటి వెలుతురూ' భేదా లుంటాయా?—మనకి తెలీదు, బహుశా మరో జగదీశ్ చంద్రబోస్ నడగాలి. కాని, మెషీన్‌లకి చీకటంటే భయమా?) సుబ్బారావు పసివాడు కాదు. అతనికింతకు ముందెప్పుడూ చీకటంటే భయం ఉన్నోంది కాదు.

ప్రక్కనే చీకటిలోంచి గాజుల గలగలైంది.

(పడగ్గది తూర్పుగోడ గూట్లో చిన్నఅలారం టైంపీసుంది. చీకట్లో దాని అంకెలు మెరుస్తాయి. చిన్నపిల్లలకి అది గుడ్లురిమి చూసేట్టు అనిపిస్తుంది.) గూట్లో ఉన్న గడియారం కళ్ళకి సుబ్బారావు ముఖంలో ఏం జరుగుతోందో కనిపించలేదు.

ప్రక్కనే ఉండి ఇంతసేపూ గలగలమని సవ్వడి చేసిన గాజులు చల్లగా గుండెలమీద కెగ్రబాకాయి.

అవి మరీ పైకొచ్చి మరీ మధురంగా మ్రోగి, మెడ వెనుక ఆగి; రెండు చేతుల గాజులూ—అక్కడ కలిసి మ్రోగి క్షణం కిలకిల మన్నాయి.

(మెషీన్లు సంగీతం వింటాయా? — మనకి తెలీదు. కానీ, మెషీన్లు ఒక రకమైన సంగీతం సృష్టిస్తాయని మన మెరుగుదుము. కొన్ని చప్పుడు చెయ్యని మెషీన్లున్నాయి. సంగీతంపట్ల వీటి అభిప్రాయమేమిటో?— ఏ పత్రికా విలేఖరి అడుగుతాడు?) సుబ్బారావు హృదయంలో ఏవో చప్పుడైనట్లు ఎవరో విన్నారు. ఎవరు? బహుశా — ఆ గదిలోని చీకటి కావచ్చా? బహుశా—ఆ గదిగోడ వినివుండవచ్చా? లేక, చీకటివంటి గోడవంటి జీవి(?) కావచ్చా?

మెడ వెనకగాజులు చేరితే—సుబ్బారావు చేతులకు ఏం లభించింది?

(మెషీన్లపై మత్తుమందు పనిచేస్తుందా? ఏమో—మనకి తెలీదు)

* * *

లోకంమీద ఉదయం వాలింది.

కిటికీ ప్రక్కన కూర్చుని సిగిరెట్టు కాల్చుకుంటున్నాడు సుబ్బారావు. అతను చాలా సేపట్నుంచి అక్కడే కూచుని ఉన్నాడు.

ఆఫీస్‌కి టైం కావొస్తున్నాదని అతనికి తెలీనట్టు కూచున్నాడు.

ఆ గదిలోకి కాంతమ్మ ఇదివరకే ఏ తొమ్మిది పదిసార్లో వొచ్చి తొంగిచూసి వెళ్ళివుంటుంది.

ఆమె రాకపోకలు గమనించినట్టే లేదు సుబ్బారావు.

చేతిలో సిగిరెట్టుని చివ్వరిసారిగా పీల్చి పీకని కిటికీగుండా అవతలికి పారేశాడు.

కాని, ఎందుకో ఆ పారెయ్యడం అతనికే అతి కృత్రిమంగా అనిపించింది.

ఏదో పాపపు చిహ్నాన్ని పారేసినట్టనిపించింది.

ఎందుకనిపించింది ?

సుబ్బారావు గదిలోంచి బయటపడబోయాడు. అంతలో కాంతమ్మ గుమ్మంలో ఎదురుపడింది.

ఎవరో ఆజ్ఞాపించినట్టు తలవంచుకుని ఇవతలికి వచ్చెయ్యబోయాడు సుబ్బారావు.

'ఏమండీ—' అంది కాంతమ్మ. ఆమాటే అంది. కాని, ఆమె 'ఆగ'మని కూడా అన్నట్టు అతను ఆగిపోయాడు.

అతని కళ్ళలోకి సంశయాన్నీ, అతని నుదుటిమీదికి ముడతల్నీ, అతని పెదవులకు వేదన పోలికల వొంపునీ యిచ్చి వొక్కనిమిషం గడిచిపోయింది.

కాంతమ్మ అంది.

'లంచం తీసుకోకండి—మనం ఇన్ని దినాలూ మంచిగా బ్రతికాం— మనం మంచిగా బ్రతికి చెడిపోలేదు. చెడ్డతో డబ్బు తెచ్చేసుఖం — అది మనస్సుకి సుఖం కావచ్చు—కాని, ఆత్మకు సుఖంకాదు ... లంచం తీసుకోకండి...నేను మీకు చెప్పవలసినదాన్ని కాదు. కాని— లంచం— తీసుకోకండి— మన మంచికోసం—'

సుబ్బారావు నేల చూపులు చూస్తున్నాడు. (ఇది పాత పలుకుబడే కావచ్చుగాని,)

ఎందుకు చూస్తున్నాడు?

'ఈనేల ఎందుకు పటేల్ పటేల్‌మని తెగిపోవడం లేదు?— ఈనేల నన్నేల మింగెయ్యడం లేదు?—' అనుకుంటూన్నట్టు చూస్తున్నాడు.

గాజులచెయ్యి మళ్ళీ అతని గుండెల్ని కప్పింది.

'ఏమండీ...'

'............'

'కోపం వొచ్చిందా?'

దించిన తల దించినట్లే ఆమె ఎత్తిన కన్నుల లోకి చూశాడు.

'అనంతాంబరంపు నీలినీడ'లలో దారి ఏదో తెలిసొచ్చింది.

'రాత్రి అంతా ఎంత కలవరించారని ... బిల్లు ... బిల్లు... వందరూపాయలు... ఇంకా ఏమి టేమిటో అన్నారు.

సుబ్బారావు చూడడం లేదు. కాని, దృశ్యం కనిపిస్తోంది. సుబ్బారావు వినడంలేదు. కాని, మాటలు వినిపిస్తున్నాయి.


'నన్ను క్షమించండి...'

అని అంటున్నట్టు లీలగా వినిపించింది.

సుబ్బారావు చలించిపోయాడు.

సుబ్బారావు పెదవులు 'కాంతం...కాంతం...' అని ఏదో గొణిగి ఆపైన బలం చాలనట్టు ఊరు కున్నాయి.

కాని, ఆమె నడుమును చుట్టిన అతని చేతి వ్రేళ్ళు విపరీతంగా వణికాయి, మామూల్మాలు వణుకు కాదు. చెడుత్రోవని వెళ్ళిపోబోయిన మనస్సు మళ్ళీ మంచి త్రోవలో కాలుపెట్టినప్పుడు కలిగే ఆనందం వలని వణుకు !



పండితరాయల మందలింపులు

డా. మహీధర నళినీమోహన్

తుమ్మెద

'ఎక్కడికిరా ప్రయాణం?"

మునిమాపువేళ తాంబూలం నములుతూ హడావిడిగా ప్రయాణమై వెడుతున్న వెంకటశాస్త్రిని నిలవేసి అడిగేడు జగన్నాథుడు.

'పోతారం' అని ముక్తసరిగా వెంకన్న సమాధానం.

'నాకు తెలుసులే, పద్మినిదగ్గరకేగా?'

'ఛస్. దానికి రెండురోజుల నుంచి జ్వరం కాస్తోంది. తగ్గేవరకూ మనం ఆ చాయలకు పోదలుచుకోలేదు.'

'పాపం ఆ అమ్మాయికి ఎల్లాఉందో, ఏమైనా అవసమేరమో కనుక్కోవుట్రా?'

'గాడిద గుడ్డు! నేనేమైనా పుస్తకట్టేనా?'

'వోరి విశ్వాసఘాతకుడా! ఇదా నీ అనురాగం?'

'అనురాగం కాదు సింగినాదం' జీలకర్రానూ' అన్నాడు వెంకన్న నిర్లక్ష్యంగా తల ఎగరేసి. ఆ పిల్లతో ఎన్నో రాత్రులు ఆనందంగా గడిపేవు. ఏవేవో ప్రేమ పాఠాలు వల్లించావు. ఆమె దేవత అన్నావు. అవి అన్నీ అప్పుడే మరిచిపోయావురా? ఆ అమ్మాయి కాస్త నలతపడిందని ఆమెకేసి చూడనైనా చూడకుండా తప్పించుకు పోతావా? చాలా బాగుందిరా నీ ప్రవర్తన.

ఓ తుమ్మెదా! ఆ పద్మినిలో దూరి తియ్యని తేనెను పీకలదాకా తాగేవు. రాత్రి ఆమె కాగిట్లో నిద్రపోయావు. (తామరమొగ్గలో రాత్రివేళ తుమ్మెద బందీ అవుతుందని కవి సమయం) ఆ సంగతులన్నీ అప్పుడే మరిచిపోయావా? మంచు కురియడంచేత ఆ పద్మిని కాస్త వాడిందని దానికేసి కన్నెత్తి అయినా చూడకుండా పోతున్నావా? చాలా బాగుందయ్యా నీ ధోరణి.

రథోద్ధతా

పీత మత్ర మధు యాసితా నిశా
భృంగ! సర్వ మచిరేణ విస్మృతవ్ః
హీయమాన సుషమాం హిమాగమే
పద్మినీం యది హానావలోకసే

తేటగీతి

తేనె తెగత్రాగి రేల నిద్రించి నావు
అప్పుడే నీకు పరగడు పయ్యె తేటి!
మంచు కురియగ నొక్కింత మ్లానమైన
కమలినీసతి గన్నెత్తి కానకుంటి

* * *

ఓయి భ్రమరమా! ఆ పద్మిని రాగ పూర్ణమైనది. (ఎర్రనిదీ, అనురాగం కలదీ అని రెండు అర్థాలు) నీవో మలినుడవు.

ఆమె వికసిత వదన. నీవు వట్టివాగుడు కాయవి. ఆమె సరసురాలు. నీవు చపలుడవు. అయినప్పటికీ ఆమెను విడిచివెళ్ళి పోతున్నావు ఏమి సబబు?

ఆర్యా

మలినేఽపి రాగ పూర్ణామ్
వికసిత వదనా మమంద జల్పేఽపి
త్వయి చపలేఽపిచ సరసామ్
భ్రమర! కథం వా సరోజినీం త్యజసి?

తేటగీతి

మలినుడవు నీవు, రాగరమ్యాంగ యామె
వాగెదవు నీవు, వికసిత వదనయామె

చపల మానసుడవు నీవు, సరసయామె
ఏల పద్మిని విడిచిపోయెదవు? భ్రమర!

* * *

హారం

ఓ హారమా! గుణవతివి కదా నీకు పరస్త్రీల రొమ్ములమధ్య ఆడుకోవాలనే దుర్బుద్ధి ఏమిటి చెప్పు. కళంకి అయిన శీతకరునికి పరస్త్రీ జఘనాదులను స్పృశించడం ఉచితమేమో కాని, నీకిది భావ్యంకాదు. అన్నట్లు హారశబ్దం సంస్కృతంలో పుంలింగం కనుక స్త్రీ కుచాదులయందు వ్యామోహం ఉండడం సమంజసంగానే ఉంది కాని తెలుగులో హారం నపుంసక లింగం. 'గుణవంతుడవైన హారమా!' అని సంబోధించడం న్యాయంకాదు కదా! (గుణం అంటే దారం అని మరో అర్థం ఉంది)

ద్రుతవిలంబిత

గుణవత స్తవ హార! న యుజ్యతే
పరకళత్ర కుచేషు విలుంఠనమ్
స్పృశతి శీతకరో జఘనస్థలీ
ముచితమ స్తిత తదేవ కళంకినః

తేటగీతి

గుణ సమాహార హారమా! కోర దగునె
పరకళత్ర కుచద్వయ స్పర్శనంబు
మచ్చకల చందమామకు మానవతుల
యూరువుల నంటు టుచితమై యుండ నోపు

* * *

నక్షత్రాలు

పేరమ భట్టుగాని, జగన్నాథ పండితరాయలు గానీ దగ్గరలో లేనప్పుడు చిల్లరపండితుల ప్రభ కాస్తో కూస్తో మినుకు మనవచ్చు. కాని, వీరిద్దరిలో ఎవరు రంగంమీదికి వచ్చినా ఆ అల్పుల అయిపూ అనమాలూ ఉండదు.

ఓ తారలారా! సూర్యచంద్రులు ఆకాశంలో లేని సమయంలో మీ చిత్తం వచ్చినట్లు ప్రకాశించు కోండి. కాని వారి సమీపంలో మీరు అదృశ్యం కాక తప్పదు.

అనుష్టుప్

అసన్నిధానే హే తారాః!
ప్రకాశధ్వేఽర్కసోమయోః
తత్ప్రకాశ సమీపేతు
న దృశ్యాధ్వే కదాచన

ఆటవెలది

సన్నిధాన మందు చంద్ర సూర్యులు లేని
వేళలందు మీరు వెలుగవచ్చు
కాని వారి పొంత కాగడా వేసినా
మీరు కానరారు తారలార!

* * *

తారలను మరో విధంగా నిందిస్తున్నాడు చూడండి. ఓ తారలారా! మీ భర్త అయిన చంద్రుడు కనిపిస్తే మీరు వెలవెల బోతారు. అతగాడు లేనప్పుడు సింగారించుకుని మహాప్రకాశిస్తారు. మీది ఏమన్న ప్రాతివ్రత్యం?

ఉపజాతి

తారా హిమాంశోర్య ద సన్నిధానే
విభాథ యూయం పరిపూర్ణ శోభాః
తత్సన్ని ధానే నతథా కథంను
పతివ్రతా ఇత్యురరీ క్రియధ్వే

ఉపజాతి

ఓ తారలారా! రహియింతు రెంతో
శీతాంశు డభ్రమ్మున దోప కున్నన్
ఆతండు చూడన్ వెలవెల్ల బోవన్
పతివ్రతాత్వం బెటు లబ్బు మీకున్?

* * *

రాజహంస

పక్షులకు రాజువైన ఓ హంసా! పాలు, నీళ్ళు విడదీయ గలిగిన నీ తెలివి అంతా ఏమైపోయిందోయ్? చెరువు నీటిలో పున్నమి చందమామ తాలూకు ప్రతిబింబాన్నిచూసి, విరిసిన తామర పువ్వు అని భ్రమపడి, దానితూడు కొరుకుదామని వెతుకులాడుతున్నావా? ఆహాహా! చాలా బాగుందయ్యా!

వసంతతిలక

హే హంస ! పక్షిప ! పయస్సుజలం వివేక్తుం
శక్తస్య సంప్రతి మతిః క్వనుతే ప్రయాతా
కాసార వారిణి కళాం పతితాం యదిందో
రాదాతు మిచ్ఛసి బిసాంకుర వాంఛ యాత్వమ్

తేటగీతి

పాలు నీరును విడదీయ జాలినట్టి
నీ వివేక మేమయ్యెనే నేడు? హంస?
చెరువు నీటను వెన్నెల దొరను గాంచి
తమ్మి యని తూడు కొరుకగా దరిసినావు.

*　　*　　*

ఏనుగు

మదంచేత కళ్లు మూసుకుపోయిన ఓ గజేంద్రమా! ఇక్కడ ఒక్క క్షణం కూడా నిలువబడవద్దు. వెంటనే ఈ కారడవిని విడిచిపెట్టి పలాయనం చిత్తగించు. ఏనుగు అనుకుని పెద్దపెద్ద బండరాళ్లను తన పదునుగోళ్లచే పగులగొట్టి, అలిసిపోయి, అదిగో ఆ కొండ గుహలో మృగరాజు నిద్రిస్తున్నాడు జాగ్రత్త!

శిఖరిణి

స్థితిం నోరే దధ్యాః క్షణమపి మదాంధే క్షణ సఖే!
గజశ్రేణీ నాథ! త్వమిహ జటిలాయాం వన భువి
అసౌ కుంభి భ్రాంత్యా ఖర నఖర విద్రావిత మహా
గురుగ్రావగ్రామః స్వపితి గిరిగర్భే హరిపతిః.

మత్తేభ విక్రీడితం

మదనాగేంద్రమ! కన్నులం దెరువుమా!
మా మాట నాలింపుమా!
ఇది నీకున్ మన రాని కారడవిరా
యెందేని పొమ్మికన్.
పదునుం గోళ్ల కరిభ్రమన్
గురు శిలా వ్రాతమ్ములం జీల్చి, తా
నదిగో ఆ గిరి గర్భ మందిపుడు
పంచాస్యంబు నిద్రించెడిన్.

వసంతుడు

వసంతకాలం వచ్చింది. చెట్లు అన్నీ చిగిర్చాయి. పూలు పూచాయి. ప్రకృతి అంతా రమణీయంగా ఉంది. కాని, అందులో పండిత రాయలకి ఓ లోపం కనిపించింది. కోయిలలు, చిలుకలు, గోరువంకలు వంటి రమణీయమైన వాక్కు గలిగిన పక్షులనూ, మదించిన తాగుబోతులైన తుమ్మెదలనూ వసంతుడు సరిసమానంగానే పరిపోషిస్తున్నాడు. మంచివాళ్లల్లోని సుగుణాలనూ, దుర్మార్గులలోని దోషాలనూ వేరుపరుపగలగడం జాతి విహీనుడికి ఎల్లా సాధ్యం అవుతుందీ? అందరినీ కలిపి ఒక్క గాటను కట్టడమే అతడికి తెలుసు.

ఇందులో మంచి పక్షులకు ద్విజశబ్దాన్ని సాభిప్రాయంగా ప్రయోగించాడు.

నిరుపమానమైన కవిత్వధారలో మైమరపింపజేయగల తననీ, కండలుపెంచి కుస్తీలుపట్టే మల్లునీ ఒక్కలాగే గౌరవించిన రాజును నిందిస్తున్న ఘట్టం ఇది.

ఉపజాతి

ఏకం ద్విజంచ స్పృహణీయ వాచమ్
మత్తం ద్విరేఫం చ మధుః పుపోష
సతో గుణాన వ్యసితోఽపి దోషాన్
జాత్యా విహీనో నవివేక్తు మీష్టే.

తేటగీతి

తియ్యతియ్యగ పలికెడు ద్విజవరేణ్యు
మత్త మధుపాళి నొకరీతి మధుడుపెంచు
సద్గుణాఢ్యుల బహుళ దోషాకరులను
జాతిహీనుండు విడదీయ జాలకుండు.

*　　*　　*

కల్పవృక్షం

పైన చెప్పిన సందర్భంలోనే మరో కల్పన.

కల్పవృక్షం పుట్టినది క్షీరసాగరంలో. నివాసం నందనవనంలో. ఔదార్యం ముల్లోకములలోనూ ప్రసిద్ధమైనది. పరిమళం దేవతలను సైతమూ పరవశింపజేయగలది. ఇటువంటి మంచిలక్షణాలు ఎన్నో కలిగిన

కల్పవృక్షంలో ఒక్క దోషం ఉంది. తనని అర్థించిన వాళ్లల్లో తరతమ భేదాలున్నాయని గుర్తించదు. అందరూ సమానమే అంటుందిట.

శార్దూల విక్రీడితం

ఔదార్యం భువనత్రయేఽపి
విదితం సంభూతి రంభో నిధేః
వాసో నందన కాననే
పరిమళో గీర్వాణ చేతోహరః
ఏవం దాతృగురోర్గుణాః
సురతరోః సర్వేఽపి లోకోత్తరాః
స్వాదర్థి ప్రవరార్థితార్పిన
విధావేకో వివేకో యది.

మత్తేభ విక్రీడితం

జని యంభోనిధి, ఈవి
సర్వభువన జ్ఞాతంబు, వాసంబు నం
దన మందున్, సురలోక
మానస హరత్సౌగంధ్య సందర్భముల్
ఘన మన్నింటను నీ గుణంబులు—
అయినన్ కల్పద్రుమంబా ! సమం
బని భావించెదవేమి భావ్యము
నినున్ యాచించు వారెల్లరన్.

* * *

పిల్లనగ్రోవి

శ్రీ కృష్ణుడు స్వయంగా వాయించిన పిల్లన గ్రోవిలో కూడా పండితరాయలకి బోలెడు దోషాలు కనిపించాయి. దాన్ని ఎల్లా నిందిస్తున్నాడో చూడండి. అంతా శ్లేష.

మాధవుని పెదవులను అంటుకున్న మురళి రాగమును ఆవహించుగాక. దానికి మన అభ్యంతరం ఏమీలేదు. గాని, ఆ మురళి తాను ఉత్తమ వంశంలో పుట్టిన దానిననే తెగనీలుగు కట్టిపెట్టడం మంచిది. దానికి ఛిద్రాలు చాలా ఉన్నాయి.

మురళికి మాధవుడిమీద ప్రేమ పుట్టుగొచ్చి అతగాడి పెదవులను ముద్దుపెట్టుకుంటూను ఆవటా అంటే పరే దాని ఇష్టం. అంతేకాని తాను పుట్టిన కులం గొప్పదని గర్వించడం తగదు. దానిలో బోలెడు దోషాలున్నాయి. తీగలాగితే డొంక అంతా కదులు తుంది.

రాగం అంటే పాట అని ఒక అర్థం, అను రాగం అని మరో అర్థం. వంశం అంటే కులం అనీ వెదురు అనీ అర్థాలు. వివరాలు అంటే రంధ్రము లనీ లొసుగులనీ అర్థాలు. పిల్లనగ్రోవిని వెదురు గొట్టంతోచేసి రంధ్రాలు పొడుస్తారు కదా !

శ్రీ కృష్ణుణ్ణి మాధవుడు అనడంలో కూడా ఉదేశం ఉంది. అతడు లక్ష్మికి మగడు. అంటే మురళికి పరపురుషుడు. మరొకర్తి మొగుణ్ణి పట్టు కుని పాకులాడే పిల్లకి అభిజాత్యం ఏమిటి?

స్వాగతా

మాధవస్య మురళీ ముఖలగ్నా
రాగమావహతు కింతు వయస్యే
వంశజాఽహమితి మాఽస్తు సగర్వా
యా బిభర్తి బహుశో వివరాణి.

తేటగీతి

మాధవుని కెంబెదవులందు మసలు మురళి
రాగ సంపూర్ణయగుగాక బాగు బాగు!
కాని సద్వంశజ నటన్న గర్వమేల?
దాని వివరాలు లోకులందరకు నెరుక

* * *

కలువలు

ఎంత పెద్ద యింటి వాళ్లయినప్పటికీ ఆడ వాళ్లని నమ్మడానికి లేదట. దానిని శ్లేషచేత సమ ర్థించు కుంటున్నాడు.

కలువలు రాజుకి ప్రియురాళ్లు. (చంద్రుని ప్రియురాళ్లు అనీ, భూపతి భార్యలనీ అర్థాలు). అంత పెద్ద యింటి వాళ్లు అవుదురా, అయినాసరే వాళ్లు మధుపములతో (తుమ్మెదలతో, త్రాగుబోతులతో) రమిస్తున్నారుట!

అనుష్టుప్

ఉత్తమానా మపి స్త్రీణాం
విశ్వాసో నైవ విద్యతే

రాజప్రియాః కైరవిణ్యో
రమంతే మధుపై స్పృహా

ఆటవెలది

ఎట్టి పెద్దయింట పుట్టి మెట్టిన గాని
యింతినెపుడు విశ్వసింపరాదు
రాసకేళి సలుపు రాజ ప్రియాంగన
కువలయమ్ము మధుప కులముతోడ.

* * *

మోదుగు

ఓ మోదుగు చెట్టూ! అంత ఎత్తు పెరిగేవు. చిగుళ్లు తొడిగేవు. చక్కగా పూచేవు. ఫలించావు కూడానూ. అయినా, నీ మీద ఎంతో ఆశపెట్టుకున్న రామచిలుకలకి ఇంత నిరాశ ఎందుకు కలుగ జేశావే?

అనుష్టుప్

కింశుకే! కింశుకాః కుర్యు
రా రా మాశా నిరోధిని
మహోన్నతే పల్లవితే
పుష్పితే ఫలితేఽపివా

తేటగీతి

గగనమంటగ పెరిగి, కెంజిగురు తొడిగి
ఇన్ని పూవులు పూచి, ఫలించి కూడ
రామచిలుకల కేల నిరాశ నిట్లు
కలుగ జేసితి మోదుగా! పలుక వేమి?

పెద్ద ఆడంబరం, అట్టహాసం కనబరచడమే కాని, ఎంగిలిచేతితో కాకిని అదలించని పిసినిగొట్టును నిందించే సన్నివేశం ఇది.

* * *

నెమలి

నెమలి కన్ను నెమలితో మాట్లాడుతోంది.

ఏమయ్యోయ్! నెమలీ! వన్నెవన్నెల కన్నులం మేము. నీ తోకని అంటిపెట్టుకుని ఉన్న వాళ్లం. మమ్మల్ని విదలించి పారవెయ్యకు. మేము నీదగ్గర ఉండడం నీకే శోభ అని తెలుసుకో. అయినా బుద్ధి హీనుడవై మమ్మల్ని మమ్మల్ని వదిలేస్తే మాకేం నష్టం లేదు. ఏ మహారాజు కిరీటం మీదనో మాకు స్థానం లభిస్తుందిలే.

ఏమయ్యోయ్! జమీందారూ! మాబోటి విద్వాంసులు నీదగ్గర ఉండడం నీకే కీర్తిప్రదం అని తెలుసుకో. మమ్మల్ని వదిలించుకోవాలని ఆలోచిస్తున్నావా? దానివల్ల నీకే నష్టం. మాకు ఏ సార్వభౌముడి ఆ స్థానంలోనో కనకాభిషేకాలు జరుగుతాయిలే.

వసంతతిలక

అస్మాన్ విచిత్ర వపుషస్తవ పృష్ఠలగ్నాం
స్త్వ్యంనైవ ముంచసి సఖే! యదివా విముంచ
హాహంత! కేకివర! హానిరియంతవైవ
భూపాల మూర్ధని పునర్భవితాస్థితిర్నః

ఉత్పలమాల

మమ్ము విచిత్ర రూపులను
మన్నన వెన్నున నిమ్ము నంటు బ
ర్హమ్ముల మేనినుండి విడనాడకు
మోయి మయూరవర్య! న
ష్టమ్మగు సుమ్ము నీకె సఖుడా!
మముఁబాసితివేని—మాకు స్థా
నమ్ము లభించు లెమ్ము
జననాయక భర్మ కిరీట కోటులన్.

* * *

సముద్రుడు

ఓ సముద్రుడా! నీవే నీళ్లకి అధిపతివి. రత్నరాసులకు నీవే నిలయం. ఇంద్రుడికి భయపడి పారి వచ్చిన పర్వతాలకు అభయం ఇచ్చి, కడుపులో పెట్టుకున్నావు. మహాగంభీరుడవు. ఇన్నిసుగుణాలు కలిగి ఉండిన్నీ నీ నీళ్లను తాగడానికి పనికిరాకుండా చేశావా? ఈ లోకంలో జీవులకు ఆధారం ఇంకెవరయ్యా!

ఓ రాజా! ఈ సువిశాల దేశానికి నీవు ఏకచ్ఛత్రాధిపతివి. పరాక్రమంలో నన్నుమించిన వాళ్లు లేరు. ఐశ్వర్యంలో కుబేరుడితో పోటీ పడగలిగిన వాడివి. ఇన్ని మంచి లక్షణాలు కలిగి ఉండిన్నీ నీ సంపద ప్రజోపకారానికి వినియోగం కాకపోతే ఎందుకయ్యా?

ప్రహర్షిణి

తోయానా మధిపతి రాకరో మణీనాం
శైలానా మభయపదం మహాన్ మహద్భ్యః
అగ్రాహ్యోయది భవసి త్వమేవ తావత్
కోనుస్యా జ్జగతి తదాజనావలంబః?

ఉత్పలమాల

వారికి సార్వభౌముడవు,
వంద్యులమేటివి, దివ్య రత్న భం
డారమవు, ఆర్తశైల శరణ
క్షమకుక్షివి, సాటిలేని గం
భీరుడవయ్యు నీ జల మపేయ
మొనర్చితివేని, ఇంక నాధార
మెవండు జీవులకు ధారుణి
లోపల నీవె తెల్పుమా!

చంద్రుడు

ఓ చందమామా! పరిపూర్ణుడవై ఉన్నప్పుడు అందగత్తెల ముఖాలను పోలి ఉంటావు. క్షీణుడవై ఉన్నప్పుడు మహేశ్వరుని శిరస్సును అలంకరిస్తావు. ఎల్లాగయినా నీకు మంచిదే. అవునా? మరి ఎప్పుడో నూటికీ కోటికీ ఓ సారి రాహువు పళ్లు రవ్వంత గుచ్చుకున్నాయని సామాన్యుడిలాగ విలవిల్లాడిపోతా వేమిటయ్యా! ఆపాటి ఓర్చుకోలేవూ?

శార్దూల విక్రీడితం

పూర్ణః పంకజ లోచనా
తుల ముఖా మాయాసి కాలక్రమాత్
క్షీణోఽపి క్షణదాపతే!
పశుపతే రాయాసి భూషాస్పదమ్
ఏతస్మిన్నథ సైంహి
కేయ కవల క్లేశేమనా గ్వర్తిని
త్వం సాధారణవత్సుధాకర!
ముధా హాహంత! కింతామ్యసి.

మత్తేభ విక్రీడితం

పరిపూర్ణత్వమునన్
సరోజనయనా వక్త్రోపమానుండవై
గిరిజావల్లభ శీర్షమండలమునన్
క్షీణస్థితిన్ భూషవై
చిరకీర్తిన్ విలసిల్లు శీతకర!
కించి ద్రాహు దంతక్షతిన్
దురపిల్లం దగదోయి, బేలవని
నిన్నున్ నవ్వెపోరా జనుల్?

* * *

ఓ చంద్రుడా! కళలన్నీ నీలో మూర్తీభవించాయి. నీవు ద్విజపతివి. వినూత్నమైన కాంతులతో ప్రకాశించే వాడివి. రత్నాకరం నీ జన్మభూమి. శివుడే స్వయంగా నిన్ను తన నెత్తిమీద పెట్టుకున్నాడు. ఇంతకన్నా ఇంకేం కావాలి? కానీ, ఈ మహత్తులన్నీ కళంకంవల్ల విఫలమైపోయాయి.

శిఖరిణి

కలాస్తాస్తాః సమ్యగ్వ హసి
యదసి త్వం ద్విజపతి
ర్ద్యుతి స్తా దృజ్నూత్నాజని
రపి చ రత్నాకర కులే
బహు బ్రూమః కింవా
పురహర శిరోమండన మసి
త్వదీయం తత్సర్వం
శశధర! కలంకాద్వి ఫలితమ్.

మత్తేభ విక్రీడితం

వరియించెన్ కళలెల్ల నిన్ను,
రజనీ వాల్లభ్య మబ్బెన్, వినూ
త్న రుచుల్ దక్కె, లభించె
జన్మముల రత్నాగార వంశమ్మునన్
పుర విధ్వంసి స్వయమ్ముగా
తన శిరోభూమిన్ నినుం దాలిచెన్
హరిణాంకా! యివి యన్నియున్
విఫలితంబయ్యెన్ కళం కాప్తిచే.

* * *

చక్కెర

కోలాహలపండితు డొకనాడు మీవారు సంస్థానాధిపతి అయిన జగత్సింహుని దర్బారుకి వచ్చి, అక్కడి పండితు లెవ్వరికీ అర్థంకాని కవిత్వం తాను

చెప్పగలననీ, చేతనైతే తన శ్లోకానికి అర్థం చెప్పవలసిందనీ సవాలు చేశాడు. ఇంటి దగ్గర తీరిగ్గా కూర్చుని, ఏకాక్షర నిఘంటువులు తిరగేసి, చాలా శ్రమపడి వండిన శ్లోకాన్ని చదివేడు. అందులో పదాడంబరమే కాని రసం ఏమీ లేదు.

పాషాణపాకంలో ఉన్న ఆ నీరస శ్లోకాన్ని విని పండిత రాయలు పకపకా నవ్వేడు. ఆ నవ్వులోని వెటకారాన్ని గమనించి కోలాహలుడు ఎగిసిపడ్డాడు.

'యావద్భారతదేశంలోనూ నా కవిత్వాన్ని అర్థం చేసుకోగల పండితుల సంఖ్య వేళ్లమీద లెక్కపెట్టవలసిందే. నవ్వితే ఏమైనట్లు?' అని రుసరుసలాడేడు.

సాహిత్యాభిలాష ఉన్న ప్రతీ వాణ్ణీ మెప్పించి, పరవశింప జేసేదిగా ఉండాలిగానీ కవిత్వం అనేది ఓ పుంజీడు పండితులకోసం మాత్రమే కాదు అని నిరసించాడు పండిత రాయలు.

పంచదారని పట్టుకుని మామిడిచెట్టు నిందిస్తోంది!

ఓ చక్కెరా! అనవసరంగా మిడిసి పడకు. మహారాజుల ఇళ్లల్లో తప్ప సామాన్యులకు నీ రుచి ఎల్లా ఉంటుందో కూడా తెలియదు. తేనెబావుల వంటి మధురమైన పళ్ల నిచ్చి సమస్త జీవులనూ తృప్తి పరచే తీయమామిడిచెట్టును నేను. నీకూ నాకూ పోలిక ఏమిటే రండా!

ఆ రోజుల్లో పంచదార గొప్ప ధనవంతులకి తప్ప సామాన్యులకి అందుబాటులో ఉండేది కాదు. శ్రీనాథుడు ఓరుగల్లులో లక్ష్మణ వజ్ఝల వంటపురిటి ఇంటిలో రూపాయి ఇచ్చి చేసిన భోజనంలో గుప్పెడు పంచదార కూడా ఉన్నదని గొప్పగా చెప్పకున్నాడు కదూ !

శార్దూల విక్రీడితం

గర్వం మాకురు శర్కరే! తవగుణాన్
జానంతి రాజ్ఞాం గృహే
యే దీనా ధన వర్జితాశ్చ కృపణాః
స్వప్నేఽపి పశ్యంతినో
ఆమ్రోఽహం మధుకూపకైర్మమ
ఫలైః స్తృప్తాహి సర్వే జనాః
రండే! తవకిం గుణా మమఫలైః
స్తుల్యం న కించి త్ఫలమ్

ఉత్పలమాల

చక్కెర! నిక్కుమాను మిక
క్ష్మాతలనాథుల మందిరమ్ములం
దక్క మరెక్కడన్ తెలియ దాయెను
నీరుచి పేదవారికిన్
చక్కని తేనె బావులన తాలిన
పండ్ల నొసంగి నేను న
ల్దిక్కుల సర్వజీవులకు తృప్తి
నొసంగెడు తియ్యమామిడిన్.

చెరకు

చెరుగ్గడలో లోపాలు ఏముంటాయి? మామూలు కంటికి కనిపించవు. పండితరాయల నిశిత దృష్టికి కనిపిస్తాయి. చూడండి.

ఓ చెరుకూ! నువ్వు ఎంత అందంగా ఉన్నావు! ఎంత మధురంగా ఉన్నావు! నీ నిండా రసమేకదా! పైగా మన్మధుడికి అద్వితీయమైన ధనుస్సువి. అన్నీ బాగానే ఉన్నాయి కానీ, నీలో ఒక్కటే లోపం. నిన్ను సేవించిన కొద్దీ నీకు నీ రసం పెరుగుతుంది!

వసంతతిలక

కాంతోఽపి నిత్యమధురోఽపి రసాకులోఽపి
కించాస్తి పంచశర కార్ముఖ మద్వితీయమ్
ఇక్షో! తవాస్తి సకలం పరమేక మూనం
యత్ సేవితో భజసి నీరసతాం క్రమేణ.

ఉత్పలమాల

చక్కని దానవీవు, సరసం
బగుడెందము నీది, మన్మథుం
డెక్కెడు దివ్యచాప మవహీన
గుణంబుల ప్రోవు—అన్నియున్
దక్కెను గాని యొక్క కొరతన్
సవరింపవు—నీకు నీ రసం
బెక్కువగుం గదా యనుభవించు
కొలందియు నిత్తు దండమా!

* * *

నిమ్మపండు

ఓ నిమ్మపండూ! నీ కాంతి బంగారు కొండకు సాటి వస్తుంది. నీ సౌందర్యం కాంతాకుచ స్పర్థి. నీ సువాసన లోకోత్తరమైనది. మహారాజుల దర్శనానికి వెళ్లేటప్పుడు నిన్ను తీసుకువెడితే శుభప్రదం. ఒక్క కర్పూర ప్రాతికూల్యమే కనుక నీలో లేకపోతే సర్వ సద్గుణాలూ నీలోనే మూర్తీభవించాయని చెప్పవచ్చు.

శార్దూల విక్రీడితం

కాంతిస్తే కనకాచల ప్రతినిధిః
కాంతా కుచ స్పర్థితే
సౌభాగ్యం క్షితిపాల దర్శన విధౌ
త్వత్పూర్వకం దర్శనమ్
సౌరభ్యం సకలాతిశాయి భవతో
జంబీర! కింబ్రూ మహే
కర్పూర ప్రతికూలతా యదినతే
త్వయ్యేవ సర్వే గుణాః

మత్తేభ విక్రీడితం

కనకాద్రిన్ హసియించు కాంతియును,
లోకాతీత సౌరభ్యమున్
వనజాక్షీ కుచమర్దన క్షమము
సౌందర్యంబు, భూమీశ ద
ర్శన వేళన్ శుభదంబు నీ యునికి
ఓ జంబీరమా! సర్వ స
ద్గుణముల్ కల్గియు కప్పురమ్ము
నెడ శత్రుత్వమ్ము నీ కేలనే?

* * *

కొంగ

ఓ కొంగా! నీ శరీరపు రంగు హంసకి లాగే తెలుపు. నీ నివాసం పద్మాకరంలో, నీ నడకలలో కూడా మందత్వం ఉంది. హంసకి లాగే నీవి కూడా మనోరమములైన పలుకులు (మనః+రమాం అని ఒక అర్థంలోనూ; మనః+అరమాం అని రెండో అర్థం లోనూ ప్రయోగం). అప్పుడప్పుడు మౌన ధారణ మున్నూ ఉంది. అచ్చంగా రాజహంస లక్షణాలన్నీ నీకు పట్టుబడ్డాయి. ధన్యురాలివి. కాని, పాలూ నీరూ విడదీయవలసినప్పుడు నీ పసక్షీబయటపడిపోతుంది.

మహాపురుషుల కట్టు బొట్టు ఉంగవిన్యాసాది బాహిర లక్షణాలను సామాన్యులు అనుకరించడానికి ప్రయత్నిస్తూ ఉంటారేగాని వారి అంతశ్శక్తి సామర్థ్యాలను ఎక్కడ అందుకోగలరని నింద.

శార్దూల విక్రీడితం

నైర్మల్యం వపుషస్త వాస్తి
వసతిః పద్మాకరే జాయతే
మందం యాహి మనోరమాం
వదగిరం మౌనం చ సంపాదయ
ధన్యస్త్వంబక! రాజహంస
తులనాం ప్రాప్తోఽపి కింత్వైర్గుణై
ర్నీర క్షీరవిభాగ కర్మ ని
పుణా శక్తిః కథం లభ్యతే?

శార్దూల విక్రీడితం

నా రూపమ్ము వినిర్మలమ్ము,
నడలన్ మాంద్యమ్ము, మౌనవ్రతా
చారం బొక్కొకచో మహా
మధుర వాగ్జాలంబు, నా వాసమా
నీరేజాకరమంచు నంచలకు
నేనేసాటి యౌనందువా?
నీరక్షీర విభాగశక్తి బకమా!
నీ వెట్లు సాధింతువే?

* *

పిల్లి

పండితరాయల శిష్యకోటిలో బహు చిన్న వాడైన శంకరశాస్త్రి దారే వెడుతూ ఉంటే వంశీధర మిశ్రుడు అతణ్ణి కొరకొరా మింగేసేటట్లు చూచాడు. ఇంకా 'అ ఇ ఉ ణ్' ప్రాంతాల్లోనే ఉన్న ఆ అర్భకుడి మీదికి ఒంటికాలిమీద లేచి, 'మనోరమా కుచమర్దనం నిండా తప్పులే' అంటూ తన వ్యాకరణ పాండిత్యం అంతా ఒలకబొయ్యాలని చూశాడు.

'నాతో వాదిస్తే ఏముందీ, దమ్ములుంటే మా గురువుగారితో వాదించండి' అని ఒక్కమాటతో వంశీధరుడి నోరుమూసి, ఇంటికివచ్చి జరిగిన సంగతి అంతా పండితరాయలకి చెప్పేశాడు శంకరశాస్త్రి.

ఈ సన్నివేశాన్ని మనస్సులో ఉంచుకుని

అన్యాపదేశంగా పిల్లిని ఈ విధంగా నిందించాడు జగన్నాథుడు.

పంజరంలోఉన్న రామచిలుక బయటమున్న గండుపిల్లితో మాట్లాడుతోంది.

ఓసి పిల్లీ! పంజరంలో బంధింపబడి ఆత్మ రక్షణ చేసుకోలేని నాకేసి గుడ్లురిమిచూచి, గుర్రుమని అరుస్తున్నావుగానీ, నీ డొక్కచించి డోలుకట్టగల కుక్క ముందర నీ పరాక్రమాన్ని ప్రకటించవేమీ?

వసంతతిలక

రేరే బిడాల! పరిగర్జసిమాం విలోక్య
కీరం మనోహర మిమం నిజ పంజరస్థమ్
శ్వానం విలోక్య నహి దర్శయసి స్వవీర్యం
త్వద్దేహ పాటన పటుం దశనైః కరాళైః

ఉత్పలమాల

వన్నెలరామ చిల్క నను పంజర
బద్ధనుగాంచి పిల్లి! నీ
కన్నుల నిప్పుకల్ చెరిగి గర్జన
చేసెదవేల? పౌరుషం
బున్న త్వదీయ దేహదళ నోద్యమ
భీకర తీక్ష్ణ దంష్ట్రికా
భ్యున్నతుడైన భైరవుని ముందరచూపుము
నీప్రతాపమున్.

* * *

గాలి

ఓరి పాపిష్టి సమీరుడా!
ఎంత పని చేశావురా!
పాపం గొంతు పొడి ఆరిపోయి
విలవిలలాడి పోతున్న
చాతకపక్షి నోట్లో పడబోతూన్న
వాన చినుకును
పక్కనిగెంటి నేలపాలు
చేసేశావా? దుర్మార్గుడా!

భర్తృహరి చెప్పినట్లు తనకు ఏ లాభమూ

లేకపోయినా సరే ఇతరులకు నష్టం కలిగించడమే పరమార్థంగా పెట్టుకున్న మహానుభావు డెవరినో ఉద్దేశించి చెప్పినదిది.

ద్రుతవిలంబిత

అహహ! చండ సమీరణ! దారుణం
కిమిద మాచరితం చరితం త్వయా
యదిహ చాతక చంచు పుటోదరే
పతతి వారి తదేవ నివారితమ్

తేటగీతి

హోరి అప్రాచ్య చండ సమీరణుండ!
ఎంత పని చేసినావురా ఇంతలోన
వానకోయిల నోటిలో వ్రాలనున్న
వాన చినుకుల పడగొంటి వైచినావు.

*　　*　　*

బోయవాడు

ఓ బోయవాడా! భయంకరములైన పెద్ద పులులనీ, సింహాలనీ వదిలిపెట్టి, ఎన్నడూ ఎవ్వరికీ ఏ అపకారమూ తలపెట్టని, కొండల్లో కోనల్లో నదీ తీరాలలో గడ్డిమేసి పొట్టపోసుకునే లేడి పిల్లలని నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నావుకదురా! దేవుడు బల హీనులనే బాధిస్తాడనే సామెత నీవల్ల నిజమైందిరా!

బలవంతులైన శత్రురాజులనీ, పిండారీ గుంపులనీ ఏమీ చెయ్యలేక, పిరికివాడిలా తప్పుకుపోతూ, బలహీనులనీ అమాయకులనీ పట్టుకు పీడించే రాజును ఉద్దేశించి చెప్పినదిది.

శార్దూల విక్రీడితం

సర్వోద్వేగకరం మృగాదన మముం
సంత్యజ్య హాధిక్ త్వయా
లోకస్యా నపకారిణం గిరినదీ
తీరాటవీ నిర్వృతమ్
అశ్నంతం తృణమేణ శాబమదయం
వ్యాధ! ఘ్నతాముం వృథా
దేవో దుర్బలఘాతకోఽయమితి
సా గాథా యథార్థీకృతా.

మత్తేభ విక్రీడితం

అలఘూద్వేగ కరంబులైన హనన
వ్యాపార పారీణులన్
పులులన్ మాని అమాయికంబుగ
నదీ భూభృత్తటారణ్య భూ
ముల గడ్డిం దిను లేళ్ల జంపెదవురా
బోయండ! నీవల్ల దు
ర్బలునే దైవము బాధ పెట్టునను
వార్తల్ నిక్కమయ్యెం గదా.

*　　*　　*

పాడు నుయ్యి

దీనిని పిసినిగొట్టుతో పోల్చి నిందిస్తున్నాడు.

ఓ క్షుద్రకూపమా! భయంకరంగా, వల్లగా, క్రూరంగా, మొగం ముడుచుకుని, బక్కచిక్కి ఉంటావు. నీ విభవాన్ని పాతాళగర్భంలో దాచుకున్నావు. (లుబ్ధుడు తన డబ్బును భూమిలో పాతుకుంటాడు.) నీ దగ్గర ఉన్నదానిమీది అభిలాషతో ఆశతో చేర వచ్చినవారికి తలవంపులు కలిగించి, వట్టి చేతులతో పంపించేస్తావు. (నీళ్లకోసం నూతిలోకి తొంగి చూస్తారు బాటసారులు). నిన్ను ఏమని పొగడనూ ?

మందాక్రాంతా

భీమశ్యామ ప్రతను వదన
క్రూర పాతాళ కుక్షి
క్రోడ ప్రాంతోపహిత విభవ
స్యాథ కింతే బ్రవీమి
యేన త్వత్తః సమభిలషితం
వాంఛతః క్షుద్రకూప !
క్షామ్యన్మూర్తే ! భవతి సహసా
కస్య నాధో ముఖత్వం.

మత్తేభ విక్రీడితం

నలుపై, భీకరమూర్తివై, విభవమున్
పాతాళ గర్భమ్మునన్
[illegible], మొగమ్ము [illegible]
కొనుచున్, గ్రీష్మతప జ్వాలలన్

తలవంపుల్ కలిగించుచుందువు
కదా దాహగ్రహో విస్ఫులై
సలిలాశన్ నిమజేరు పాంథులకు
అజ్ఞాహీన కూపాధమా !

* * *

బంగారం

తనని పెడుతున్న ఇబ్బందులను తలుచుకుని బంగారం బాధపడుతోందిట. దానిని సున్నితంగా మందలిస్తున్నాడు.

గీటురాతిమీద గీసి, తక్కెడలో గురివెందలతో సరితూచి అవమానించారట. నిప్పులలోవేసి కాల్చారట. ముక్కలుగాకోసి, సుత్తితో కొట్టేరట. ఇల్లా చేశారని విచారిస్తావేమిటే బంగారమా! ఈవిధంగా శుద్ధి పొందడం చాలా అవసరం. లేకపోతే అందగత్తెల కంఠాన్ని కౌగలించుకోవడమూ, చెవులనూ చెంపలనూ ముద్దుపెట్టుకోవడమూ, రొమ్ములతో పెనగడమూ, పాణిగ్రహణం చేయడమూ, మొలని స్పృశించడమూ వంటి సుఖాలు వట్టినే కలుగుతాయా ?

'గురువులు తిట్టేరనీ, కొట్టేరనీ అలిగి చదువే మానేస్తానంటావేమిరా, ఈ శ్రమ ఏదీ లేకుండావే రాజసభలలో అపూర్వ సత్కారాలు ఎల్లా లభిస్తాయనుకున్నావురా' అని జగన్నాథుడు తమ్ముడు రామచంద్రభట్టును మందలించాడు. ఆ సన్నివేశాన్ని మనస్సులో ఉంచుకుని చేసిన కల్పన ఇది.

శార్దూల విక్రీడితం

ఆ దౌత్యం నికషేణ కించతులయా
వక్త్రేణ వహ్నేర్భవేః
శుద్ధాత్మాఽపి సువర్ణ! ఖండన విధా
నార్తిస్త్వయి శ్రీమతి
కంఠాలింగిని కర్ణచుంబిని కుచ
గ్రాహిణ్యహో సు భ్రువాం
పాణిగ్రాహిణి మేఖలాస్పృశి సుఖం
లోకః కథం పశ్యతి.

మత్తేభ విక్రీడితం

తులచేతన్, నికషంబుచే
కొలిమిలో దుర్వార తాపంబుచే
మలముం బాయుము,
సుత్తి దెబ్బ కడలన్ భావ్యంబె? బంగారమా!
లలనాపీన పయోధర గ్రహణముల్,
కంఠాన నాశ్లేషముల్
మొలపై ముద్దులు తీరగా
దొరకునా లోకంబులో నేరకిన్ ?

* * *

(ఇందులో ఉదాహరించిన తెలుగు పద్యాలు డాక్టర్ మహీధర నళినీమోహన్ అనువదించిన భామినీ విలాసంలోనివి.)

వేమన - ఊహాపోహాలు

శ్రీ పులిచెర్ల సాంబశివరావు

'నిక్కమైన మంచి నీల మొక్కటి చాలు
తళుకు బెళుకు రాళ్లు తట్టెడేల
చదువ పద్య మఱియు జాలదా యొకటైన
విశ్వదాభిరామ వినురవేమ.'

ఈ మంచి నీలమువంటి పద్యమును జెప్పినది వేమన. వేమన కవియే! సందేహము లేదు. కాని వేమనకు కవికంటె యోగిగా నధిక ప్రచారము కలదు. 'యోగి వేమన' అనియేకాని 'కవి వేమన' అనుట లేదుగదా! వేమన ప్రధానముగ యోగి. తరువాతనే కవి. ఈ విషయమును విస్మరించి నేటి విమర్శకులు వేమనను మహాకవిగా స్తుతించుచున్నారు. వేమనకీ సంగతి తెలిసినచో నేటి విమర్శకులను జెడ తిట్టుననుటలో సందియమెందుకు? పూర్వపు కవులు కొందరు ధనమున కాశించి కవిత్వము చెప్పిరి.

'తోట కూరకైన దొగ్గలి కైనను
తవుటి కుడుముకైన దవిటికైన
గావ్యములను జెప్ప ఘనులెల్ల ధనపరుల్
విశ్వదాభిరామ వినురవేమ'

అని వేమన తన నాటి కవులను విమర్శించెను. కులమును, మండలమును మనసులో నుంచుకొని విమర్శ సాగించు నేటి విమర్శకులను వేమన బ్రతికి యుండినచో బ్రతుక నిచ్చునా ?

తెలుగు కవులను గూర్చి తెలిసిన చరిత్ర తక్కువ. ప్రచారమునందున్న కథ లసంఖ్యాకములు. కథలను గాదవి, విమర్శకులు చరిత్రలను నిర్మింప ప్రయత్నింపు చున్నారు. ప్రయత్నము మంచిదే! కాని చిత్రమేమన వీరు చరిత్రపేరుతో, తమ తెలివి తేటలతో కల్పించిన మరికొన్ని కథలను మన కందించుచున్నారు. కృత్రిమమైన వీరి కథలను నమ్ముటకంటె, అమాయకులైన జానపదుల రసనాగ్రములపై నుండు కథలను నమ్ముటయే యారోగ్యదాయకము.

వేమననుగూర్చి యన్నియు ననుమానములే ! మొదలు వేమన పద్యములేవో, కానివేవో నిర్ణయించుటయే యొక కష్టము. వేమన కాలమునుగూర్చి పెక్కు సందేహము లున్నవి. దేశము సంగతి సరేసరి! వీనిని నిర్ణయించుటకు వేమన జీవితము కొంత తెలిసిన బాగుండును. వేమనను గూర్చిన కథలలో ముఖ్యమైనదిది.

కొమరగిరి వేమారెడ్డి కిరువురు కుమారులు గలరు. పెద్దవాడు కోమటి వెంకారెడ్డి; చిన్నవాడు రాచవేమారెడ్డి. వీరినే అనవేమారెడ్డి యనియు వేమారెడ్డి యనియు నందురు. వేమారెడ్డి వేశ్యాలోలుడై ధనమును వ్యర్థము చేయుచుండెను. వేమ రెడ్డి యన్నచో నాయన వదినెగారికి వాత్సల్యము మెండు. అడిగినచో లేదనక సొమ్మ నిచ్చుచుండెను. ఒక పర్యాయము గడన కత్తె వేమారెడ్డిని ఆయన వదినెగారి ముక్కరను తెచ్చియిమ్మని కోరెను. వేమారెడ్డి వదినగారిని ముక్కరకొరకై యాచించెను. వదినె గారెట్లయినను వేమారెడ్డి మనసును మార్పదలచి యుండెను. ఒక యుక్తి పన్నెను. వేశ్య వస్త్రహీనయై యున్నప్పుడే ముక్కర నిచ్చునట్లొడంబడిక చేసికొనిన తరువాతనే ఆమె వేమారెడ్డి కద్దాని నొసగెను. వేమారెడ్డి యట్లే యా ముక్కరను వేశ్యకిచ్చెను. వివస్త్రయైన వేశ్య శరీరమును జూచి వేమారెడ్డి తన తప్పిదమును తెలిసికొని, వేశ్య నసహ్యించుకొని తిరిగి స్వగృహమునకు వచ్చెను.

అభిరామయ్యయను కమసాలి యొకడు ప్రభువులకు కావలసిన యాభరణములు చేయుచుండెను. అతడు కొలది దినములుగా నాలస్యముగా వచ్చుటను వేమారెడ్డి గమనించెను. వానిని వెంబడించెను. వాడు సమీపారణ్యమున నొక గుహలోనున్న లంబికా శివయోగి పర్యించుటను గమనించెను. విరక్తుడై యున్న

వేమారెడ్డికి లంబికా శివయోగి యాశాకిరణమువలె కన్పట్టెను. మరునాడు అభిరామయ్యను లంబికా శివ యోగి కడకు పోకుండునట్లు చేయవలెనని దలంచి, వేమారెడ్డి అభిరామయ్య కొక కఠినమైన పని నప్ప గించెను. ఆ కాలమును తానే సద్వినియోగపరుచు కొనెను. లంబికా శివయోగినుండి యోగ రహస్యముల నెరిగెను. తనకీ యవకాశము వచ్చుటకు కారణభూతు డైన అభిరామయ్యను వేమారెడ్డి మరచిపోలేదు. 'విశ్వదాభిరామ వినురవేమ' అని ప్రతి పద్యమునకు చివర చేర్చుచు, నీతులు చెప్పుచు లోక సంచార మునకు బయలుదేరెను. పేమతారక విద్యతో తన యప్పులను దీర్చివైచెను. భౌతిక బంధములను దెంచి వైచికొనెను.

తల్లి గర్భమందు దా బుట్టినప్పుడు
మొదల బట్ట లేదు తుదను లేదు
నడుమ బట్టగట్ట నగుబాటు కాదొకొ
విశ్వదాభిరామ వినురవేమ.

అని కట్టుబట్టలను సైతము విసర్జించి, దిగంబరియై తిరుగుచు, చివరకు కదిరి తాలూకాలోని కటారు పల్లెలో శార్వరి నామ సంవత్సరము శ్రీరామ నవమినాడు సమాధిని బొందెను.

ఈ కథలో చరిత్రకు భిన్నమైన ముఖ్యాంశ మొకటి కలదు. రాచవేమారెడ్డి యనువాడు పెద కోమటి వేమారెడ్డి కుమారుడు! కుమారగిరికి సంతానములేదని కొమర్రాజు లక్ష్మణరావు గారనిరి. కుమారగిరికి కుమారుడున్నట్లు చిలుకూరి వీరభద్ర రావుగారు శాసనాధారముతో నిరూపించిరి. రాజ్య భ్రష్టుడైన కుమారగిరి సంతానమునుగూర్చి తెలిసి కొనుట కష్టమే! ఏది యేమైనను కుమారగిరికి సంతానములేదని నిరూపించుట కష్టము. అట్టి శాసనములేవియు లేవుగదా! కుమారులున్నచో వారికి కోమటి వెంకారెడ్డి, రాచవేమారెడ్డి అని పేళ్లుండుట కభ్యంతరమేమి ? పెదకోమటి వేమారెడ్డికి రాచవేమా రెడ్డి యను కొడుకుండవచ్చును. ఈ పేరొక్కనికే యుండవలెనన్న నియమమేమియు లేదు కదా! ఈ కథ యబద్ధమన్ని నిరూపించుట కేమి సాక్ష్యముగలదు. మన తెలివి తేటల నెట్లయినను ప్రదర్శింపవలెనను నుత్సాహము లేకున్నచో నీ కథను విశ్వసింపవచ్చును. నిప్పు లేనిచో పొగరాదు. ఈ కథలో తప్పక కొంతయైన సత్యముండును. దీనిని కాదని రాళ్లపల్లివంటి వారేవేవో పిచ్చియూహలనుజేసి తికమకపడిరి. పాఠకులను తికమకపెట్టిరి.

వేమన పదునైదవ శతాబ్దమువాడని నిశ్చయ ముగా చెప్పవచ్చును. వేమన యోగీంద్ర చరిత్రము లోను, వేదాంత సిద్ధాంతములోను వేమన కొమరగిరి వేమారెడ్డి కుమారుడనియే కలదు. దీని నన్యాయముగ ఖండించిన కలుగు ఫలమేమి? మర్యాదగ వేమన కుమారగిరిరెడ్డి కుమారుడని యంగీకరించుట లెస్స. క్రీ. శ. 1400 వరకు కుమారగిరిరెడ్డి ప్రభువుగా నుండెనుగాన మన వేమన పదునైదవ శతాబ్దివాడే కదా! వేమన కాలమును నిర్ణయించుటకు విమర్శకులు తమ కనుకూలమగు సత్యముల నుదహరించుచున్నారు.

పరగ రాయని కుల బాచని ధనమెల్ల
భటులపాలు కవుల పాలు తలప,
ఒనర హీనుని ధనము దాయాదుల
పాలు జారకాంతుపాలు వేమ

అను పద్యముతోని రాయని భాస్కరుడు 14 వ శతాబ్ది వాడని వంగూరివారు నిరూపించిరి.

భవదూరుడు శరభాంకుడు
శివశీలుడు వేయుగోటి సిద్ధేశ్వరుడున్
శివ భృత్యుడు వట మూలుడు
శివమయ చిన్మయుడు సోమశేఖర గురుడున్

ఈ పద్యములోని సోమశేఖరుడు పోతన్న గురు వని సుబ్బారావుగారి భావము. వీరి యుద్దేశమును ఖండించుటకు,

ప్రాకటముగ నిట్టి లోకములో గంటి
పల్లెముత్తడెన్న బరమ గుణుడు
అన్నదానమునను హరుపూజ చేతను
హరునిలోన ఐక్యమాయె వేమ.

అను పద్యమును మరికొందరు చూపిరి. గుంటుపల్లి ముత్తమంత్రి క్రీ. శ. 1623లో మర ణించెను గావున, అయనను స్మరించిన వేమన 17 వ శతాబ్దివాడని వీరు భావించిరి !

తమ వాదమునకు బలము చేకూర్చుకొనుటకై ఇట్లు పలుతెరగుల వీరు ప్రయత్నించిరి. నిజమునకీ పద్యములు వేమన రచించినవి కావని సహృదయు లెవరైనను స్పష్టముగా జెప్పగలరు. అందువలన వీరి వాదము లీ విధముగ నిలువజాలవు!

మరి వేమన పద్యము లెట్లుండును ?

'ఊరు కొండవీడు ఉనికి పశ్చిమ వీధి
మూగ చింతపల్లె మొదటి యిల్లు
ఎడ్డి రెడ్డి కులమదేమని తెల్పుదు
విశ్వదాభిరామ వినురవేమ.'

ఇది వేమన పద్యమేయని వేమన పద్యములతో పరిచయమున్న సహృదయు లెవరైనను జెప్పగలరు గదా. ఆ సరళ సుందరమైన భాషయే వేరు! ఆ కమ్మని తెలుగుతనపు తీరే వేరు! ఆ చమత్కారపు మాటలు, ఆ సూటిమాటల వేగము...అన్నియు వేరే! ఈ పద్యము వేమనయే చెప్పెనని నమ్మినచో, వేమనకు కొండవీటి సంబంధము స్థిరపడుచున్నది. వేమన రెడ్డి కులజుడనుట స్పష్టము.

కలియుగమున నున్న కాపుకులానకు
వేమన తనకీర్తి విక్రయించె
ఉన్న ధర్మమెల్ల నుర్విలో నరులకు
గొల్లవెట్టె బరము గోరి వేమ

అను పద్యములోని కాపు శబ్దము ప్రత్యేక కులమును దెలుపునదికాదు, కృషీవలులను కాపులనుట సామాన్యమే. రెడ్లనునట్టి కృషితో జీవించు వారే. కావున నీ పద్యములోని కాపు శబ్దమునకు రెడ్డి యనియే యర్థము. మొదట కొండవీటిలోనున్నను తరువాత వేమన మూగచింతపల్లి మొదలగు ప్రదేశములలో సంచరించి యుండవచ్చును. వేమన దేశమును నిర్ణయించుటకు ప్రయత్నించుచు రాళ్లపల్లి వారిట్లూహించిరి.

'మరియు, వేమన వాడిన ఈ క్రింది పదములు చూడుడు: మంకు, తారాడు, సంబళము, సొడ్డు, కళవళము, కూయు, చాడి, దుడ్డు, తాళిక, బిత్తరి ఇత్యాదులు కన్నడసీమకు సమీపమగు తెలుగుదేశమందే వాడుకలో గలవు. మరియు ఆకు వక్క, బైసి, వరికి, ఒక్కపొద్దు, ధుద్దు, పీకు, కుళ్ళపోతు మొదలగు శబ్దములు నల్లమల కీవలి వారికితప్ప ఆవల వారి కర్థమగునా యనియే నా సందేహము. వీనికితోడు కుంక, చెంబడి, ఊక వంటివి ఈ దేశమున వాడుక లేని పదములు అపురూపముగా గలవు కాని, యివి వేమనవంటి దేశద్రిమ్మరికి వచ్చుట వింతగాదు.'

ఈ శబ్దములలో నధికభాగము గుంటూరు మండలవాసులకు చక్కగా నర్థమగును. ఈ సంగతి తెలియని రాళ్లపల్లివారు వీని నుదాహరించి వేమన్నను రాయలసీమవానిగా నిరూపింప తిప్పలు పడిరి.

వేమన పద్యము లెన్నియో యెవరును జెప్ప జాలకున్నారు. ఈ పద్యములను జూడుడు.

నీతి వైరాగ్య భక్తి వినీతులకును
ఘాతకులు గాని జ్ఞాన సంకలితులకును
వ్రాలకందని పద్యములో వేలసంఖ్య
చేతనందుగ వేమన జెప్పె భువిని.

శ్రీకర శివతత్త్వ శీలుడౌ వేమన్న
పదియు నైదువేల పద్యములను
లోకమందు జెప్పె ప్రాకృతుల్ దరిజేర
విశ్వదాభిరామ వినురవేమ.

ఈ పద్యములనుబట్టి వేమన పద్యముల సంఖ్యను నిర్ణయింపజాలము. కాని, వేమన పద్యములు లవే లోనె యుండుననుట స్పష్టము. ఇప్పుడు వేమన పద్యముల పేరుతో నైదువేల పద్యములు చెల్లుబాటగుచున్నవి.

ఆధునికాంధ్రసాహిత్యయుగ కర్తయైన వీరేశలింగముగారు వేమనను కవిగా గుర్తింపలేదు. వేమన గూర్చి విశేషకృషి సల్పిన బ్రౌన్‌దొర కూడ వేమనను కవిగా స్తుతింపలేదు. బ్రౌన్‌దొర వేమన పద్యములను 'వర్సెస్ ఆఫ్ వేమన' అనుపేరిట నాంగ్లములోని కనువదించెను. దీనితో వేమన జగత్ ప్రసిద్ధుడయ్యెనని కొందరాంధ్రులు అమాయకమైన ఊహ చేయుచున్నారు. కాని, ఆ యాంగ్లీకరణమును తిరిగి ఆంధ్రులే చదువుకొను చున్నారన్న సత్యమును వారు గ్రహించుటలేదు. 'తెలుగు నేర్చుకొనగోరు పరదేశీయుల కొరకే వేమన పద్యములను ఆంగ్లములోని కనువదించుచున్నాను' అని బ్రౌన్ దొర స్పష్టముగా చెప్పికొనెను! ఈ నాటివారు

తమ భావములకు సమానముగా వేమన భావములున్నవని భ్రమించి, ఆయనను మహాకవిగా స్తుతింప శ్రమించుచున్నారు. వేమన తాను మహాకవి యగుటకు యత్నింపలేదు. ఏవో కొన్ని నీతులు చెప్పవలెనని తలంచెను. కృతకృత్యుడయ్యెను. వేమన నిజముగ కవిత్వము వ్రాయ తలచినచో మహాకవియై యుండెడివాడే! ఆయనకు లేని ఈ యూహ మన విమర్శకులకు కలిగినది. ఆ నీతి పద్యములనే ఊతగాగొని వేమనను మహాకవి చేయుచున్నారు. ఇది చింత్యము. నీతులు, హాస్యోక్తులు కవిత్వముకాదని గ్రహింపవలెను. వేమన పద్యములలో—

ఆకులన్ని దిన్న మేకపోతులకేల
కాకపోయెనయ్య కాయసిద్ధి
లోకులెల్ల వెఱ్ఱి పోకిళ్ల బోదురు
విశ్వదాభిరామ వినురవేమ

కోతిబట్టి తెచ్చి క్రొత్త పుట్టము గట్టి
కొండముచ్చులెల్ల కొలిచినట్లు
నీతిహీను నొద్ద నిర్భాగ్యులుందురు
విశ్వదాభిరామ వినురవేమ.

అనువుగానిచోట నధికుల మనరాదు
కొంచెముండుటెల్ల కొదువగాదు
కొండయద్దమందు కొంచెమై యుండదా
విశ్వదాభిరామ వినురవేమ.

చాకి కోక లుదికి చీకాకు పడజేసి
మైలదీసి తెల్ప మడిచినట్లు
బుద్ధి జెప్పువాడు గ్రుద్దితే నేమయా
విశ్వదాభిరామ వినురవేమ.

ఆలిమాటలు విని అన్నదమ్ములరోసి
వేరె పోవువాడు వెఱ్ఱివాడు
కుక్కతోకబట్టి గోదావరీదునా ?
విశ్వదాభిరామ వినురవేమ.

మొదలగు మంచి నీతులుండ వచ్చును. లేక—

పాలసాగరమున పవ్వళించినవాడు
గొల్లయిండ్ల పాలు కోరనేల
ఎదుటివారి సొమ్ములెల్లవారికి తీపు
విశ్వదాభిరామ వినురవేమ.

గుహలలోన జొచ్చి గురువుల వెదకంగ
క్రూరమృగ మొకండు తారసిలిన
ముక్తిమార్గ మదియె ముందుగా జూపురా
విశ్వదాభిరామ వినురవేమ.

గొడ్డు టావు బితుక గుండ గొంపోయిన
పండ్లురాల దన్ను; పాలనీదు;
లోభివాని నడుగ లాభంబు లేదయా
విశ్వదాభిరామ వినురవేమ.

లోభివాని జంప లోకంబు లోపల
మందు వలదు, వేరు మతము గలదు
పైక మడిగినంత భగ్గునపడి చచ్చు
విశ్వదాభిరామ వినురవేమ

పిసిని వాని యింట బీనుగు వెడలిన
కట్టె కోలలకును కాసులిచ్చి
వెచ్చమాయెననుచు వెక్కివెక్కేడ్చురా
విశ్వదాభిరామ వినురవేమ

సకల తీర్థములను సకల యజ్ఞంబుల
తలలు గొరుగకున్న ఫలము లేదు.
మంత్రజలముకన్న మంగలిజల మెచ్చు
విశ్వదాభిరామ వినురవేమ.

మొదలగు హాస్యోక్తులుండవచ్చును. ఈ పద్యములనంతవరకే మెచ్చుకొనవలెను. నీతులందును, చమత్కారములందును నీ పద్యములు సాటిలేనివే! అంగీకరింపవచ్చును. గొప్ప కవిత్వమున్న నిదే యని చెప్పి నచో చిక్కువచ్చును!

చెప్పదలచుకొన్నదానిని సూటిగా చెప్పుట వేమన కిష్టము, అందేదో వేరొక అంతరార్థ ముండునను కొనుట మన భ్రమ.

చెప్పులోని రాయి చెవిలోని జోరీగ
కంటిలోని నలుసు కాలి ముల్లు
ఇంటిలోని పోరు నింతింత గాదయా
విశ్వదాభిరామ వినురవేమ.

వంగూరి సుబ్బారావుగారు తమ 'వేమన'లో నిట్లు వ్రాసిరి. 'ఈ క్రింది పద్యమున కీ క్రింది విధమున వేదాంతు లర్థమున్న దందురు. నీవులోని (శరీరము నందలి) రాయి ననగా పరమాత్మను జెప్పుము; చెవిలోని ప్రణవనాదమును జెప్పుము. నేను లోని (నాలోని) నలుసు ననగా బరమాత్మ కిరణ లేశమును గనుగొంటిని, (సంసారము) కాలిముల్లని కనుగొంటిని. ఈ శరీరమను ఇంటిలోని పోరు సంసార వైరాగ్యముల నడుమ నెంతయో కలదు.' నిజమున కిందే యితర అర్థమును నుండియుండదు!

నీరు కారమాయె కారంబు నీరాయె
కారమైన నీరు కారమాయె
కారమందు నీరు కడురమ్యమై యుండు
విశ్వదాభిరామ వినుర వేమ.

అను పద్య మర్థము కాలేదని రాళ్లపల్లివారు బాధ పడిరి. అస లిందు వేమన పద్యముల తీరున్నాదా? లేదు. ఇది వేమన పద్యము కాదు. కాన చిక్కులేదు. కొన్ని పద్యములలో వైద్య పద్ధతి యున్నదని కొందరు భావించుచున్నారు.

కుక్క గరచెనేని కూయనీయక పట్టి
ప్రక్క విరుగదన్ని పండబెట్టి
నిమ్మకాయ దెచ్చి నెత్తిన రుద్దిన
కుక్క విషము దిగును కుదురువేమ.

ఇనుమును జేసిన మైనపు కడ్డీ
ఇంటివెనుక నట్టావుల దొడ్డి
అవిటికి మేపిన కుందురుగడ్డి
విప్పి చెప్పరా వేమారెడ్డి

మొదలగు పద్యములను వారుదహరించుచున్నారు. ఇవి నిశ్చయముగా వేమన పద్యములు కావు!

వేమన బంగారమ్ము జేసెనని మన విమర్శకులు నమ్ముట విచారకరము. వారీ పద్యములనుజూచి భ్రమించుచున్నారు.

ఉప్పు చింతపండు లూరిలో నుండగా
గరువదేల వచ్చె గావులార

తాళకం బెరుగరో తగరంబు నెరుగరో
విశ్వదాభిరామ వినురవేమ.

ఉప్పు జెముడు పాలు నూరనే యుండంగ
గరవు కరవ టంద్రు కాపులార
సత్తు పొత్తుచేసి సాధించి చూడక
విశ్వదాభిరామ వినురవేమ.


నిమ్మపండు పుల్సు నిజమైన రసముండె
హేమమునకు నేడ్తు రేల ప్రజలు
సత్తు పొత్తుజేసి సాధింపలేరొకో
విశ్వదాభిరామ వినురవేమ.

ఇందు హేమకార విద్యయున్నదని వారి దుర్భ్రమ.

ఉప్పు, చింతపండు, జెముడుపాలు, నిమ్మ రసము, సీసము, తాళకము, తగరము మొదలగునవి బంగారము చేయుట కుపకరించు వస్తువులని వారర్థము చేసికొనిరి. కాని ధనమును, లోభితనమును, దురాశను దూషించిన వేమన బంగారమును జేయుమనునా? ఈ పద్యములను కరువుకాలములో వేమన చెప్పెను. కరువు దినములలో ప్రజలు దురాశకులోనై ధన సంపాదనకు సమకట్టుట సహజము. అట్టివారికి హితబోధ గావించుటకై ఈ పద్యములను జెప్పియుండవచ్చును. తాళకమునకు నిప్పుసెగ తగిలిన మాత్రమున ఆవిరియైపోవును. తగరము నేలలోపడిన కొద్దికాలమునకే యంతర్ధానమగును. మానవ జీవితమును నింతే! ఈ క్షణికమైన జీవితమును నిలబెట్టుకొనుటకు ఉప్పు, చింతపండు, జెముడుకాయ, పాలు, నిమ్మరసము మొదలగునవి చాలును. వీని నెవరును పండింప నవసరము లేదు. కరువుకాలమందును లభ్యమగును. సత్యముతో మనసు కలిపి మోక్షమును సాధింపవలెనేకాని, బంగారమునకై దేవులాడ నవసరము లేదు.

వేమన భావమదియై యుండవచ్చును!

వేమన జీవితమును గూర్చి నిర్ణయించుటకు ముందు, నిజమైన వేమన పద్యములేవో నిర్ణయించుట మంచిది. వాని సాహాయ్యముతో చేసిన నిర్ణయములు సత్యమునకు కొంత చేరువగ నుండవచ్చును.



నన్నపార్యుని భాషామనీష

డా. బొడ్డుపల్లి పురుషోత్తం

1

ఆంధ్ర వాఙ్మయానికి ఆదికవి నన్నపార్యుడంటే, కొంతమందికి సందేహమున్నా, ఎట్లాగో అంగీకరిస్తారు. ఆయన ఆదికవిమాత్రుడే కాక గొప్ప లిపి విజ్ఞానవేత్త (Palacographist). అంతేకాక గొప్ప భాషా విజ్ఞానవేత్త (Linguist) కూడా. ఇంతటి సర్వతోముఖ వైజ్ఞానిక సంపదగల మహాకవి కాబట్టే 'నన్నపార్యుడు' ఆంధ్రజాతికి· నిత్యం ప్రాతః స్మరణీయుడుగా ఉన్నాడు. భాషా విజ్ఞానవేత్తగా ఆయన వ్యక్తిత్వాన్ని కొంత తెలుసుకొనే చిన్న ప్రయత్నమే ఈ వ్యాసం.

నన్నపార్యుని ఈ క్రింది భారత ప్రయోగాల్ని పరిశీలిద్దాం.

(1) చ్యవన సుతుడైన సుమతితో చదివె
సకల వేద వేదాంగములు (1—2—164)

(2) సకల వేదంబులు చదివె వసిష్ఠుతో
(1—4—168)

(3) విలువిద్య కఱచు చుండిరి కుమారకులు
కృప ద్రోణాచార్యుల తోడ (1—5—181)

(4) వేదంబుల్ చదివించె భూసురులతో
విఖ్యాతిగా (1—5—190)

(5) ధనుర్వేద మగ్నివేశుల తోడ నర్థి గఱచి
(1—7—5)

(6) ధౌమ్యుతో వేద మంగ యుతంబుగా చదివె
(1—8—227)

(7) చిత్ర సేనుడన్ గంధర్వపతి తోడ
గౌరవమున వజ్రధరుడు గీత వాద్య
నృత్యంబులు గరవపంచె (1—1—369)

పై ప్రయోగాలు ఇప్పుడు మనం వ్యవహరించే తీరుకంటే భిన్నంగా ఉన్నాయి. మనమిప్పుడు ఫలానవారి దగ్గఱ చదువుకొన్నాం. లేదా ఫలానావారి వద్ద చదువుకొన్నాం అని అంటాం. నన్నయ పై ప్రయోగాల్లో తృతీయా విభక్తి—తో లేక తోడ అనేది ఉపయోగించారు. పై ప్రయోగాల్లో మొదటి ఆఱు వేదాధ్యయనానికి సంబంధించినవి. విలువిద్య కూడా వేదాంగమే. ఏడవ ప్రయోగం నృత్యవిద్యకు సంబంధించింది. దీన్నికూడా నాట్యవేదంగా పరిగణించవచ్చు. అప్పుడు మొత్తం వేదాలకు సంబంధించినవే అవుతాయి.

వేదాలు స్వరప్రధానమైనవి. స్వరదోషం దుష్ఫలితాలకు దారితీస్తుంది గదా! వైదిక సంస్కృతభాషలో 'స్వరం'కూడా ఒక వర్ణమే (Phoneme). అందుచేత వేదాధ్యాపకుడు కూడా అప్రమత్తుడై నిత్యం శిష్యులతో పాటు తాను స్వరాన్ని కైవశం చేసుకోవాలి. పై ఏడవ ప్రయోగంలో సంగీతంకూడా అటువంటిదే. నృత్యం కూడా శిష్యుడుతోపాటు అడుగు వేస్తుండక పోతే అభ్యాసం తప్పిపోతుంది. ఇట్టి ప్రాముఖ్యాన్ని మనస్సులో పెట్టుకొని, భాషా విజ్ఞానవేత్త నన్నపార్యుడు అధ్యాపక శబ్దానికి తృతీయా విభక్తి ప్రయోగం చేసాడని అనక తప్పదు. సంస్కృతంలో ఇటువంటి సందర్భాల్లో పంచమీ విభక్తి మాత్రమే ఉపయుక్తమౌతుంది.

2

ఇది కారకానికి సంబంధించిన విషయం తెలుగు సంప్రదాయ వ్యాకరణాల్లో తొలిదిగా పరిగణింపబడ్డ

ఆంధ్ర శబ్ద చింతామణిలో 'సర్వ విభక్తి స్సంస్కృత తుల్యా' అని పేర్కొన బడింది. ఇట్లా చెప్పబడ్డా 'అన్యస్య క్వచిద్భవేచ్చాన్యా' అని కూడా చెప్పబడింది, ఈ కారిక క్రింద అహోబలపతి తన పాండిత్య ప్రకర్ష చూపుతు, నన్నయ భారతాదుల్నుండి ప్రయోగాలు సముద్ధరిస్తూ ఎంతో వ్యాసంగం చేసాడు. కాని పై ప్రయోగాలు ఆయన కనుచూపు మేరకు రాక పోవటం ఆశ్చర్యకరంగా ఉంది.

స్వతంత్రమైన తెలుగు వ్యాకరణాలు చాలా సంక్షిప్తమైనవి. వాటిలో ఇటువంటి హాని కవకాశం లేదు.

చిట్టచివరకు, నన్నయగారి పై ప్రయోగాల్ని సూక్ష్మంగా పరిశీలించిన ఘనత అర్వాచీనుడైన చిన్నయ సూరికి దక్కింది. ఆయన 'ఉపయోగంబునం దాఖ్యాతకు తోడ వర్ణకంబగు' (కారక-7) అని సూత్రించి, తన సొంత ఉదాహరణం—'రామకృష్ణులు సాందీపనితోడ వేదంబులం జదివిరి' అని యిచ్చాడు. సూత్ర రచనలో చిన్నయసూరి పాణిని పద్ధతి ననుసరించాడు, 'ఆఖ్యాతోప యోగే' (1—4—29) అనేది పాణినీయ సూత్రం. 'ఆఖ్యాత' అంటే అధ్యాపకుడు, 'ఉపయోగం' అంటే 'నియమపూర్వక విద్యా స్వీకారం'. పాణిని సూత్రం లోని పదాల్ని చేపట్టినా, సంస్కృతంలో అది అపాదాన కారకం. పంచమీ విభక్తి. తెలుగులో చిన్నయసూరి చెప్పింది—తృతీయా విభక్తి, కాని కొంతమంది పండితులు ఈ సూత్రంలో పాణిని పదప్రయోగం ఉండటాన్నిబట్టి 'సంస్కృత కారక చ్ఛాయ' ఉందనుకోటం భ్రాంతి మూలకం. సంస్కృతాంధ్రాల్లో ఇప్పటికీ భిన్నకారకాలే ఉన్నాయి.

కాని యిటువంటి సందర్భాల్లో నన్నపార్యుడు కేవలం తృతీయా విభక్తినేకాక, పంచమీ విభక్తిని కూడా ప్రయోగించాడు. 'భూసురులవలన వేదంబులును, ధనుర్వేదాది విద్యలును గఱచుచు' (1—3—12) ఇత్యాదులు. ఇట్లాంటి ప్రయోగాలు ఎనిమిది దాకా ఉన్నాయి. 'వలన' అనే పంచమీ విభక్తి ప్రయోగాల్లో సంస్కృత కారక ప్రభావం స్పష్టపడుతున్నది. మఱి కొన్ని చోట నన్నపార్యుడు 'చేతన్ లేక చేన్' అనే కరణ కారకాన్ని ఉపయోగించారు. 'పరమరాముచేత దివ్యాస్త్రములు ప్రయోగ రహస్య మంత్రములతోఁ బడసి' (1—5—202) ఇత్యాదులు.

దీన్నిబట్టి నన్నయ (i) తోడన్ లేక తోన్ (ii) చేతన్ లేక చేన్ (iii) వలన అనే విభక్తుల్ని 'ఉపయోగార్థం'లో ఉపయోగించినట్లు విదిత మౌతున్నది. నన్నయ ప్రయోగ విస్తృతినిబట్టి చూస్తే చిన్నయసూరి సూత్రం చిన్నదే అవుతున్నది. అందుచేత ఆధునిక వ్యాకరణాల్లో చిన్నయ సూరి సూత్రాన్ని లోపరహితంగా చేయటానికి ప్రయత్నం జరిగింది. 'ఉపయోగమునం దాఖ్యాతకుఁ దృతీయా వలన అగు'—సులభ వ్యాకరణం—కారక—॥సూ.

3

తెలుగు మొదలైన ద్రావిడ భాషల్లో, తృతీయా విభక్తికి రెండర్థాలున్నాయి. (i) సహార్థం (The conjunctive or social case) (ii) కరణార్థం (The Instrumental case) సహార్థక విభక్తి—తోడ; కరణార్థక విభక్తి—చేత. సహార్థక విభక్తి, కరణార్థానికి కూడా ఉపయుక్తమౌతుంది కాని కరణార్థక విభక్తి సహార్థానికి ఉపయోగించరు. ఉదాహరణకు: వాడు కత్తిచేత ఖండించాడు; కత్తితో ఖండించాడు. కమల జ్వరంతో పరీక్ష రాసింది, కమల కలంతో పరీక్ష రాసింది అనవచ్చు కాని 'కమల జ్వరం చేత పరీక్ష రాసింది' అనగూడదు.

సంస్కృతంలో ఈ రెండర్థాలకు తృతీయా విభక్తే ఉపయుక్తమౌతుంది: ఖడ్గేన ఛేదతి; రామేణ గచ్ఛతి; ఇలా సంస్కృతంలో ఉండబట్టే తెలుగు వ్యాకర్తలు కూడ సంస్కృత పద్ధతి ననుసరించి తృతీయా విభక్తిని పేర్కొన్నారు. ద్రావిడభాషా వ్యాకర్త లందఱు కూడా ఇటువంటి ప్రమాదానికే లోనైనారని; ద్రావిడ భాషల్లో సహార్థాని కెంతో ప్రాముఖ్యముందని; దాన్ని సరిగా గుర్తించక పోవటం విచార్యమని కాల్డ్వెల్ ఈ రీతిగా ఉద్ఘాటించాడు: "The Conjunctive or social case has an

important position, in the Dravidian languages, and it has been omitted in each dialect from the list of cases or added on to the instrumental case, simply because Sanskrit knows nothing of it as separate from the instrumental".

ద్రావిడ భాషల్లో సహార్థానికి ప్రత్యేక విభక్తు లుండటమే ఆ భాషల్లో వానికిగల అవసరాన్ని ప్రాము ఖ్యాన్ని చెప్పకే చెప్తున్నదని కాల్డ్వెల్ ఇంకా ఇలా అంటాడు. ."The Conjunctive or social stands in greater need of a place of its own in the list of cases in those languages than in Sanskrit seeing that in these it has case-signs of its own, which in Sanskrit it has none." (పుట. 278)

ద్రావిడ భాషల్లో 'సహార్థా'నికిగల ఈ ప్రాము ఖ్యాన్ని గూర్చి కాల్డ్వెల్ ఎంతగా నొక్కివక్కాణించినా, నన్నయ లాగా నియమ పూర్వక విద్యా స్వీకారం విష యంలో ఈ సహార్థక విభక్తి ప్రయోగం మరే ద్రావిడ భాషలోను లేకపోవటం గమనార్హం, ఇతర ద్రావిడ భాషల్లో పై సందర్భాల్లో పంచమీ విభక్తే ఉపయుక్తమౌతుంది. లేదా సప్తమీ విభక్తి నుప యోగించవచ్చు. ప్రాచీన తమిళంలో 'పల్' అనే పర ప్రత్యయం ఉపయుక్తమౌతుంది. 'వలన' అని దీని యర్థం. పంచమీవిభక్తి అన్నమాట, ఉదాహరణకు 'అవన్ ఎన్ పల్ తమిళ్ కట్టాన్'—అతడు నా వలన తమిళం నేర్చుకొన్నాడు.

నవీన తమిళంలో 'ఇడమ్' అనే పరప్రత్యయం ఉపయోగిస్తారు. దగ్గఱ లేక వద్ద అని దీని అర్థం. ఇది సప్తమీ విభక్త్యర్థం. ఉదాహరణకు: 'అవన్ ఎన్నిడమ్ తమిళ్ కట్టాన్'—అతడు నావద్ద తమిళం నేర్చుకొన్నాడు.

ప్రాచీన కన్నడంలో 'బలరామను, శ్రీకృష్ణనుమ్ సాందీపనియిమ్ వేదమమ్ కల్తర్' మధ్యకన్నడంలో 'బలరామను, శ్రీ కృష్ణను, సాందీపని యింద వేదనన్ను కవితరు.' నవీన కన్నడంలోను పై మాదిరే. 'ఇమ్, ఇన్దమ్, ఇన్దె, ఎ' అనేవి ప్రాచీన కన్నడంలోను; 'ఇన్దు, ఇన్ద' అనేవి అర్వాచీన నవీన కన్నడాల్లోను, తృతీయావిభక్తి కరణార్థక విభక్తులు. ఇవి పంచమీ విభక్త్యర్థంలో ఉపయుక్తం. 'అత్తినమ్' అనే విభక్తి ప్రాచీన కన్నడంలోను, 'దెస ఇన్ద' అనేది నవీన కన్నడం లోను పంచమ్యర్థంలోను ఉపయుక్తం. సప్తమీవిభక్తి 'అల్లి' అనేది కూడా ఈ సందర్భంలో ఉపయుక్త మౌతుంది. దీన్నిబట్టి 'సహార్థక తృతీయావిభక్తి' ఈ సందర్భంలో ఉపయుక్తం కాదని విదితమౌతుంది. ఇక్కడ ఒక హెచ్చరిక. సహాధ్యయనాన్ని చెప్పే సహార్థక ప్రత్యయం వేఱు.

మలయాళ భాషలో కూడా పంచమీ, సప్తమీ విభక్తులే ఉపయుక్తమౌతున్నాయి కాని, సహార్థక తృతీయ ఉపయుక్తం కావటంలేదని తెలుస్తుంది. ఒక వేళ వాడుకలో ఉన్నా, వ్యాకరణాల్లో లక్షణం ఏర్పాటు అయినట్లు లేదు. ఉదా: బలరామనుమ్, శ్రీకృష్ణమమ్, సాందీపనియిల్ నిన్నుమ్ వేదజ్ఞల్ పడిచ్చు. సాందీపని వద్ద అని అర్థం.

ఆంగ్లభాషలో తమ వద్ద పరిశోధన చేస్తూ, తమ బుద్ధివికాసానికి కూడా కారణభూతులయ్యే విద్యార్థిని 'He has studied with me' అని ఆచార్యులవారు చెప్పటం కద్దని తెలుస్తుంది. హిందీలో 'కేసాథ్' అనే సహార్థకం ఇటువంటి సందర్భాల్లో వాడుక చేస్తారని తెలుస్తుంది. ఉదా: రామ్ ఔర్ కృష్ణనే సాందీపని కేసాథ్ వేదోంకే అధ్యాపన్ కియా. కాని హిందీ వ్యాకరణంలో ఈ రీతి ప్రయోగాల్లోని లక్షణం నిరూపితం అయినట్లు కానిపించదు. హిందీలో 'సే' అనే పంచమీ విభక్తి కూడా ఉపయుక్తం అవు తున్నది. ఈ రీతిగా ఇతర భాషల్ని కూడా పరిశీలించ వచ్చు. ఏమైనా సహార్థకంలో తృతీయా విభక్తిని; నన్నయ లాగా ఉపయుక్తం చేయటం, దానికి వ్యాకరణ నిరూపణం ఉండటం ఇతర భాషల్లో మృగ్యం అనే చెప్పవచ్చు.

4

పై విషయాన్ని క్రోడీకరిస్తే విద్యాభ్యాసం చేయటంలో మూడు విధానాలు గోచరిస్తాయి:—

(i) అధ్యయనంలో అధ్యాపకుడు కూడా అధ్యేత లేక అధ్యాపితునితోపాటు పాల్గొనటం.

(ii) విద్య అధ్యాపకునిచే అధ్యాపితునకు ప్రసారం కావటం.


(iii) అధ్యాపితుడు విద్యను అధ్యాపకునినుండి సంపాదించటం.

ఇందు తొలిభావాన్ని బాగా నిరూపించటానికి సహార్థకమైన 'తోడన్ లేక తో' అను విభక్తి నుపయోగించటంలో ఎంతో ఔచిత్యం గోచరిస్తుంది.

అధ్యాపకుని చేత విద్యాప్రసారం జరిగే సందర్భంలో. చేతన్/చేన్ అనే విభక్తి నుపయోగించటం ఉచితమే.

గురువునుండి విద్యాసముపార్జనంచేసే సందర్భంలో అపాదాన కారకమైన పంచమీవిభక్తి 'వలన' ఉపయుక్తం కావటం సముచితమే. పై త్రివిధాభిప్రాయాల్ని ఈ రీతిగా చిత్రంద్వారా నిరూపించవచ్చు:

ఉపయోగము



పై రీతిగా నిరూపితమైన మూడు విభక్తుల్లోను సహార్థకమైన 'తోడ,తో' అనేది గంభీరార్థం కలది. ఇది పూర్వం వేద విద్యాభ్యాసానికి సంబంధించి యుపయుక్తమైనా, ఆధునిక లౌకిక విద్యల నభ్యసించటంలోను దీన్ని ఉపయోగించవచ్చు. 'గురువనే వాడు నిత్య విద్యార్థి' అనే పరమ రహస్యం ఇందులో పొందుపఱుపబడి ఉండటంవల్ల దీని ప్రాముఖ్యం విశేషమైంది. విద్యాభ్యాసంచేత శిష్యులు వృద్ధులౌతారు కాని నిరంతర విద్యాప్రదానంచేత గురువులు నిత్యయౌవనులౌతారనేది (వృద్ధాః శిష్యాః, గురుర్యువా) శంకర భగవత్పాదులవారు ఆధ్యాత్మిక విద్యా విషయంగా చెప్పినా, లౌకిక విద్యలకు కూడా కాస్తో కూస్తో అన్వర్తించక పోదు. ఈ అనుభూతి పొందలేనివారు, అధ్యాపక వాచ్య లెందరో ఉండవచ్చు. వారు కేవలం వృత్తిమాత్రోప జీవులు. అట్టి వారికి అపాదాన కారకం కానీ, కరణ కారకంకాని వాడవచ్చు. కాని సహార్థకం వాడటం తగదు.

సహార్థానికి గల ఈ యనిర్వచనీయ ప్రాముఖ్యాన్ని మనస్సులో పెట్టుకోనే, చిన్నయసూరి మహాశయుడు ఉపయోగంలో ఆఖ్యాతకు 'తోడ'ను మాత్రమే విధించి ఉంటాడని భావించటానికి అవకాశం ఉండక పోదు. 'తోడ' పట్ల ఆయనకు ప్రత్యేకాభిమానం ఉండి ఉండవచ్చునని అనవచ్చు: సూరి అటువంటి అంతస్తుగల సూరివర్యుడే కదా!!

ధనాదుల్ని దానం చేయటంచేత దాతకవి క్షీణించిపోవటం తథ్యం. కాని విద్యాధనాన్ని దానం చేయటంచేత, దాతకున్న విద్యాధనం క్షీణింపదు సరి కదా! ఇంకా వృద్ధిపొందుతుంది. ఇది చాలా విచిత్ర సంఘటనం. మహాకవి, విద్యారహస్యవేది భర్తృహరి 'అర్థిభ్యః ప్రతిపాద్యమాన మనిశం ప్రాప్నోతి వృద్ధిం పరామ్'— 'విద్యయను దివ్యధనం బఖిలార్థికోటికిం బూర్తిగ నిచ్చినన్ బెరుగు, పోదు యుగాంతపు వేళనైన' అని ఎంతో ఉదాత్తంగా పేర్కొంటాడు.

ఇంతటి విద్యావిధాన రహస్యవిశేష సంపదగల

సంస్కృతభాషలో తత్ప్రకటనం సముచితంగా సమకూడకపోవటం ఆశ్చర్యంగా ఉంది. 'సహనావవతు' అనే రీతిని 'సహ' శబ్దంవల్ల గురుశిష్యులు కలిసి చదువుకోటం చెప్పబడుతున్నా, విభక్తి విషయంలో 'ఆఖ్యాతోప యోగే' 'అపాదానమ్' అని అపాదాన కారకమే పాణిని చేత ఉద్ఘాటింప బడింది కాని సహార్థకం ఎక్కడా చెప్పబడలేదు; అపార భాషా మనీషోపేతుడైన నన్నయభట్టారకుడు తెలుగులో సహార్థక విభక్తి నీరీతిగా ఉత్తమ విద్యావిధాన విస్ఫూర్తి కుపయోగించి ఆంధ్రభాషకిప్పట్ల ఉదాత్తతా కల్పనం కావించారు. 'ఋషివంటి నన్నయ్య రెండవ వాల్మీకి' అనే ప్రస్తుతి ఇటువంటి కారక సృష్టివల్ల సార్థకమే అవుతుంది.

భాషాశాస్త్రవేత్తృత్వం అంటే— భాషాప్రయోగ రీతుల్ని యథాశక్తిని వివరించటం మాత్రమేకాదు. నూత్ననూత్న భాషాప్రయోగరీతుల్ని కల్పించటం కూడా అని గ్రహించాలి. ఆ పద్ధతిలోను నన్నయభట్టారకుడాదర్శ భాషాశాస్త్రవేత్త. వాగనుశాసనమంటే ఇదే. ఆ మహోదయున కీ రీతిగా అంజలించి ఆసంగిద్దాం :

'వాచాం ఆంధ్రమయీనామ్
యః ప్రవక్తా ప్రథమోఽభవత్
ఆచార్యం తం కవీంద్రాణామ్
వందే వాగను శాసనమ్.'



విప్లవ కవుల కవితావస్తువు - ఒక విమర్శ

శ్రీ దోనెపూడి వెంకయ్య

ఈనాడు సాహిత్యరంగమున నలువైపులలో బహుధా చర్చనీయాంశమగుచున్న విషయము మార్క్సువాదము. కమ్యూనిజమన్నను నిదే. మార్క్సు దీనికి ప్రణేత కావున దీనిని మార్క్సిజ మనుచున్నారు. దీనిని కవితావస్తువుగా గ్రహించి నేడు 'విరసం' సభ్యులయిన రచయితలందరును రచనలు చేయుచున్నారు. దిగంబరకవులకు ప్రేరణాస్రోత మీ మార్క్సువాదమే. అభ్యుదయము, ప్రగతి, క్రాంతి, విప్లవము, శ్రామికుల శ్రేయోరాజ్యము, వర్గసంఘర్షము, సమసమాజము, స్వేచ్ఛాసమాజము— ఈ చెప్పెడి మాటలన్నియు నీ వ్రాయు వ్రాతలన్నియును మార్క్సును కేంద్రబిందువుగా పెట్టుకొని వచ్చుచున్నట్టివి. లేదా మార్క్సును మూలాధారముగా గ్రహించి బయలుదేరినట్టివి. ఈ విప్లవరచన లన్నింటికి మార్క్సువాద మాధారముగా తాత్త్విక ప్రాతిపదిక నిచ్చుటకు, వారి భావములను సూత్రనిబద్ధము చేయుటకు వ్యాసములు వచ్చుచున్నవి. 'కవిత్వం—చైతన్యం' అన్న వ్యాస సంపుటివి శ్రీ త్రిపురనేని మధుసూదనరావు ప్రచురించి యున్నారు. కవితారంగమున నింతటి సంచలనము కలుగజేయుచున్న ఈ మార్క్సువాద స్వరూప స్వభావాదుల నొకింత చర్చించుట సందర్భోచితమే యగును.

అసలు మార్క్సు చెప్పినదేమి ? మార్క్సు చెప్పిన సర్వసిద్ధాంతములకును మూలాధార మాతడు సూత్రీకరించిన విశ్వదర్శనము (Cosmology). ఈ సృష్టి యున్నది. దీనిని విశ్వమనవచ్చును. అనంతకోటి బ్రహ్మాండములనవచ్చు. దీని స్వరూపము, దీని నియమములు—వీనిని చర్చించునది విశ్వదర్శనము. ఈ సృష్టి యెచ్చటనుండి వచ్చినది? ఎచ్చటకు పోవుచున్నది? ఏమార్గమున బయనించుచున్నది? (Whence, Whither, and how). ఈ దర్శన మీ విషయములను స్పృశించును. చర్చించును. కార్ల్ మార్క్సు వీనికి సమాధానము చెప్ప యత్నించెను. ఈ కనుపించున దంతయు భౌతిక పదార్థము నుండి (Matter) బయలుదేరినది. జడద్రవ్యమే సర్వమునకు కారణము. ఇది మొదటి సూత్రము. ఇది ఆ నాటికి న్యూటన్(Newton) చెప్పిన సిద్ధాంతము. భౌతికమయిన ఈ పదార్థమంతయు క్రమక్రమ పరిణామము చెందుచు నూర్ధ్వముగా బయనించుచున్నది. (This is upward movement of matter). ఇది మార్క్సు కాలము నాటికి ప్రముఖుడైన డార్విన్ (Darwin) చెప్పిన పరిణామ సిద్ధాంతమునకు (Theory of Evolution) మరి యొకపేరు. ఇది రెండవ సూత్రము. ఈ జడపదార్థము వికసించుచు పోవుటకు విరోధవికాసమే (Dialecticism) మార్గముగా నున్నది. ఇది మార్క్సు కంటె ముందువాడైన (Hegal) అను తత్త్వజ్ఞుడు చెప్పిన సిద్ధాంతము. ఇది మూడవ సూత్రము. ఈ విరోధవికాసమన్న దానిని కొంచెము వివరింపవలయును. కమ్యూనిజము నందు దీని కత్యంత ప్రాముఖ్యత యున్నది. ఇది యొక ప్రక్రియ. ఒక స్థితి యున్నది. దానిని థీసిస్ (Thesis) అందురు. అట్టి ప్రతిస్థితి యందును అంతర్విరోధ ముండును. అనగా నందులోనే విరోధశక్తులు నిర్మాణమై వృద్ధిచెందుచుండును. దానికి ఆంటీ థీసిస్ (Anti thesis) అని పేరు. ఈ రెంటికిని సంఘర్షణ జరుగును. దీనిలో థీసిస్ నశించును. అప్పుడు మూడవ వస్తువు తయారగును. దానికి సింథసిస్ (Synthesis) అని పేరు. ఈ సింథసిస్ మరల థీసిస్ అగును. దానిలో మరల నొక ఆంటీథీసిస్ నిర్మాణమగును. మరల సంఘర్షణ జరుగును. ఇక నిదే వరుస. ఉదాహరణకు

కోడి గ్రుడ్డున్నది. అది థీసిస్. దానిలో ప్రాణశక్తి నిర్మాణ మగును. అది ఆంటీథీసిస్. రెంటికిని సంఘర్షణ జరుగును. థీసిస్ అయిన గ్రుడ్డు నశించును. కోడిపిల్ల బయటకు వచ్చును. అది సింథసిస్ అది మరల థీసిస్ అగును. ఈ క్రమము నిరంతరము సాగుచుండును.

ఈ విధముగా న్యూటన్, డార్విన్, హెగెల్—ఈ ముగ్వురి సిద్ధాంతములను గుదిగ్రుచ్చి మార్క్సు తన సిద్ధాంతముగా జెప్పెను.

కాని న్యూటన్ సిద్ధాంతమును తరువాతి కాలమున ఐన్‌స్టీన్ ఖండించి తప్పని ఋజువు పరచెను. డార్విన్ తాను చెప్పిన సిద్ధాంతమును తానే శంకించెను. తరువాత జీవశాస్త్రమునందు జరిగిన పరిశోధనలలో ఈ పరిణామక్రమ మన్నది ఊర్ధ్వముఖముగానే కాక అధోముఖముగా కూడ జరుగుటకు వీలున్నదని తేలినది. (Evolution and Involution). అట్లే విరోధ వికాసమన్నది కూడ ఖండింపబడినది. ఈ జగత్తులోని ఏ పదార్థమును నశించుటలేదు. (Matter is indestructible). అది రూపాంతరము చెందును. నీరున్నది. అది మంచుగా మారవచ్చును. లేదా ఆవిరి కావచ్చును. కాని నశింపదు. అట్లే ప్రతి పదార్థమును—శాస్త్ర పరిశోధనలచే తేలిన ఈ సత్యముల కారణముగా మార్క్సువాద మంతయు ముక్కలు ముక్కలయినది.

దీని కింకొక కారణము కూడ నున్నది. వర్గ సంఘర్ష సిద్ధాంత మున్నది. ఇది విరోధ వికాస సూత్రము నాధారము చేసికొని బయలుదేరిన వాదము. దీని ప్రకారము ధనిక వర్గము Thesis. శ్రామికుల అసంతృప్తి ఆంటీథీసిస్. వీరి సంఘర్ష ఫలితముగా ధనిక వర్గము (Thesis) నశించును. సమాజవాదము, లేదా సామ్యవాదము నిర్మాణ మగును. కాని సామ్యవాదము కూడా మరల ఒక థీసిస్ అగుననియు, దానిలో మరల ఆంటీథీసిస్ నిర్మాణ మగుననియు, తత్ఫలితముగా ఒక సింథసిస్ వచ్చుననియు మార్క్సు చెప్పలేదు. అందుచే అతని అనుయాయులు చెప్పరు. మార్క్సు కీ విషయ మానాటివారే చెప్పిరి. విరోధ వికాస మన్నది సార్వకాలిక నియమముగా (Universal law) తన విశ్వదర్శనమునందు మార్క్సు చెప్పినప్పటికిని, శ్రామికుల శ్రేయోరాజ్యము నిర్మాణమైన తరువాత అది కూడ నశించుట తప్పనిసరి యన్నచో కమ్యూనిజమే నశించునని యొప్పుకొన్నట్లగును. అట్లొప్పుకొనుట వారి కిష్టము కాదు. ఒప్పుకొనకపోయినచో వారి సిద్ధాంతము భ్రష్టమగును. ఇట్టి ఇరకాటములో పడినట్టిది మార్క్సు వాదము.

మరియొక ముఖ్యాంశ మున్నది: మార్క్సు తన కమ్యూనిస్టు సమాజముయొక్క రూపురేఖలు తీర్చి దిద్ది చెప్పిన సందర్భ మేమైన యున్నదా? అత డట్టి పని చేయలేదు. తానూహించిన సమాజ జీవనము నందు రాజ్యము—ప్రజలు, సమాజము — వ్యక్తి, స్త్రీ—పురుషులు, యజమాని — సేవకులు, తల్లిదండ్రులు—పిల్లలు, గురువు శిష్యులు—వీరందరి పరస్పర సంబంధ బాంధవ్యము లెట్లుండును? వివిధ వ్యవస్థల స్వరూపము లెట్లుండును? సామాజిక జీవన వ్యవస్థలకు చెందిన అనంత విషయము లున్నవి. అవి ఎట్లుండును? వీనిని గురించి అతడు చెప్పిన దేమియును లేదు. చేసిన కల్పన లేమియును లేవు. అతడిచ్చిపోయిన 'బ్లూ ప్రింట్' ఏమియును లేదు. కేవలము విరోధ వికాస సిద్ధాంతమును చెప్పెను. ఎట్లయినను విప్లవము వచ్చును. దానిని మనము ముందుగానే రక్తపాతము ద్వారా సంపాదించినచో నెన్నడో వచ్చునని వేచియుండ నక్కరలేదు. సుఖప్రసవము కానిచో శస్త్ర చికిత్స చేసినట్లు, శీఘ్రముగా రక్త విప్లవము ద్వారా మార్పు తేవచ్చును. దానితో కాలగతిలో మనము 500--600 సం॥ల ముందు కేగినట్లగును. ఇది మార్క్సు చేసిన వాదము.

సమాజవాద సిద్ధాంతము ప్రకారము ప్రతి యొకనికిని అతని కవసరమయినంత లభించును. అతని శక్త్యనుసారము పనిచేయవచ్చును. ఈ సిద్ధాంతము వినుటకు బాగుగనే యున్నది. కాని ఇది ఆర్థిక శాస్త్రమని చెప్పుటకు వీలులేదు. ఆర్థిక శాస్త్రమనగా ననేక విషయములుండును. ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన సర్వనియమముల సూత్రీకరణ యుండవలయును. సమాజమున ఉత్పత్తి జరుగుటెట్లు? ఉత్పత్తి చేయించువారెవరు? దానిని నియమించు వారెవరు? ఉత్పత్తి అయిన దానిని వినిమయము చేయుట ఎట్లు? వితరణ యెవరు చేయుదురు? దానికి నియమము లెట్లుండ వలయును? వినిమయ ప్రణాళిక లెట్లుండ వలయును? ఉత్పత్తిదారులు, వినిమయదారులు వీరి పరస్పర సంబంధము లెట్లుండును? ఈ సంబంధ

ములను నియమించు వారెవరు? పర్యవేక్షించు వారెవరు? ఇట్టి సంపూర్ణమయిన సమగ్రమయిన రూపకల్పన మార్క్సు చేయలేదు. ఇట్లని మనము చెప్పుటకాదు. ఆయన శిష్యుడయిన లెనిన్ చెప్పెను. 'దాస్ కేపిటల్' అన్న గ్రంథమంతటిలో ధనికవర్గము విరోధవికాస సిద్ధాంతాను సారమెట్లు నశించునన్న విషయమును గురించి తప్ప దాని తర్వాత రాబోవు శ్రామికుల శ్రేయోరాజ్యమని యూహింపబడిన సమాజము యొక్క ఆర్థిక నిర్మాణమునుగూర్చి ఒక అక్షరమయినను వ్రాయలేదు. ఇది బహు విచిత్రమయిన విషయము. మరి మార్క్సు వాదమంతయు కూడు గుడ్డ—వీని నాధారము చేసికొనియేకదా బయలుదేరినది!

మార్క్సు వాదమును కవితావస్తువుగా స్వీకరించిన ఈవిప్లవ రచయితలకు వారూహించెడి సమసమాజమును గురించియున్న కల్పనలేమో మరి మనకు తెలియదు. మార్క్సువలెనే వారును ఇప్పుడున్న వ్యవస్థలను బ్రద్దలు కొట్టవలయును, రక్తవిప్లవము రావలయును, శ్రామికుల బంధనములు తెగిపడవలయును, సమసమాజ నిర్మాణము జరుగవలయును — అని ఊరక వంతపాట పాడుటయేగాని వారూహించిన శ్రేయోరాజ్య వర్ణనము కించిత్తేనను చేయరాదా? ఆ స్థితిని వర్ణించుటకు వారివద్ద వస్తువులేదు. ఉన్నదంతయు నొకటే. అది వైషమ్యము, ద్వేషము, ఈర్ష్యా క్రోధము, ఈర్ష్యాక్రోధములను పెంచుకొన్న కలుషిత హృదయముల యావేశముతో వీరు భూతలస్వర్గము నిర్మింతురని మనమాశింపవలయును! సమదర్శనముతో భావనచేసి ఋషివాక్కుల నందింపవలసినవాడు కవి యని విశ్వసించెడి బుద్ధిమంతుల కందరకిది నిజముగా ఒక సవాలు. ఈనాడు సాహిత్యలోకమంతయు నెదురు తిరిగి ప్రశ్నింపవలసిన సందర్భమిది. తమ ధ్యేయ మేమో వివరింపమని మనము వారిని అడుగవలయును. దానిని వర్ణింపరాదా యని వేడవలయును. వారట్టి కార్యములు వ్రాయగల్గినచో కృతార్థులగుదురు. చరితార్థులగుదురు. లేనిచో పెడదారి త్రొక్కుదురు. ప్రతిక్రియామతులగుదురు. అది శ్రేయోదాయకము కాదు. ఉభయత్ర నష్టదాయకము—

'లండన్‌లో ఒక కళాప్రదర్శన'



'బొకియోనీ చిత్రించిన ఒక ఊహాచిత్రం' (1911)

[బ్రిటన్‌లో గత 60 ఏళ్ల కాలంలో కనీ వినీ ఎరుగనంత పెద్ద ఎత్తున కళా ప్రదర్శన ఒకటి జరుగుతూంది. ఇది 'రాయల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్'లో ఏర్పాటయింది. దీనిని చూడ్డానికి వేలాది ప్రజలు వస్తున్నారు. ఇటలీకి చెందిన భవిష్యత్సందర్శకులైనవారి చిత్ర కళోద్యమానికి చెందిన చిత్రాలూ, పత్రాలూ ఇందులో ప్రదర్శింపబడుతున్నాయి.

ఈ ప్రదర్శనా ప్రాశస్త్యం ఫోరం వరల్డ్ ఫీచర్స్ విలేఖరి శ్రీ గెర్ట్రూడ్ ఐక్‌మన్ ఈ వ్యాసంలో చర్చిస్తున్నారు.]

భవిష్యద్దర్శనోద్యమం ఏదో నిన్న ప్రారంభమైన లేక రేపు ప్రారంభం కానున్న 'కళోద్యమం' అనిపిస్తుంది. కాలంతో మారుతూ, భవిష్యత్తుకై ఎదురుచూస్తూ ఉంటుంది గనుక కళ అంతా ముందు చూపుతో కూడినదే అనవచ్చు. కానీ 'ముందుచూపుతో కూడిన కళోద్యమం' అన్న పేర ఈ ఉద్యమం 60 ఏళ్ల క్రితమే ప్రారంభమైంది.

ఇది ఇటలీలో ప్రారంభమైంది. అక్కడ దీన్ని 'ఫ్యూచరిస్మో' అంటారు. కేవలం కళోద్యమంగా ఇది ప్రారంభం కాలేదు. ఒక సూత్రంగా, కొన్ని సూత్రాల సముదాయంగా డ్రాయింగు బల్లమీద రూపురేఖలు దిద్దుకో నారంభించింది. ఇది సమాజంలోని అన్ని భావాలకు, అభిరుచులకూ సంబంధించింది. తైల వర్ణ చిత్రణ, శిల్పవిన్యాసం, సాహిత్యం, నాటక

రంగం, రకరకాల నిర్మాణాలు, సంగీతం, రాజకీయాలు— ఇవన్నీ, మరింకెన్నో అవినాభావ సంబంధమైనట్టివి; ఇవన్నీ విప్లవాత్మకమైన అభిప్రాయాలతో కూడిన భావాల నివేదికల ఆధారంగా చిత్రింప బడినాయి. ఆ నివేదికలు వెలువడ్డప్పుడు వాటిని ఎవ్వరూ పట్టించుకో లేదు.

రద్దు చేయవలసినవీ, విమర్శించవలసినవీ, తిరస్కరించ వలసినవీ మూఢ విశ్వాసమూ, ఒకవిధమైన పిచ్చిప్రేమ. శక్తి, నూతన నిర్మాణ కౌశలం, పట్టుదల, మార్పులను మనం పట్టుదలతో—ఆరాధించాలి!

ఈ ఇటలీ ముందుచూపు ఉద్యమం కొన సాగించిన కృషి ఫలితాలు చూడచక్కని, నిండైన, ఆకర్షణీయమైన వాటిని కొన్నింటిని లండన్‌లో అనేక తరహాల ప్రేక్షకులు ప్రథమ పర్యాయం చూచే అవకాశం కలిగించబడింది.

సాంప్రదాయిక విరుద్ధంగా ప్రారంభమైన ఈ ఉద్యమాన్ని రాయల్ అకాడమీ గాలరీలలోనే ఉన్నతంగా ప్రదర్శింపబడటం — వింతేమీకాదు. (పురావస్తు ప్రదర్శనశాలలు, గ్రంథాలయాలు, అన్నిరకాల అకాడమీలను ధ్వంసం చేయకోరుతున్నాం'— అన్నది ఈ ఉద్యమ లక్ష్యం.) చరిత్ర ప్రసిద్ధమైన ఈ అకాడమీ భవనం సాంప్రదాయిక కళాఖండాలకు ప్రసిద్ధిగాంచింది. అటువంటిదానిలో 'వెన్నెలను హత మార్చండి' అన్న నినాదం కర్ణకఠోరంగా ప్రతిధ్వనించడం ఇప్పుడు జరిగింది.

ఇంగ్లండు ఉత్తరభాగంలో న్యూకేసిల్ — అపాన్—టైనీ అనేచోట 'ఉత్తరదేశ కళల'' స్కాటిష్ కళల'— సంయుక్త ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా ఈ కళాఖండ ప్రదర్శన ఏర్పాటుచేసినప్పుడు రెండువారాలలో పదివేలమంది ప్రేక్షకులు వాటిని వచ్చి దర్శించడం జరిగింది. ఆనాడు లండన్‌లో ఈ ప్రదర్శన చేయాలన్న ఆలోచనే లేదు. అంత ఎక్కువ సంఖ్యలో ప్రేక్షకులను ఆకర్షించి, లండన్‌నుంచి పై ప్రాంతాలకు వెళ్లివచ్చిన విమర్శకుల మన్ననలందడంతో— లండన్ అకాడమీ అభిప్రాయాలు అతి వేగంగా మారిపోయాయి.

మోటారుకారు ఆరాధన

సాంకేతికాభివృద్ధిని ముందు కాలంలో, ప్రథమ ప్రపంచ సంగ్రామానికి పూర్వం వచ్చిన విప్లవంలో, పాశ్చాత్య ప్రపంచంలో చాలా భాగం లాగానే, 'ఫ్యూచరిస్టులు' తమ భావాలు ఎంత దూరం ప్రయాణం చేస్తాయో, అని ఎంత తీవ్రరూపం దాలుస్తాయో అంతగా ఊహించి ఉండరు.

ఆత్మాభివృద్ధికై ప్రారంభమైన ఈ ఉద్యమ స్థాపకుడు ఫిలిప్పోటామాసోమారినెట్టి సంపన్నుడు, గొప్ప కవి. ఈయన తన చుట్టూ కొందరు యువ చిత్రకారులను చేర్చి వారిలో యంత్రము, దాని వేగము, సౌందర్యాల ఆరాధనను ప్రకోపింప చేశాడు. 'గులకరాళ్లపై కటకట శబ్దం చేస్తూ పోయే మోటారు కారు, 'సమోత్రాస్ విజయం' (దీనికే 'గాలిలో లారీ విజయం' అన్న ప్రసిద్ధి వచ్చింది.) కన్నా అందమైనది'—అని వారి తొలి నివేదిక పేర్కొన్నది.

రణగణధ్వని నాటి (1909) మోటారు కారును ఆరాధించడంతో వారు ఆగలేదు. అంతకు మించే వారి ఆలోచనలు సాగాయి. వారు 'సంఘర్షణ'ను కొనియాడారు. ప్రపంచాన్ని ఆవైపు నడిపించాలని ఊహ చేశారు. 'సంఘర్షణ'లోనే ఉంది 'సౌందర్యం' అని భావించారు. యుద్ధం ఆరోగ్యకరమైన ఒకశక్తి : 'యుద్ధాన్ని' కీర్తిద్దాం అని నినాదం చేశారు. 'ది కానోసుర్' అనే పత్రికలో వ్రాస్తూ 'వారు యుద్ధంతో ప్రేమ చేయ' నారంభించారు.

ఈ శతాబ్దంలో వారేమైనా కావచ్చుగాని, కాలానికి తగినవారుగా వారిని ఎవరూ భావించలేదు. వారిలో కొందరు యువకులు, తర్వాత కొద్దికాలానికే వచ్చిన యుద్ధంలో వారు పాల్గొన్నారు. 1916 అంతానికి వారిలో చాలామంది మరణించారు. అట్టి వారిలో 'చిత్రకారుడు—శిల్పి' అయిన ఉంబర్టో

బొకియానో, గొప్ప శిల్పి ఆంటోనియో సంత్ ఎలియాలు పేర్కొదగ్గవారు. లూ యిగే రుస్సోలోకి తలపై గాయం తగిలింది. 'గట్టిగా వాదించినవాడే నిజమైన 'మనిషి' అన్న నియట్‌స్కెస్ సిద్ధాంతం—ఈ ఉద్యమనాయకుడు శ్రీ మారినెట్టీకి బాగా తల కెక్కింది'— అని 'అబ్జర్వర్ రివ్యూ'లో నిగేల్ గాస్‌లింగ్ వర్ణించాడు. ఇది 'మానవాతీతుని' ఆరాధనకు దారితీసి, ఆయనను ఫాసిజం వైపు నడిపించింది. తరువాత ఈయన ముస్సోలినీతో చేతులు కలిపాడు.

ఒకప్పుడు 'అరాచక విప్లవ' కళాకారులుగా, వారి నినాదాలతో ప్రకటనలతో విప్లవాలు తెచ్చి పెట్టేవారుగా విమర్శింపబడ్డవారు నేడు గొప్ప 'గౌరవ పాత్రులు'గా పేర్కొనబడుతున్నారు.

లండన్‌లో ప్రదర్శింపబడ్డ వీరి కళాఖండాలు, నివేదికలు చూచిన వారికి ఇది చాలా శక్తివంతమైన ఉద్యమమని తోచక మానదు. వారి చిత్రాలు, కళాఖండాలు 'కదలికలోని శక్తిని' చక్కగా చిత్రించాయి. ఏదో నాటక ఫక్కీలో, కవితా లోకంలో, సాంకేతిక శాస్త్ర విజ్ఞానంతో, మానవతా విషయాలతో, రకరకాల భయంకర శబ్దాలతో ఎంతో కృషి సల్పారు. వారు భవిష్యత్తును గూర్చి కలలు కన్నారు. అదే మన వర్తమానం వారి నాటి భావాలను నేడు మనం అనేక విధాల అభివృద్ధి చేసి ఉపయోగించుకుంటున్నాం!

'కళలో శాశ్వతత్వం దర్శించగోరడం అవమానకరం, మనం 40ఏళ్ల వారమయేటప్పటికి — మనకంటే యువకులు, యోధులైనవారు మనను పనికి మాలిన చెత్తక్రింద జమకట్టనివ్వండి. అదే మనం కోరేది' అన్నాడు మారెనెట్టీ.

ఇదంతా సాంకేతిక శాస్త్రంలో చాలా ముందుకు పోయినకాలం. తుడిచివేయని హింస, అంతర్జాతీయ ఘర్షణ, ఊపిరాడక ప్రాణంతీసేంత ఎత్తైన భవనాలు, వాటితోకూడిన నగరాలు, బజార్లలో భరించలేనంతగా విపరీతమైన యంత్రాలరొద—ఇవన్నీ ఎన్నో లెక్కకు మించిపోయాయి యిప్పుడు. నేటి ప్రపంచాన్ని, నాటి ఫ్యూచరిస్టులు ఊహించారా?

(ఫోరం వర్ల్డ్ ఫీచర్స్)



కలగూరగంప

కీ. శే. బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి

తెలంగాణాలో వెలసిన సాహిత్యవేత్తలలో ప్రఖ్యాతుడు శ్రీ బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి. వీరి జననం 1918 మాఘ పూర్ణిమనాడు, ఖమ్మంజిల్లా వేంసూరులో. ఈయన రచనలలోనేగాక రాజకీయాలలో కూడా పాల్గొని ఖ్యాతి గడించడం ఒక విశేషం.

శ్రీ శాస్త్రిగారు తెలంగాణా స్వాతంత్ర్యోద్యమములోనూ, రాష్ట్ర కాంగ్రెసులోను గ్రంథాలయోద్యమంలోనూ, ఆంధ్ర మహాసభలలోనూ పాల్గొని ప్రధాన భూమిక నిర్వహించారు.

రాజకీయ జీవితంతోబాటు సాహిత్యం వ్యాసంగమును చేపట్టిన దిట్ట శ్రీ బెల్లం కొండ. 1930 నుండీ భారతిలో రచనలు సాగిస్తూ వచ్చారు.

వీరువ్రాసిన 'ఋతుపవన' కావ్యానికి 1973 వ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది.

నమోవాకం, కృష్ణవేణీ, తరంగిణి—వారి ఇతరకావ్యాలు.

ప్రతీకారం, పంచకల్యాణి--వీరిచే రచితమైన నాటక రాజములు.

కథాకళి, సశేషం—వీరి కథానికా సంకలనాలు.

శృగారం—పోతన: వీరి విమర్శన వ్యాసములు.

19 వ శతాబ్ది ఆంధ్ర వాఙ్మయ చరిత్రను చిత్రించే గ్రంథరాజం నవోదయం:

ఇవేగాక 'చిరుగంటలు' (బాలగేయాలు) 'ఉర్దూ కథానికలు' 'దశకుమారచరిత్ర' మొదలైనవి పేర్కొనదగినవి. ఇంకా అనేక పత్రికలలో వ్రాసి ఖ్యాతి గడించిన సాహితీ బంధువు శ్రీ బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రిగారు — (19–12–73 నాడు) సాయుజ్యం చెందినారు. ఆయన సాహితీలోకంలో చిరంజీవి. అట్టి ధన్యజీవి కివే మా నివాళులు! ఓం తత్సత్.

స్వర్గీయ రామదాసయ్యంగార్

విక్రమసింహపురి (నెల్లూరు) తెలుగు కవితారసాల వాటికకు పట్టుగొమ్మ. అంతేగాదు, తిక్కయజ్వ పదమంటి అపరంజినేల అది. అచట వెలసిన విద్వన్మణి శ్రీమాన్ నేలటూరు రామదాసయ్యంగార్. ఆయన అధ్యాపకుడు, పండితుడు, విమర్శకుడు. చతురవచనా ధురీణుడు, రసలుబ్ధుడు.

ఈయన జననం 8–2–1891 వికృతినామ సంవత్సర పుష్య బహుళ అమావాస్య. చరిత్ర, సంస్కృతములలో ఎం. ఏ. భట్టభద్రులు. ఉపాధ్యాయ శిక్షణకూడా పొందారు. స్కూళ్లపై ఇన్‌స్పెక్టరుగా కొంతకాలం పనిచేసి, ఆపని తమకు గిట్టకపోవుటచే— నెల్లూరులోని వెంకటగిరి రాజాగారి కళాశాలలో అధ్యాపకవృత్తి చేపట్టారు శ్రీ రామదాసుగారు.

వీరి సాహిత్యగురువులు వేదము వేంకటరాయ శాస్త్రిగారు. శ్రీ శాస్త్రిగారి శిష్యులలో రామదాసయ్యంగార్ అగ్రగణ్యుడు. గురువుగారివద్ద గ్రహించిన విద్యనంతా శిష్యులకు పంచుటయేగాక, కొరకుపడని సంస్కృతములోని కొన్ని నాటకములకు ఉత్కృష్టమైన వ్యాఖ్యానములు చేసినారు.

'తెలుగుం జుట్టిన తెగులు' వీరి తొలి వ్యాసములలో ఒకటి.

'భారతి'లో మేఘ సందేశాన్ని గూర్చి వ్యాస రాజముల వ్రాసి లబ్ధప్రతిష్ఠితుడైనాడు శ్రీ రామదాసయ్యంగార్.

వీరి కాళిదాసు 'శాకుంతల' వ్యాఖ్య వేదమువారు ప్రకటించారు.

భవభూతి 'ఉత్తరరామ చరితము', విశాఖ దత్తుని 'ముద్రారాక్షసము'ల వ్యాఖ్యానములను ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీవారు ప్రకటించారు. ఈ వ్యాఖ్యానాలు వీరి ప్రతిభా పాండిత్య ప్రకర్షకు నికషోపలాలు.

వ్యాఖ్యాతయే గాక, గొప్ప నటుడు కూడా ఈయన. వేదమువారు స్థాపించిన ఆంధ్ర భాషాభిమాని సమాజంలో చేరి—ప్రధాన పాత్రలను ధరిస్తుండేవారు, శాకుంతలంలో కణ్వుడు, బొబ్బిలి యుద్ధంలో విజయ రామరాజు, బుస్సీదొర, ప్రతాపరుద్రీయంలో చెకుముకి శాస్త్రి, వలీఖాన్, సుల్తాన్ మొదలైన పాత్రలను ధరించి ప్రేక్షకుల మెప్పుబడసినవాడు శ్రీ రామదాసయ్యంగార్.

నెల్లూరు పత్రికలలో రసలుబ్ధుడనే పేరుతో—ఆనాడు ప్రదర్శింపబడే నాటకాలపై చక్కని చిక్కని నిర్దుష్టమైన సమీక్షలు వ్రాస్తుండేవారు శ్రీ రామదాసయ్యంగార్. ఈయన విమర్శనా ధాటిని మెచ్చుకున్న నటకాగ్రణి - శ్రీ స్థానం నరసింహారావుగారు.

శ్రీ రామదాసయ్యంగార్ శ్రీ విక్రాల రామచంద్రాచార్యులవారితో శాస్త్రచర్చకు దిగి — తన వాదోపవాద నైపుణిని చాటి గెలిచినదిట్ట.

అనర్ఘరత్నమైన రామదాసయ్యంగార్ తే 3–1–74 దిన దివంగతులైనారు. అయ్యంగార్ పాండిత్యంలోనూ, పరిశోధనలోనూ, రసజ్ఞతలోనూ, వయస్సులోనూ బాగా పండినవారు. వారి సారస్వతసేవ విశ్వతోముఖమైనది. వారు మెట్టిన ప్రతిచోటూ సరస్వతీధామమే. ఆంధ్రసాహిత్యచరిత్రలో వారు చిరంజీవులు.

రెండుమూడు నెలలక్రితం శ్రీ నేలటూరు రామదాసయ్యంగార్ 'భారతి'లో ప్రచురణార్థము — 'అపటిక్షేపాది వివరణము' అనే వ్యాసం పంపారు. కారణాంతరాలవల్ల దాన్ని వెంటనే ప్రచురింపలేకపోయాము. కానీ ఆయన తన వ్యాసరాజము ముద్రిత రూపంతో చూడలేకపోయారు. అది విచారకరం. వేరొకచోట ఈ సంచికలో వీరి వ్యాసాన్ని చూడవచ్చు.

ఇట్టి శ్రీ రామదాసయ్యంగారికి— స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

—వే. రా.

'చరిత్ర—చరిత్ర విమర్శన'

అక్టోబరు 1973 భారతిలో గ్రంథవిమర్శనయందు 'ఓరుగంటి చరిత్రము' అనునది శ్రీ నిడుదవోలు వేంకటరావుగారిచేత సమీక్ష చేయబడినది. ఈ సమీక్ష పెక్కు అసందర్భములతో గూడి అనుచితముగా నుండుటేగాక అటు చారిత్రక వస్తువుకు, ఇటు రచయితకు ఆ పైన 'భారతి' వంటి పత్రికకుగూడా అవజ్ఞ తెచ్చుచున్నది. దీనిని తొలగించుట అవసరమని భావింతును.

ఈ విషయమునకు ముందు భారతిలో గ్రంథ విమర్శనమునకు ఎంపికచేయబడు సమీక్షాకర్తల స్వరూపముపైగాని, సమీక్ష గావింపబడు అంశముపైగాని సాధారణముగా పాటింపవలసిన ఏ కొద్ది ప్రమాణములు గూడా పాటింపబడక ఇటీవల కొంత అశ్రద్ధకు లోనైనట్లు తోచుచున్నది. దానికి ఈక్రింది విషయములు ఉదాహరణ కాగలవు. సత్యాసత్య నిరూపణము మీావల్ల కాతగినది.

సౌకర్యమునకై—సమీక్షకుల విమర్శ రెండంశములపై భాగింపవచ్చును. ఒకటి ఓరుగంటి చరిత్రమనుపేరు అందలి విషయమునకు సంబంధించి లేదనునది. అట్లు జరుగుటకై భారతిలోవారు సుమారు మూడుపుటల ఉదాహరణముల నిచ్చి, కొన్ని ప్రశ్నలు వైచి నిర్వచనము గావించిరి. జిజ్ఞాసువు లందరు దానిరీతి దెలుసుకొని జాగ్రత్తపడవలసి యున్నది.

(1) ఓరుగంటి చరిత్రమను పేరు—అందలి విషయము:—సమీక్షకులు మొదట ఈ చరిత్రకు సూచింపబడిన కాలమును (1320–1370) అసలు గమనింపనే లేదు. స్వయముగా అట్టి ప్రమాదమునకు లోనై వారు ఆ కాలమునకు ముందును, దాని వెంట రెండు శతాబ్దముల కావలనున్న విషయములను అనగా 16 వ, శతాబ్దములోని సంగతులు ఏవీ లేవని నిరసించిరి.

ఓరుగంటి చరిత్ర—కాకతీయులు పడిపోయిన వెంట తురుష్కులనుండి ఆ నగరమును స్వాధీనమును గావించుకొన్న విధానము, దానితోపాటు మొత్తము తెలుగుజాతి స్వాతంత్ర్యమునకై అదే కాలమున తదితర నాయకులు గావించిన పోరాటములు అందుగైకొన్న చారిత్రక వస్తువు.

ఆ పరిమితిలో/ఆ నగర పుట్టుపూర్వోత్తరములకుగాని, దాని పేరును గురించిన అసందర్భములకుగాని, ఆ పైన 16 వ శతాబ్దములోనున్న కవి చారిత్రకులకుగాని దానిలో స్థానము గలుగదని విజ్ఞులు గుర్తింపలేనిది కాదు.

(2) ఓరుగంటి పేరు చెప్పగనే ఒక మహా చరిత్ర, ఒక మహావైభవము గుర్తుకు వచ్చునని సమీక్షకులే తమ ఉపోద్ఘాతమున తెలిపిరి. కాని ఆ పేరు విన్నంతనే వారికి 'ఏకశిలా నగరము' దప్ప, అందలి పురవర్ణనము దప్ప, ఏనాటి కవులో దప్ప సమీక్షాగ్రంథకాలము, అందలి అంశము ఎదుటనున్నను పరిగణించని నిర్ణయము వారిది. ఈ విధానమునకు మనము విచారించుట దప్ప చేయదగినదేమున్నది?

పోనీ పేరుకు—అందలి చరిత్రకు సంబంధము లేదని తీర్మానించినపుడు అట్టి దానితో సమీక్ష ముగింపవచ్చును గదా? మరికొన్ని అసందర్భములతో దానిని నింపుట ఎందులకు? దానివల్ల విమర్శకుడిలో గల చారిత్రకజ్ఞానము, అందలి పటిమ తెలిసి నవ్వుల పాలు గాజాలదా!

(3) సంస్కృత శాసనములలో 'ఏకశిలా నగరము' దప్ప ఓరుగల్లు అను పేరుండనే వుండదట! ఆ మాట అటుంచి తెలుగు సాహిత్యమున ఓరుగల్లు ప్రస్తావన ఏమున్నవో—లేదట! ఇవి వారి కొన్ని ఆరోపణలు.

క్రీడాభిరామము, ఒంటిమిట్ట వాదనలు మనకు వద్దు. దీనికి సంబంధించినవి కావు. ఇక 'ఏకశిలా నగరము' దప్ప సంస్కృత శాసనములలో ఓరుగల్లు పేరు । లేదన్నదానికి ఈ క్రింది శాసనములు పరికింపుడు.

(1) 'తస్యాసీ ద్రాజధానీ సురపుర- జయినీ రుద్రదేవానీ సన్యోరంగల్ చారు విద్యాస్ఫురిత గురు శతానేక నాగాశ్వ పూర్ణాయాత్రా మిత్రావనీ భృత్పుర వర సమితి.'

(కుందవరశాసనము, కాకతీయ సంచిక. అను. 14.)

(2) ఓరుగల్లు ప(ఫ)రే యశ్చ్రీమద్రుద్ర చమూపతిః । రుద్రేశ్వరస్య దేవస్య ప్రతిష్ఠా మకరోత్కృతీ ।

(పాలంపేట శాసనము (1213. A. D.) కాకతీయ సంచిక అను. 18.)

ఇంతకు సమీక్షకులు కాకతీయుల అనంతరము ఎప్పుడో 16 వ, శతాబ్దంలో వచ్చిన చిత్తాపుఖాను శాసనము లంకించుకొని ఏదో భావనజేశారు కాని—వాస్తవంగా కాకతీయులనాటి లేదా వారి శాసనాల్లో ఏముందని చూచారా? చూస్తే కాకతీయులకు 'ఏకశిలానగర' శబ్దంపై లేని పోని భ్రమ కలుగనట్లు వారికి తోచియుండదా—ఇది ఎవరి లోపమో తెలియదు.

(4) విమర్శ గాబడవలసిన చరిత్ర వస్తువు, దాని చిత్రణ గురించి వారు ముట్టుకొనకనే, లక్ష్యము చవి చూడకనే, ఒక లక్ష్యము లేకనే కాకతీయుల తరువాత ఓరుగంటిని పరిపాలించిన వారందరిని గురించి ఎందుకు వ్రాయలేదు? ఇది ఒక ప్రశ్న. ప్రోలయ వేమ, హరిహరరాయ, సోమరాజాదులకు దీనితో సంబంధములేదని ఇంకొక ప్రశ్న. సమకాలీన నాయకుల వంశవృక్ష, కాలపట్టిక, బిరుదావళి గద్యముల అవుసరములేదని ఇంకొక ప్రశ్న — ఇట్టి అవక తవక ప్రశ్నలు - వారి ఉదాహరణలు మరికొన్ని అక్కడ వున్నవి. ఇప్పటికే ఈ గ్రంథముపై పత్రికలలో సమీక్షలు కొన్ని వచ్చినవి. ఇంతకు ముందు వాటిపై మరికొన్ని వున్నవి. చరిత్రకారులు, శాస్త్రము నెరింగిన వారును, జిజ్ఞాసువులు వ్రాసిన లేఖలు పెక్కు వున్నవి. కాని వీరిలో ఏ ఒక్కరు గాని ఇట్టి ప్రశ్నలు వేయకపోవుట, అసందర్భములకు తావు దీనిలో లేకపోవుట ఆశ్చర్యముగా నుండదా! జ్ఞానిని సమీక్షకులు దానిని మించిపోయిరి.

గ్రంథకర్త లోపములున్నయెడల, లేదా వస్తు లోపము—లేదా శైలిలో ఏదైనా సద్విమర్శ ఆహ్వానించ

దగినదే—కాని సమీక్షకుడి అవగాహనమే ప్రత్యేకముగా లోపించినపుడు, అది గ్రంథకర్త నిర్మాణ లోపముగా మార్చుట దురాగతమని చెప్పవలసి వచ్చుచున్నది. ఓరుగంటి చరిత్రమును ఒక దేశ చరిత్రగా భావించిన వారు, ఓరుగంటి పేరుకు, ఒక పరిమితిలో ఆ పేరుతో సాగిన చరిత్ర కథనమునకు వున్న సంబంధము అవగాహనజేసుకొనలేక, నగర చరిత్ర వర్ణన దీనిలో లేదు గనుక దేశ చరిత్ర దీనికి సంబంధములేదని వ్రాయు విమర్శనమును స్వీకరించుటెట్లు ?

పోనీ అట్లు భావించి ముగించినా బాగుండెడిది. అట్లు గాక ఇందులో పొసగని చిత్తాపుఖానుడు, కొఱవి గోపరాజు, చరిగొండ ధర్మన, ఒంటిమిట్ట వాదన, క్రీడాభిరామాదులు చేర్చిన—వారు భావించిన చరిత్ర అప్పుడు ఎట్టి రూపము ధరించునో వేరుగా చెప్పవలయునా !

(5) మొత్తముపై ఓరుగల్లును గురించి ప్రత్యేకముగా దీనిలో నేమియు లేదనిరి. అది నిజము. ఉండదు. కాని ప్రోలయ వేమాదుల పోరాట భాగస్వాముల గురించి సమీక్షకులు వ్రాసి నట్లు ఒక్క వాక్యములో వ్రాయదగిన చరిత్ర అనుట పూర్తిగా అసంబద్ధము—చరిత్ర నిర్మాణమునకు, చిత్రణకు అవి వారి నిర్వచనమైన మిక్కిలి విచారింప వలసినదే.

(6) గంథకర్తనైనను నాకు తిరిగిదానిలో ఒకలోపము కనిపించినది. అది 'నృసింహకవి' చరిత్ర అందులో చేర్చుట. ఇదేగాక చిత్రమేమన క్రీ. శ. 1370 తో ముగిసిపోయిన మడికి సింగనచరిత్ర సహితము వారు ఎత్తుకొననేలేదు. కారణము వారి కాలనిర్ణయ వాదనను చారిత్రకముగా కొట్టి పారవేయు చున్నదదియే.

మొత్తముపై నాకు అన్నిటికన్నా విచారము కలిగించినది సమీక్షాకర్తల విర్ణయములో భారతి వహించిన అశ్రద్ధయేగాని సమీక్షా విషయముకాదు. దానిలోని అసందర్భములు, అనుచితములన్నియు పాఠకులు ఊహింపగలిగినవే. ఈ సమాధానమైనను భారతి వంటి చరిత్రనుత్సాహించుకున్న పత్రిక గనుక దానికివి అవజ్ఞ కలుగకూడదని వ్రాసినదే.

ఏమైనా చరిత్ర గ్రంథవిమర్శనము—అందుకు దూరముగా పయనించువారి చేతికి అందించిన ఒన గూడు ఫలితమేమో భారతి ఆలోచింపవలసి యున్నది. అది లేనిచో నేలవిడచి సాముచేయుటే కాగలదు.

—శ్రీ తేరాల సత్యనారాయణశర్మ.

అనేకార్థద్యోతకం—మాట

ఏ౦౦౦రు నవంబరు నెల భారతిలో ప్రచురించిన 'కల గూరగంప'లోని 'అనే కార్థద్యోతకం—మాట' అన్న శీర్షికతో శ్రీ ద్వా. నా. శాస్త్రిగారు సోదాహరణముగా వ్రాసిన వ్యాసం చదివి చాలా ఆనందించాను. అది చదివాక, నాకును కొన్ని అట్టి వాడుక భాషలోని ప్రయోగములు కనిపించుటచే వానినొక చిన్నవ్యాసముగా పొందుపరచి, విజ్ఞులయిన మిమ్ములను, మీ పత్రికలో దయతో ప్రచురింవవలసినదిగా కోరుతూ మీకు పంపిస్తున్నాను.

తెలుగు	ఆంగ్లము
1) మాటంటే మాటే	Word means commitment.
2) వాడి మాటల కేంలే	Don't take his view (in to consideration.)
3) అంత మాట అనకు	Don't go to such an extent
4) మాట అనగానే అయిపోలేదు. (మాట అనగానే సరిపోయిందా?)	It's not completed by simply giving a word.
5) ఎందుకొచ్చిన మాట లివి	Why should you say so-much.
6) వాడు మాట పట్టింపు మనిషి	He is a man who goes by his word.
7) ఇప్పుడా మాటే ఎత్తడు	He does not raise the topic now.
8) ఆదే మున్న మాట	What is there
9) ఇంక మాటలు అనవసరం	No further explanation is needed.
10) మాట తోచనివ్వడు	He will not let us think ... ut it

11) నలుగురిలో మాట లాడటం చేతకావాలి — one should learn how to move with people.

12) ఓ (ఒక) మాటంటే నీ సొమ్మేం పోయింది — What you loose after all with a word.

13) మాటా—మంతీ.

— శ్రీ మామిడన్న సత్యనారాయణమూర్తి.

కృ త జ్ఞు ణ్ని

భారతి 1973 డిసెంబరునెల సంచిక కలగూర గంప శీర్షికలో మిత్రులు శ్రీ టి. పి. భాష్య కారా చార్యులుగారు వ్రాసినది చూచినాను. నా పొరపాటును వారు చూపి, నన్ను కర్తవ్య పరాయణుణ్ని చేసినారు. నా కృతజ్ఞత తెలుపు కొంటున్నాను.

బడి ప్రయోగాల విషయంలో నేను అన్ని కోశాలు చూచినాను. దాని వెంటనే కవ్వడికూడ చూచి నాను. కవ్వడికి మూసలోపోసినట్లు ఒకే వ్యుత్పత్తి ఉంది. సరైన వ్యుత్పత్తి ఇవ్వలేదనే అసంతృప్త్యా వేశాలతోను, తెలంగాణా పల్లెటూరి పలుకుబడిలో బడి నేటికీ జీవించివుండడం చూచి కలిగిన ఆనం దోత్సాహాలతోను పొరపాటు చేశాను. జిజ్ఞాసువుకు ఆవేశం తగదు కదా. ఆవేశంలో సత్యం మరుగు కారాదుకదా! ఈ పొరపాటును మిత్రులు చూపి నందుకు కృతజ్ఞుణ్ని. కాని, అంతగా పరిశ్రమించిన సూర్యారాయాంధ్ర నిఘంటువులో సాంబోపాఖ్యానం లోని ప్రయోగం కనిపించలేదు, బడికి.

ఇంతకూ నా వ్యాసంలో ప్రధానాంశం కవ్వడి శబ్ద విచారం. నాతప్పును ఎత్తి చూపడంతోపాటు దాని బాగోగులు చర్చించిఉంటే మిత్రులకు మరింత కృతజ్ఞుణ్నయి వుండేవాణ్ని. నేను నిరంతర జిజ్ఞాసువును. ఎవరిమంచి ఏ కొంత తెలుసుకొన్నా ఆనందంతో ధన్య వాదాలు అర్పించే ప్రవృత్తినాది. శ్రీమతి డాక్టర్ యశోదారెడ్డిగారి విషయంలో ఎంత కృతజ్ఞుణ్నో, నాకు నాలుగు దశాబ్దాలకింద హోటలులో ఇడ్లీపిండి రుబ్బుతం నేర్పిన పాలఘాటు రామయ్యరు కూడా అంతే కృతజ్ఞుణ్ని. నిజమైన దురదృష్టం ఏమిటంటే, కవ్వడిలో నా పరిశ్రమను మిత్రులు శ్రీ భాష్య కారా చార్యులుగారు గుర్తించక పోవడం.

—శ్రీ తిరుమల రామచంద్ర.

శ్రీనాథుడు—'పొగడదండ'

పై శీర్షికతో శ్రీ మోనా 1973 డిసెంబరు 'భారతి'లో ఒక వ్యాసం ప్రకటించారు. అందులో, కవిసార్వభౌముడైన శ్రీనాథుడు తన చరమావస్థలో ఒడ్డెరాజులు విధించిన శిక్షలను అనుభవిస్తూ చెప్పిన

'కవిరాజు కంఠంబు కౌగిలించెను గదా
పురవీథి నెదురెండ పొగడ దండ.'

అనే సీసపద్యంలోని 'పొగడదండ' శబ్దార్థాన్ని చర్చిం చారు. దీనిని గురించిన చర్చ కొన్ని దశాబ్దాల క్రిందటిదే గాని యిప్పటిది కాదు. పయి పద్యంలోని మిగిలిన మూడు పాదాలలోనూ చెప్పబడిన 'నల్లగుండు, వెదురుగొడియ, నిగళయుగము'లు శరీరానికి బాధను కలిగించే శిక్షా సాధనాలు కావడంవల్ల పొగడదండ కూడా అట్టిదే అయి వుంటుందనీ, పొగడ పువ్వుల దండ అయివుండదనిన్నీ విద్వాంసులు అభిప్రాయ పడ్డారు. 'పొగడదండకు'కు మరొక అర్థం కానరానందున అది అపపాఠమై వుండుననీ 'పొరక దండ' అనే పాఠం సరియై ఉండుననీ, దానికి గడ్డి పరకల దండ అనే అర్థమనీ, అది అవమాన సూచక మనీ కీ. శే. వడ్డాది — సుబ్బారాయుడుగారు, కీ. శే. బండారు తమ్మయ్యగారు అభిప్రాయపడ్డారు. కాని పొరకదండ అనే పాఠం అంతవరకూ ఎక్కడా కాన రానందున 'పొగడదండ' అనేదే కవ్యభిప్రేతమైన పాఠ మని పలువురు విద్వాంసుల అభిప్రాయం. అందు వల్లనే కీ. శే. కొత్తపల్లి—సూర్యారావుగారు సూచించిన 'పూలదండ' అనే పాఠం కూడా ఎవ్వరికీ ఆమోద యోగ్యం కాలేదు. ఈ విషయాలను వివరిస్తూ వెంపరాల — సూర్యనారాయణశాస్త్రిగారు, అది పొగడ పూల దండకంటె విలక్షణమైన శిక్షాసాధనమై ఉంటుం దని ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక 25 వ సంపుటం 3 వ సంచికలో ఒక వ్యాసాన్ని ప్రకటించారు.

పయి వ్యాసం ప్రకటించబడిన సంచిక వచ్చిన ఒకటి రెండు రోజులలో దానిని పూజ్యులు కీ.శే.వేటూరి ప్రభాకరశాస్త్రులుగారి యింట చూచుట తటస్థించింది. తర్వాత శ్రీ శాస్త్రులుగారూ, నేనూ కొంత చర్చించడం జరిగింది. 'పురవీథి నెదురెండఁ బొగడ దండ' అనేచోట అర్ధబిందువు లేఖక ప్రమాదంవల్ల వచ్చి వుంటుందనీ 'బొగడదండ' సరియైన పాఠమై వుండవచ్చుననీ నాకు తోచింది. ఉమ్మెత్తకాయ వలె ముండ్లతో కూడివున్న యినుపగుండ్లు బొగడలని ప్రసిద్ధి. పిచ్చెత్తిన ఏనుగులను స్వాధీనం చేసుకొనుటకై వీటిని నేలపై పరిచి, వాటిపైని ఏనుగులను నడిపించడం ఒక పద్ధతియై ఉండేది. గుండ్ల వలె ఉండే చిన్న పువ్వులు పూచే మొక్కలు బొగడ మొక్కలని ప్రసిద్ధి. వాటి రేకులు ముళ్ళవలె సూదిగా ఉంటాయి కూడా. ఇనుపబొగడలనుబట్టి బొగడ పువ్వులకు గాని, బొగడ పువ్వులనుబట్టి యినుప బొగడలకు గాని ఆ పేరు వచ్చి వుండవచ్చు. అట్టి యినుప బొగడలదండ శిక్షా సాధనమై ఉండవచ్చు. దాన్ని మెడలో వేస్తే బాధ కలగడంలో వింత లేదు. ఈ విషయాలు శ్రీ ప్రభాకరశాస్త్రులుగారికి ఎంతో తృప్తిని కలిగించాయి. వెంటవే వ్యాసం వ్రాసి, 'భారతి'కి పంపవలెనని చెప్పారు. అందువల్ల 1936 సం. డిసెంబరు 'భారతి' సంచికలో ఈ 'పొగడదండ' వ్యాసం ప్రకటించడం జరిగింది. ఈ వ్యాసం 1971 లో నేను ప్రకటించిన 'వ్యాస కదంబ'మనే సాహిత్యవ్యాస సంకలనంలో కూడా చేర్చబడింది. అందులో నా అభిప్రాయాన్ని సమర్థించే గ్రంథభాగాలు కూడా చూపబడినవి. మోనాగారు 'భారతి' లోని నా వ్యాసాన్నిగాని, 'వ్యాసకదం' బాన్ని గాని చూచి యుండలేదేమో! ఆయన వ్రాసిన యీ వ్యాసంలో నేనుచూపిన ప్రమాణాలనేకాక యితర ప్రమాణాలన్నూ, మరికొన్ని విషయాలను వివరించారు. వారిచ్చిన ప్రమాణాలు 'పొగడదండ'కు సమన్వయించి నట్లే 'బొగడదండ' కున్నూ అనుకూలాలేకాని ప్రతికూలాలు కావు.

వ్యాసకర్త 'కోలకుక్కరాయి, కోదండా'ల ప్రసక్తినికూడా తెస్తూ చివరికి ''కావున 'పొగడదండ' యనగా 'మెడకు మీగాలికి గుది కట్టుట'యను శిక్ష'' అని తేల్చారు. శిక్షించినప్పుడు ఈ ఒక్క సాధనాన్ని మాత్రం ఉపయోగిస్తే పయిఅర్థం కొంత సబబుగా ఉండవచ్చును. పయిపద్యంలో ఒక్కటి కాదు—నాలుగు శిక్షాసాధనాలు ఉపయోగింపబడినవి. మీదినుంచి క్రిందివరకూ ఒక్కొక్క అవయవానికీ ఒక్కొక్క సాధనం ఉపయోగించబడి ఉన్నది. ఎలాగంటే— కంఠానికి పొ (బొ) గడదండ, భుజానికి నగరివాకిట్లో ఉండే నల్లగుండు, చేతులకు వెదురుగొడియ, కాళ్లకు నిగళయుగమున్నూ ఉంచబడినవి. శ్రీనాథుడు 'కవిరాజు కంఠంబుఁ గౌఁగిలించెనుగదా' అని కంఠాన్ని మాత్రం పేర్కొన్నాడు. మీగాలి సంగతి ఎత్తుకోలేదు. ఆ ఒక్క సాధనాన్నే ఉపయోగించే పక్షంలో ఇతర ప్రబంధాల ప్రయోగాలను బట్టి మెడకూ, మీగాలికి లంకె పెట్టే సాధనం అనుకోవచ్చును గాని, ఎక్కువ సాధానాలు ప్రసక్తము అయినందువల్లనూ, కవిరాజు కంఠోక్తిగా కంఠంలో ఉన్నట్లు మాత్రం తెలుపుట వల్లనూ. ఈ సందర్భంలో 'మెడకు మీగాలికి గుదికట్టడమనే అర్థం గ్రహించడం సముచితంకాదనీ, 'పొగడదండ' అనుటకు బదులు 'బొగడదండ' అని అనుకోవడమే ఉచితమనీ, అట్లనుటలో అనుపపత్తి యేమీలేదనీ మనవి చేస్తున్నాను.

—శ్రీ బులుసు వేంకటరమణయ్య.

సోంఖ్ తవ్వకాలు

బెర్లిన్ మ్యూసియమ్‌లోని భారతీయ కళా విభాగానికి అధిపతిగా ఉంటున్న ప్రొఫెసర్ కె. హార్టెల్ ఇటీవలే మధుర (ఉత్తరప్రదేశ్)కి దగ్గిరే ఉన్న సోంఖ్ వద్ద కొన్ని తవ్వకాలు జరిపారు. వాటివలన జనవాసం కల 32 'స్తరా'లు బయటపడ్డాయి; మొత్తం స్తరాల సంఖ్య 37. ఇవన్నీ కలిసి ఈ తవ్వకాలకి సంబంధించిన 3000 సంవత్సరాల భారతీయ చరిత్రని కొంత తెలుపుతున్నాయని న్యూఢిల్లీలోని పశ్చిమజర్మనీ రాయబారవర్గం వెలువరించే 'జర్మన్ న్యూస్' పత్రిక అంటోంది. (జర్మన్ న్యూస్, 15–1–1974) జాట్, మొగల్ కాలాలకి చెందిన వస్తువుల సంగతి అటుంచి అంతకన్నా వెనక్కి వెడితే కుషాన్, శుంగ, మౌర్యుల కాలానికి సంబంధించిన

వస్తువులు ఎన్నో కొత్త విషయాలు కొన్నిటిని తెలుపుతాయి.

క్రీస్తు పూర్వం మొదటి శతాబ్దంలోనే ఇక్కడ ఆలయాలు ఉండేవని తవ్వకాలలో బయటపడిన పునాదులు సూచిస్తున్నాయి.

నాణేలు గోమిత్ర, సూర్యమిత్ర, బ్రహ్మమిత్ర, విష్ణుమిత్రులు పాలించిన కాలం ఎప్పటిదో తెలుసుకొన టానికి ఉపయోగపడుతున్నాయి.వీరందరూ క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దం అంతానికీ మొదటి శతాబ్దం అంతానికీ మధ్య పాలించారని ప్రొ. హార్టెల్ తవ్వకాలవలన తెలుస్తున్నట్లు 'జర్మన్ న్యూస్' వ్యాసం అంటోంది.

ఇక్కడ రెండు ఆలయాల అవశేషాలు కనిపించాయి. వీటిలో ఒకటి సూర్యమిత్రుడి కాలానికి, అంటే సుమారుగా క్రీ. పూ. రెండవ శతాబ్దం ప్రారంభానికి, చెందినదని నిర్ణయింపబడింది. ఇది రెండుసారులు కట్టబడిన ఆలయం అని కూడా తెలుస్తోంది. మొదటి దశలో ఇందులో ఏ దైవాన్ని ఆరాధించేవారో కాని రెండవ దశలో 'నాగ—పూజ' జరిగేదని ప్రొ. హార్టెల్ బృందం అనుకుంటున్నారు. ఇక్కడ వెలువడిన ఒక తోరణం మీాద వాసుకి—జరత్కారుల కథని చూపించే చెక్కడం ఉందని కూడా ప్రొ. హార్టెల్ అభిప్రాయం. ఒక సాలభంజిక బొమ్మ ఇక్కడ దొరికింది. ఈ సాలభంజిక కాలికి ఏడు పడగల తాచుపాము కల కడియం ఉంది కనుక నాగజాతితో సంబంధం ఉందనుకోవచ్చు. పయిన చెప్పిన తోరణం, సాలభంజిక—రెండూ కుషానుల కాలానికి చెందినవి.

'జర్మన్ న్యూస్' వ్యాసం చదివినవారు ప్రొ. హార్టెల్ పరిశోధనల పూర్తి వివరాలు ఎప్పుడు ప్రచురితమవుతాయని కుతూహలంతో ఎదురుచూడకుండా ఉండలేరు. భారత ఉపఖండంమీాద దేవాలయాల నిర్మాణం గురించి ఉన్న అపోహలు కొన్ని ప్రొ. హార్టెల్ పరిశోధనలవలన పోకమానవు కూడా.

—ఒక విలేఖరి.

ఒకసవరణ

భారతి స్వర్ణోత్సవ సంచికలో (జనవరి' 74) "మొట్టమొదటి తెలుగు దినపత్రిక అయిన 'ఆంధ్రపత్రిక' మొదట్లో—ఒక్క సంపాదకీయంలో తప్ప—వార్తా ప్రచురణ అంతా గ్రాంథికంలోనే సాగించేది. విలేఖరులు గ్రాంథికంలోనే వ్రాసేవారు"— దీన్ని యిలా సవరించాలని ప్రార్థన.

...ఆంధ్రపత్రిక మొదట్లో ఒక్క సంపాదకీయంలో తప్ప - వార్తా ప్రచురణ అంతా వ్యావహారిక భాషలోనే సాగించేది. విలేఖరులు వ్యావహారిక భాషలోనే వ్రాసేవారు.

—చక్రపాణి.



గ్రంథవిమర్శలు

కల్పవృక్ష ఖండనము

[గ్రంథకర్త: శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి. వెల: రు. 10. ప్రాప్తిస్థానం: భాషాపోషక గ్రంథ మండలి, నిడుబ్రోలు, గుంటూరు జిల్లా.]

పండిత కొత్త సత్యనారాయణ చౌదరిగారు వ్రాసిన గ్రంథమిది. విమర్శనాత్మక మీ గ్రంథము. ఈ విమర్శకు లేబది గ్రంథముల రచించిరి. ఆంగ్ల కళాశాలలో నధ్యాపకులుగా నుండిరి. గజారోహణాది సన్మానముల బొందిరి.

కళా ప్రపూర్ణ, కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన 'రామాయణ కల్పవృక్షము'ను విమర్శించుట కల్పవృక్ష ఖండనమను నీ గ్రంథము నందలి వస్తువు. విశ్వనాథవారి రామాయణము నందలి దోషము లసంఖ్యాకములు. మరియు నీ దోషము లత్యంతము కావ్యాపకర్షకు హేతుభూతములుగ నున్నవి. కల్పవృక్షములోని దోషములను కుఠారము; ఈ కావ్యమునకు ఛేదకములుగ నున్నదని ఖండన కర్తగారు ప్రతిపాదింప యత్నించిరి. ఈ యంశమును వివరింపవీ రనేకములగు నుదాహరణములను నిరూపించియున్నారు.

సీత పాత్ర చిత్రణమునందు విశ్వనాథవారొక వినూత్నాంశమును ప్రతిపాదించిరనియు నది సీతపై లోకమునందున్న గౌరవ భావమును బోధింపలేక పోగా గడుసుదనమును తలపునకు దెచ్చుచు రసవంతముగాని సంభాషణను మన కందించుచున్నదనియు ఖండనకర్త ప్రతిపాదించిరి. ఈ యంశ మయోధ్య కాండమునందు 74 వ పుటలో నున్నది. దీనిపై విమర్శ కల్పవృక్ష ఖండనమునందు 20 వ పుటలో నున్నది. రాము డరణ్యావాసమునకు పోవు సందర్భమునందు సీతారాములకు నడుమ జరిగిన సంభాషణములోని దీ యంశము. అయోధ్యా నగరమువందే యుండి సీత కౌసల్యాదులకు పరిచర్య చేయుచు, రాము డయోధ్యలో లేని కొఱత తెలియరాకుండ, వృద్ధ జనుల నుపాసింపమని రాముడనును. అపుడు సీత.—

ఆడుబిడ్డల, మరదల యత్తలందు,
రామ! ప్రోషితపతికి గౌరవములేదు

(అయోధ్య—పు 74)

కావున తాను రామునితోబాటుగ నరణ్యమునకు వత్తుననును. పై వాక్యార్థ వివరణమున వ్యాకరణమునకు చెందిన యస్పష్టత గలదని ఖండనకర్త. కాని యిది యుద్దిష్టార్థము నీయఁజాలి యున్నదని ఖండన కర్త వివరణమే తెలుపుచున్నది. ఇంక పోగా నీ మాటలందలి యనుచితి విషయము· ఈ మాటలు సీతారాములు, అనగా ఆలుమగల నడుమ రహః ప్రదేశమునందు· జరిగిన సంభాషణము నందలివి. సీత రాముని వీడియుండలేదు. తనతోపాటరణ్యమునం దిడుమలకు సీతయు గురి యగుటను రాముడు సహింపలేడు. కావున వృద్ధజనుల సేవ యను మిషతో రాముడు సీత నయోధ్యలో నిలుప యత్నించెను. ప్రోషితపతిగా తా నయోధ్యలోనే గాదు మిథిల యందైన నుండలేనని సీత సమాధానము నిచ్చినది.

ఆడుబిడ్డలు, మఱదులు, అత్తలు ఆమెను బాధింతురని గాదు దీని యర్థము. బంధువు లెందరున్నను పతి నెడబాసి సతి రాణివాసమునం దుండ లేదు. తన పతితోడనే తానును కష్టముల సహించుచు ఆనందముగ జీవితము గడపగలననుట ఇందలి సారాంశము.

సీత వనవాసము నిచ్చగించిన విషయమును రాముడే మరొక సందర్భమునందు ప్రసంగించును. అరణ్యకాండమునందలి దశవర్ష ఖండములోని విరాధుని వృత్తాంతమునం దీ ప్రసంగము గలదు. ఆ దేవి హస్తమునం గైకొని, విరాధుడు రామలక్ష్మణులతో మాటలు మొదలిడెను. రాక్షసపీడితయగు సీత విషమస్థితికి మనస్సునందు బాధపడిన రాము డీ విధముగ లక్ష్మణునితో ననెను: 'వలదన్నన్ వినెనా! ధరాతనయ నావంకం బరిభ్రాంతమై, బలవంతంబుగ వచ్చె......

(అరణ్యకాండ దశవర్ష—43). ఈ మాటల వలన రాముడు సీత నడవికి రాకుండ నయోధ్యలో నుంచుటకు ప్రయత్నించెననియు, కాని సీత తన భర్తను వీడియుండలేక అడవులకు వచ్చెననియు తెలియుచున్నది. అరణ్యకాండమునందలి దశవర్ష ఖండమునందు సీతారాము లగస్త్యుని యాశ్రమమును సందర్శించిన యంశము వర్ణితము. ఆ సందర్భమున వా రగస్త్యుని యాశ్రమము నందొక రాత్రి నిద్రించిరి. మరునా డుదయ మగస్త్యుడు 'మీకు గతయామిని సౌఖ్యముగా నున్నదా— జానకి కీ యగస్త్యముని సద్మము క్రొత్తని పించలేదుగా (363) అని యడుగును. ఆ యాశ్రమంబు తన పుట్టినిల్లగు జనక గృహమును, తన మెట్టినిల్లగు దశరథ గృహమును పోలియున్నది అని సీత అనును. అంతట ముని యనియె—నీవు వారి యిండ్లను వదలితివట్లే నా యాశ్రమముకూడ నా యటంచు, (364) అంత జానకి ఇచ్ఛానిష్టము లేక కాదు ప్రభు...(366) అని ప్రత్యుత్తర మొసగును. మిథిలా నగరమునందుగానీ అయోధ్యయందుగానీ నివసించుట తన కిష్టము గాదనియు నిట రాముడున్నందున నివాస మిష్టమనియు స్పష్టము. కావున ఆడబిడ్డల ఏలుబడికి వగచి గాక రాముని వీడియుండ నిష్టము లేనందున సీత అయోధ్యలో నుండలేదు. దీనికి కారణము లెన్ని ఎన్నినను అంతరార్థము స్పష్టము. ఇందు సీతకు గడుసుదనముగాక రామునిపై గల యనురాగము విశదము. ఈ పరమ సత్యమునే కవి యీ విధముగ సుసంగతము గావించినట్లు పై యనుశీలనమున తెలియును.

కావ్య విమర్శనమును పూర్వాపర సందర్భమును పురస్కరించుకొని చేయవలెను. ఏదో ఒక మాటను వ్యస్తముగ పూర్వాపర సందర్భ శుద్ధిలేక తిరస్కరించుట లేక పురస్కరించుట సరియగు విమర్శనము కాజాలదు.

దశవర్ష ఖండమునందలి విరాధుని విశ్వనాథ సృష్టించెను. 'కలియుగమునందలి కల్పవృక్షకర్త చిత్రించిన విరాధుడు నిత్యము వైదిక భోజనము నారగించువాడు. ఇతడు శూద్ర మాంసమును వాడనే వాడడు. పులినైన భక్షింపవచ్చునుగాని క్షుద్రుడైన వెధవ, శూద్రుని మాంసమును భక్షింపరాదని విశ్వనాథులవారు సెలవిచ్చిరి.' (కల్పవృక్ష ఖండనము పుట 99—100.)

దశవర్ష ఖండమునందలి 29 వ పద్యమునందు విరాధుని రూపము వర్ణింపబడినది. పులి తోలు ధరించి యున్నాడని వర్ణింపబడినాడు. పులులు, సింహములు, తోడేళ్లు, లేళ్లు మొదలగు వానిని జంపి వానిని దండగ గుచ్చి వేసుకొన్నాడు. పాపమా విరాధుడు పూట పూట ఏనుగు మాంసము తిని తిని విసుగుచెందియున్నాడు. నరమాంసము తినునందున పులిమాంసము రుచియని (35) విరాధుని భావన. మీరును ద్విజాలే కదా? శూద్రులైన చెప్పుడు. నేను శూద్రమాంసమును భుజింపను (37) అని చెప్పును. పై విధముగ గజ వ్యాఘ్ర మాంసముకన్న శూద్రమాంసము నీచమని విరాధుని ముఖమున కల్పవృక్ష కర్త యనిపించినందున విశ్వనాథవారికి శూద్రులపై నీసడింపు గలదనియు, మరియు ద్విజుల మాంసమును విరాధుడారగించు చున్నందున ద్విజులపై నాదరమనియు, నీయంశము కులతత్వమును బోధించుననియు ఖండనకర్త సిద్ధాంతము. 'నే నుత్తజాతి సంజాతుడన్న 'ధీమా' రచనలలో జూపరాదు' అను నీ వాక్యమునందు (కల్పవృక్ష ఖండనము 11) ఖండనకర్త విశ్వనాథవారికిగల కులమతత్వమును విశదీకరించి యుండిరి. విరాధునకు శూద్రులపై నాదరమనియు బహుశః విరాధుడును శూద్రుడనియు దాన శూద్రుడు కులద్వేషముతో బ్రాహ్మణుల సంహరించు చున్నాడనియు చెప్పనగును

గదా! ఈ విధముగ నెన్నివిధములనైనను ఈ యంశమును సమన్వయము గావింపవచ్చును. సమన్వయము కావ్యమును చదువు వారి యభీష్టముపై నాధారపడి యుండును. ఎట్లు చెప్పినను విశ్వనాథవారికి కుల తత్త్వములేదని నిరూపింప నీ కల్పవృక్షమునందే యుదాహరణముగలదు. బాలకాండమునందు బిడ్డలు లేని దశరథుని వర్ణించు సందర్భము నం దీయంశము సువ్యక్తమగును.

ధారణీ పతి యయోధ్యా వీధినే వర్ణపున్
శిశువైనం గనుపించినన్ నలచి వీక్షించున్
హసించున్ గృపా
వశుడై వానిని దీసి యెత్తికొని యే భక్ష్యంబులో
తెచ్చి యి
చ్చు సమాశ్వాసనసేయు ... (బాల—పుట 3)

అను నీ పద్యమున క్షత్రియు డైనందున ద్విజుడయ్యు దశరథుడు వర్ణ విభేదము లేక శూద్రాది వర్ణ సంజాతులను ఆప్యాయముగ నాదరించుచున్నట్లు విశదము గావించు నీ వర్ణనమువలన విశ్వనాథవారు వర్ణ వ్యవస్థను తన కావ్యమునందు ప్రతిపాదించిరనుట కేవలము 'కింవదంతి' యని స్పష్టమగును.

కిష్కింధకాండమునందు వాలి రామబాణముచే నిహతుడై మరణించు నవసరమున తార యా రంగమున ప్రవేశించి పతి పాటునకు దుఃఖించును. అంతట వాలి యామె నూరడించుచు, 'ఎంత ఏడ్చినను మరణించినవారు తిరిగి రారనును.' చచ్చినన్ దుఃఖ మేటికి జన్మ మందినపుడు దుఃఖింపవలయు గాకంబుజాక్షి (384) అని వాలి యనును. చచ్చినందులకు గాక జన్మించినపుడు దుఃఖమును పొందవలయునను క్రొత్త మాటను కవి మనకు తెలుపుచున్నాడు. ఈ మాట లోకవ్యవహార విరుద్ధము. కావున ఈ కవిత యసంగతము. అనుచితము ననవచ్చును. మరియు కాళిదాసు క్షణమప్యవ తిష్ఠతేశ్వ సన్యది జన్తుర్నను లాభవానసౌ. (రఘు 8—87) బ్రదికిన ప్రతి క్షణము లాభముగ పరిగణింప దగినదని చెప్పియుండగా నీ కవి ఇట్లనుట సరిగాదు. ఈ కవికి సంస్కృత వాఙ్మయమునందు పరిచయ మున్నదని తా నెంతగ చెప్పికొనియున్నను తదభావ మీ యంశమునందు విశదమగుచున్న దనవచ్చును. కాని ఈ వాక్యములను రెంటిని సందర్భమును పురస్కరించుకొని సమన్వయము చేసికొనినపుడు సమంజసముగ నున్నట్లు స్పష్టమగును. మరణింపబోవుచున్న వాలి విలపించుచున్న తారతో నన్న మాట మొదటిది. ఆమె దుఃఖమును మాన్పను జీవితము కష్టభూయిష్టమని చెప్పి తానట్టి కష్టదశను దాటి శాశ్వతమగు దివ్యసుఖము నందబోవుచున్నందున ఈ సందర్భమునందు తార దుఃఖపడ నవసరము లేదనును. భవబంధములలో ప్రవేశించు సమయము జన్మము. కావున అదియే నిజముగ దుఃఖకరము. భవబంధ విమోచనము మరణము.కావున సంతోషప్రదాయి. మరి రఘువంశమునందలి వాక్య మీ యంశమునకు విరుద్ధముగనున్నదిగదా? ఇచట విలపించువా డజమహారాజు. తన భార్య ఇందుమతి మరణించినది. కాలము గడచినను ఆతని దుఃఖము తగ్గలేదు. వశిష్ఠుని శిష్యుడీ విధముగ ఆయన శోకోపశమనార్థము తెలిపెను. ఇందుమతి వివాహానంతరము కొంతకాలము బ్రదికి యున్నది. అటు గాక వెంటనే మరణించిన ఇంకను దుఃఖకరముగదా? అట్లుగానందుకు కొంతకాలమైన ఆమెతో కలసి యున్నందుకు సంతృప్తి చెందుమనును. ఈ సందర్భమునకీ మాట సముచితము.

ఈ విధమగు ననుశీలనముచే, కవికుల తిలకుని కావ్య గతాంశమునకు విరుద్ధమైనందున విశ్వనాథవారి పై వాక్యమునందు దోషమును ఆరోపించుట మరియు దాన విశ్వనాథవారు సంస్కృతమును చదివినట్లు చెప్పికొన్నను వారికిగల సంస్కృత పరిచయము పరిమితమని శంకింపరాదు.

కిష్కింధకాండమున వాలి తార నూరడింపజేయు ఘట్టమున ఖండనకర్తగారు దోషమారోపించిరని దీనివలన గ్రహింపరాదు. కావ్య విమర్శకు వలయు ననుశీలనమును వివరించుట యీ వివరణమునకు పరమార్థముగ రసజ్ఞులు గ్రహింతురుగాక.

పూర్వ సంస్కృత సాహితిలో నాకంత ప్రగాఢ పరిచయముంది కాబట్టి ఆ లోతుపాతులు నాకు తెలుసు. (కల్పవృక్ష ఖండనము పుట 26) విశ్వనాథవారు సెలవిచ్చిన బహిరంగ సూక్తి ఇదియని చౌదరిగారి మాట. ఈ సూక్తి అక్షరాల నిజము. ఖండనకర్త అసాధు ప్రయోగములుగ ముద్రవేసిన ప్రయోగములలో

కొన్ని కవికిగల సంస్కృత వాఙ్మయ పరిచయమునకు ప్రబల నిదర్శనములుగా సమన్వయము గావింపనగు. విశ్వనాథవారు సంస్కృత వాఙ్మయమును పఠనము గావించుటయేగాక స్వయముగ వారు సంస్కృతమునందు కావ్య రచనమును చేయువారు. శృంగార శర్మిష్ఠ యను నాటకాదులను వీరు సంస్కృతమున రచించిరని వినియుంటిమి. సంస్కృత భాషా ప్రభావ మీ కవి ప్రయోగములందు విస్పష్టము. ఆ దృష్టితో నాలోచన చేయనందున ఈ క్రిందివి ఖండనకర్తకు దోషములుగ ననిపించినవి.

1. జనకు గన్నకుమారీ (ఖండనము పుట 135). ఇది వాడు తిన్న విస్తరివంటిదని విమర్శకులు. వాడే విస్తరిలో తినెనో అది అని యర్థము రావలయు నని విమర్శకులు. జనకు డేకుమారిని గనెనో ఆమె యనియు నిది తెలుగునకు సరిపడని ప్రయోగమనియు విమర్శకులు. ఈ ప్రయోగము జనకాత్మజా, జనకజా, జనక సుతా, ఇత్యాదులగు సంస్కృత వాక్యమున కను కరణము. ఇట్టి యనుకరణ మీ భాష కుదురకున్నను కవి సంస్కృతంపు పలుకు బిగికి లోనై ఇట్లు వాడి యుండును.

2. ఓయి యోయి విశ్వామిత్ర (ఖండనము పుట 35).

3. ఓసి యోసి యహల్య (ఖండనము పుట 60) అను నీ రెండు ప్రయోగములను, సంస్కృతము నందలి హే హే విశ్వామిత్ర, అయే అయే అహల్యే ఇత్యాదికములగు పలుకుబళ్ళకు ఛాయామాత్రములుగ నున్నవని గుర్తింప నగును.

4. కుమారక బిందుక (పుట 47)

5. కుబ్జక (పుట 50)

6. బాలక, శిశుక, వహ్నిక, భేదక, మూర్తిక, చిత్రక (పుట 117)

ఇత్యాదులగు రూపములందలి 'క' సంస్కృత సాంప్రదాయము ననుసరించినదే 'కుబ్జక' అనుచో వృద్ధురాలుకు అల్పార్థబోధకమేమని; ఖండన కర్త ప్రశ్న. కుబ్జక అనగా అల్ప కుబ్జ' అని యనుకొన వచ్చును గదా. కుబ్జత్వము విషయమునం దల్పత.

7. మును లగ్గులు (పుట 217)'మునయోఽగ్న మశ్చ' అను సంస్కృతపు నుడి కాంధ్రమునందలి యను కరణమని గుర్తింపనగును.

8. కొంచెము శయ్యాగతులు (పుట 302) 'ఈ షద్విశ్రమ్య' అను బలుకుబడి దీనికి మూలమై యుండును.

9. హస్తి మశకాంతర మంత భేదమున్నది (పుట 213) 'హస్తి మశకయోర్య దన్తరంతత్' అను సంస్కృత నిర్మాణము దీనికి మూలము.

10. కమలకాంత (పుట 309) కమల అనెడి కాంత అని సాధన సమాసముగా గుర్తింప వలయును.

11. రతీబాషముల్ (పుట 162) సంస్కృతమునందు లేని రూప మిది. ఇది సిద్ధసమాసముగా విశ్వనాథవారు ప్రయోగించిరి. రతి బాష్ప అని సిద్ధ సమాసము. రత్యాః అనునది బాష్పతో సమసింపగా విభక్తి ప్రత్యయలోపము వచ్చి 'రతి' అని శేషించును. గౌరీ మొదలగు దీర్ఘాంతములకును సంస్కృత మున షష్ఠీ విభక్తి ఏక వచనమునందు 'గౌర్యాః' ఇత్యాదిగ నగును. విభక్తి లోపింప గౌరీ అగును. ఆ సామ్యముతో 'రతీ' అని విశ్వనాథవారు వాడియుందురు. రతి అనుదానిలో 'రమ్' ధాతువు. క్తిన్ ప్రత్యయము. ఇందు మిగులునది—తి—అనునది. ధాత్వంతమునందలి యనునాసికము 'మ్' లోపింప ర+తి = రతి యని అగును. ఇది హ్రస్వాంతము. స్త్రీలింగము. ఇట్టి దీనిని రతీ యని వాడుట ప్రామాదికము. రతీ...అను నీ ప్రయోగము ఇంకను రెండు మూడు తావులందు విశ్వనాథవారు వాడిరి.

ఖండన కర్త నిరూపించిన పై ప్రయోగము లన్నియు సంస్కృత ప్రభావ విలసితములే. ఈ రీతిని సంస్కృత ప్రభావమునకు లోనైన విశేష ప్రయోగము లింక ననేకములు విశ్వనాథవారి రచనమునందు గలవు.

విశ్వనాథ ప్రయోగము.	సంస్కృత మూలము.
1. న్యాస మొంచెనో (బాల, పుట 13–68)	న్యాసీ కృతా

2. కృతజపులము, స్నాతులమును హుత హవ్యులము (బాల, పుట 164) — కృతజపాః స్నాతాః హుత హవ్యాశ్చ

3. కెలన నాంధ్రముల్ పుండ్రముల్ కేరళ పాండ్య చోళముల్ (కిష్కింధ 114) — ఆంధ్రాః చోళాః పుండ్రాః కేరళాః

సంస్కృతమున దేశ వాచకము బహువచనము నందే యుండును. ఈ ప్రభావమే పై ప్రయోగము లందు గననగును.

4. పాలదుత్తులవోలె నింపారు పొదుగులు (అరణ్య 317) — కుండోధ్నీ (రఘు 1—84)

5. బాహాబాహావిసంచరింతము (అరణ్య. 131) — బాహూబాహ వి

హస్త ప్రహారాత్మకమగు యుద్ధమును బాహాబాహవియను నీ సంస్కృత సమాసము వివరింపజాలి యున్నది. కాని ఆంధ్రమునందు సావిూప్యబోధకము. రాముని వరించిన శూర్పణఖ యన్నమాట ఇది. Apte నిఘంటువునందు Hand to hand in close encounter అను నర్థము ఈ సమాసమునకీయ బడియుండుట గమనార్హము.

ఈ విధమగు వింత వింత రచనములు గలిగి నందున రామాయణ కల్పవృక్షము 'భావశూన్యము' పదాడంబర బంధురము, ధారాశుద్ధి విహీనము, నీరసానవసర సముచ్చయ పునరుక్తి పాదపూరణ వ్యర్థపదా ప్రయోగ, అనౌచిత్య, అశ్లీల, క్లిష్ట దుష్టాన్వయ రచనా భూయిష్టముగా ఖండనకర్తకు అగుపడినది.

మూర్తము (ముహూర్తము) దూసుక (బాల పుట 162) అనియు తప్పించుక (బాల పుట 180) అనియు నీ కవి ప్రయోగించె. మాసినద్దము (మాసిన+అద్దము) (బాల పుట 227) అనుచో సంధి విశేషము. వర్షఋతువు (కిష్కింధ 38) విసంధి విశేషము. ఇది సమాసమయినందున సమాసము విధిగా రావలసి యున్నది. దేవాలయమనగా గుడియని రూఢి. కాని దేవతల నిలయము స్వర్గమను వ్యుత్పత్త్యర్థమును పురస్కరించుకొని విశ్వనాథవారు ప్రయోగించిరని ఖండనకర్తకే పుట (119) తెలిపియుండిరి. శీల విహీనయనుటకు మారుగ అశీల (పుట 25) అనియు భూపతి కాని వాడనుటకు అభూపతి అనియు (పుట 25) వీరు ప్రయోగించిరి. మరియు 'పైనస' (పుట 25) వ్యాకరణ విరుద్ధము.

అడవుల్ (పుట 15) అడవుల కనుట మారుగ 'ఇండ్లన్' (బాల పుట 48) ఇండ్లకనుటకు ప్రయోగించిరి. ఇవి విశేష కారకములుగ గుర్తింపదగి యున్నవి.

బాహా సమ్మార్జన మాచరించి, (పుట 23) అనుచో నర్థ మసంగతమని విమర్శకులు. బాహు స్పృశించి యని యుండవలయును. ప్రాణముల్ నిల్తునే (పుట 23) బ్రదికి యుందునా అను నర్థము నందిది ప్రయుక్తము. ప్రాణములతో నుందునా యని సందర్భము ననుసరించి చెప్పుకోవలయును.

సీతారాము లరణ్యమునకు బయలుదేరు సందర్భమునందు అరుంధతీ ప్రవేశము మూలమునందులేదని ఖండన కర్త (పుట 21). మూల భిన్నముగ రచనము గావించుట అనాదిగ సాగుచునే యున్నది. సీత నడవికి పంపువారి నరుంధతి శపింతు ననియెను. అసలు సీత నెవరు పంపిరని ఖండనకర్త ప్రశ్న. కైక మూలమున రాము డడవికేగవలసె అతనితోపా టర్ధాంగి యయినందున సీతయు పోదలచె. కావున నరుంధతి కైకను శపింప నెంచెననుట స్పష్టము గదా! ఈ ఘట్టమున—

'తూక మయిదుమళ్లు తొమ్మిదిమూరల
నారచీర గట్టినావె సీత' అని విశ్వనాథవారు

రచించిరి. తొమ్మిది మూరల పొడవున్న వస్త్రము అయిదు మళ్ళు బరువుండునా? ఇదంతయు నార చీరపై ఆ ఘట్టముపై నరుంధతికి గలిగిన యశాంతిని స్ఫురింప జేయుచున్నది.

సీతారాముల వనవాసావధి పూర్తియై వారు మరలా తిరిగి వచ్చువరకు నరుంధతి యా ప్రాంతము నకు రాననుటకు మారుగ విూ గడప త్రొక్కను (పుట 22) అనగా, గడప కాదు కడప యని విమర్శకులు. గడప వ్యవహార రూఢము. ఆ మాటను కవి ప్రయోగించెను. 'కడప' గానీ 'గడప' రామాయణ కాలము నందున్నదా?

సుకుమార శిల్పిసీ (పుట 16) రాము నరణ్యమునకు పంపుమనియు, భరతునకు రాజ్యాభిషేకము చేయుమనియు కైక దశరథుని కోరినపుడు ఆ కోరికలకు వెనుకటి వరముతో పొత్తు గలిగించినపుడు దశరథు డీ మాటననెను. ముద్దు ముచ్చటగ మాటాడుచు; ప్రాణాంతకమగు వరము నడుగటు యను నీ రెండంశములు నిందుగలవు. కావున ఈ సంబోధనము సముచితము సందర్భానుసారియునై యున్నది. ఖండనకర్తకీ సంబోధనమునందు స్వారస్య మేమియు గనరానందున నిదియొక దోషమేనని తలంచెను. విమర్శకుల యభిప్రాయమును సరిగా లేదనవలయును.

కైకమ్మ......అడివికోడి కూసినట్లు నవ్వినది (పుట 8) మహారాణి నవ్వును కోడికూతతో పోల్చినందున నిది నీచోపమయని ఖండనకర్త తలంపు. ఉపమాన సామగ్రి కాలక్రమముగ పెరుగుచునే యున్నది. ఒకనాటి నీచోపమలు మరొకనాటి కుపమలు గావచ్చును. సంప్రదాయ విరుద్ధముగ కవి ప్రయోగించుట యాతని స్వాతంత్ర్యమునకు నిదర్శనము. దీనివలన కావ్యజీవిత భూతమగు రసమునకు లోపమేమియు రాదుగదా!

పంపకే యయ్యెడవుల్ రఘూత్తముని (పుట 15) ఇది వింతకారకమని ఖండనకర్త. కారకములకు అవ్యాప్త్యతి వ్యాప్తులు మన భాషలో నత్యధికముగ గలవు.

దంతపీడనముచేసి యనుటలో నందము లేదు' పండ్లు పటపట కొఱికి యనవలయుననియు నీ సందర్భమున దంతపీడనము దంతక్షతమును స్ఫురింపజేయు చున్నదనియు ఖండన యుద్దేశము. కైకమ్మ వరమును కోరిన యనంతరము దశరథునకు గల్గిన యాగ్రహావేశములను వివరించు ఘట్టములోని దీ వాక్యము. పాణి పీడనమునందు పాణిక్షతము గోచరమగునా? అట్లే అర్థము సందర్భానుసారి.

ఖండనకర్త గుర్తించిన దోషములలో వాల్మీకమునందలి యంశమును మార్చుట యొకటి. మూలమును మార్పు గావించిన ఘట్టము లనేకములు విశ్వనాథ వారి రచనమునందు గలవనుట నిర్వివాదము. వ్యుత్పత్తి గల కవి తప్పక మార్పు చేయుచుండును. భవభూతి కృతమగు నుత్తరరామ చరిత్రమునందు మూలమునకు భిన్నముగ ననేకములగు మార్పులు కొనిరాబడినవి గదా!

ఛందో నియమములకు లోనై గణయతిప్రాసల విషయమునందు వినూత్నతను చూపుట, వ్యాకరణ విరుద్ధ ప్రయోగములు, సంప్రదాయమునందు ఇమడని ఉపమా సామగ్రి, మొదలగు నీ యంశములను కవిపై సానుభూతి యున్నచో పై విధముగ సమన్వయము చేయనగును.

ఎంత సహృదయుడగు విమర్శకు డయినను సహింపలేని యంశములు కొన్ని రామాయణ కల్పవృక్షమునందు లేకపోలేదు. మేనకా విశ్వామిత్రుల ఘట్టమున విశ్వామిత్రుడు 'లంజియామెంత కిందకు గుంజినావె' (పుట 4) అనునదిట్టిది. ఈ వర్గమునకు చెందినవిందింక నసంఖ్యాకములుగ గలవు. కాని సద్విమర్శలో నిట్టి వానికి తావులేదు. గుణదోషములను వివరించు నట్టివాడు సహృదయుడు. 'తం సన్తః శ్రోతు మర్హన్తి సదసద్వ్యక్తి హేతవః' అను కాళిదాసోక్తి నిట సమన్వయింప నగును. దోషైక దృష్టిగల ఖండన కర్తగారి సుదీర్ఘమగు నీ గ్రంథమును విమర్శ యనదగదు. దోష నిరూపణ విషయిక మన నగును.

మరియు భాష ఛందస్సు, ఇతివృత్తము కవిత్వమునకు బాహ్య స్వరూపము. కావ్యాత్మయగు రస, పాత్ర పోషణాదుల విషయమై ఈ విమర్శనమునందు పసర్జనత్వము గలదు. కావ్యమును ఖండఖండముగ గాక ఒకే వ్యక్తిగా భావించి యందలి గుణదోషములను వివరింపవలెను. దోషములు కావ్యాపకర్షకు హేతువులు. కావ్యమును రసవంతముగ చేయునవి గుణములు.

కల్పవృక్ష ఖండనము కావ్యగత గుణములకంటె తత్కర్తకు గల వ్యక్తిగతములగు నభిప్రాయములకు తదనుయాయుల యభియుక్తులకు ప్రాధాన్య మీయబడినది. ఇది వ్యక్తిగతమగు దూషణాత్మకము. కుల తత్వమను నుద్వేగముతో నుత్తేజిత మీ దూషణ. కావ్యగత గుణదోషములను సహృదయుడు విమర్శించునే గాని తత్కర్త వ్యక్తిగతమగు నభిప్రాయమునుగాదు.

గుణదోషములను వివరించుచు కావ్యమును పఠింపవలెనను కుతూహలమును విమర్శనము పాఠకునకు

గలిగింపవలయును. అట్లుగాని దానిని విమర్శనమన రాదు. కులమత ద్వేషముల కతీతమై కావ్యగుణములను నిరూపించు విమర్శ మన భాష యందింకను రాలే దనుట బాధాకరమగు సత్యము.

రామాయణ కల్పవృక్షమునందు గణింపదగిన గుణములులేక ఖండనకర్త నిరూపించిన దోషములు మాత్రమే యున్నచో నీ రామాయణము కాలగర్భము నందు గలసి యుండెడిది. అట్లుగాక ఈ రామాయణము నిలిచియుండుట దీనిని పఠించి యానందించు వారుండుటయును నీ యంశమే ఇందలి గుణములను తెలుపుచున్నది.

రామాయణ కల్పవృక్షమునందు రసవంతము లగు సన్నివేశములను కొన్నింటి నీ క్రింద వివరింతును. 'రాత్రి మంచులో తడిసినందున ప్రభాతకాలమునందు వన్యమగునేనుగు

'సామజం బొప్పుచున్న దచ్చముగ నూనె
రాచిన పురాతనాశ్మ విగ్రహమువోలె'
(అరణ్య పుట 80—58)

పండిన నివ్వరికంకుల మోసలందున్న మంచు పెర హంసతెక్కవలె నున్నదని విశ్వనాథవారు వర్ణించిరి.

'పసిడివన్నె పిసాళింపఁ బండినట్టి
ముదురు నివ్వరికంకెల మోసలందు
సొంపుగా గూడియున్న మంచు పెర మొకటె
అంచతెక్క విధంబున నవఘళించు
(అరణ్య పుట 80—63)

చలికాలమునందు కొండలకు ఆకాశమునకు నడుమ మంచు నిండినందున ఆ కొండ హిమాలయము తలపించుచున్నది. తూర్పు తీరమునందలి కొండ ముత్యముల ప్రోగువలె నుదయభానుని దీప్తివలన ప్రకాశించుచున్నది. (అరణ్య పుట 80—64)

సూర్యోదయము ఆరంభమున తెల్లని వెలుగును తరువాత జపా కుసుమ వర్ణము అనంతరము గన్నేరు పూలచాయ తుదకు మల్లికా కుసుమ శోభ కలిగి యున్నట్లు రామాయణ కల్పవృక్షమునందు (బాల పుట 164) వర్ణితము. ఈ యూహ యపూర్వము. రసవత్తరమును. కొలనిలో తమ్మి పూలనడుమ ప్రశాంతముగనున్న కొంగ ఎగురువరకు పుష్పమను భ్రాంతి జనకముగ నున్నదని వర్ణితము. (కిష్కింధ-42)

'వరుణదేవుని దుర్గ సౌభాగ్యమెల్ల—
ప్రకటముగ చూపు
చుండెఁ బంపా సరస్సు' (కిష్కింధ—43)

అనుచో పంపా సరస్సుతో వరుణుని సౌధము పోల్చబడినది. ఈ కల్పన రమ్యము. వాలి వధ సుగ్రీవ పట్టాభిషేకమును నీ ఘట్టమునందు విశ్వనాథ వారు వ్రాసిన ఈ పద్య మత్యంత రమణీయము. వాలి మరణమున నగర ప్రజలలో విషాదచ్ఛాయ అలముకొనియున్నవి. సుగ్రీవ విజయము ఆనందసందాయికముగ నున్నది. ఈ చీకటి వెలుగుల సమ్మేళనమును కవి

'ఒక కృష్ణపక్షాంత మొక శుక్లపక్షాది
యును గూడియున్నట్లు లొప్పెపురము,
(కిష్కింధ పుట 137,19)

ఈ విధమగు వర్ణనములు చేయుటలో సిద్ధహస్తుడు కల్పవృక్షకర్త. వర్ణనా చమత్కారము కవి కున్నత స్థానము నీయజాలును. కాని వర్ణనము రజోగుణ విలసితము. సత్వగుణము గలవాడు వ్యక్తావ్యక్తముగ కావ్యము మరుగుననుండి రసానందము గలిగించును. రామాయణ కల్పవృక్షమను నీ కావ్యమును ఒక కళాఖండముగ పరిశీలించినపుడు అంగి సౌందర్యము కన్న మిన్నగ వర్ణనాదులను నంగసౌందర్యమును స్ఫురించును. అంగిక ప్రాధాన్య మున్నందున కల్పవృక్షమును సత్వగుణ విలసితమగు కావ్యముగా తలంప వీలుగాదు. రాజస భావబంధురమయిన ఈ రచనమును మధ్యమ తరగతికి చెందిన కవితగ గుర్తింపదగియున్నది. మాటల విరుపు మొదలగు నంశములందీతడు నాచన సోమనాథుని తలపింప జేయును. కవిత్రయము వారివలె రసవత్కావ్యమును చెప్ప నవసరమగు సామర్థ్యముండియు విశ్వనాథ వారు అంగిసౌందర్యమును గాక అంగ సౌందర్యము నాదరించినందున మధ్యమజాతి కవిగ గుర్తింపదగియున్నాడు.

'జయన్తి తే సు కృతినో రససిద్ధాః కవీశ్వరాః'

శ్రీ జె. సూర్యనారాయణ.

భారతీ నిరుక్తి

(వేదస్వరూప దర్శనము)

రచన: హరిసోదరులు: ప్రకాశకులు సాధన గ్రంథమండలి, తెనాలి. క్రౌను 1/8 పుట 696+160 లు. హాఫ్ కాలికోబైండు. వెల రు. 15/—లు.

అపూర్వములు ఉత్తమములు ఐన గ్రంథములు పఠించుట ఆహ్లాదకరము, అట్టివానిని సమీక్షించుట మహాభాగ్యము. ఈ గ్రంథపఠన సమీక్షలలో అట్టి ఆహ్లాదమూ మహాభాగ్యమూ మాకు ప్రాప్తించినవి. వేదము అనాది, నిత్యము, అపౌరుషేయము, స్వతః ప్రమాణము అని అనాదిగా వేదవాదుల నిర్ధారణము. కాని అది పౌరుషేయమే కాక బుద్ధిహీనులు కల్పించిన మూర్ఖజల్పితమని జైనులు, బౌద్ధులు, చార్వాకులు మొదలగు మతాంతరులు దానిని నిరసించుచు రాగా, ఎప్పటికప్పుడు వేదవాదులు ప్రతిపక్షవాదములను ఖండించుచు వేదరాశి అపౌరుషేయత్వాదులను సమర్థించి ప్రతిష్ఠించుచు వచ్చినారు.

వాదప్రతివాదము కొకవంక ఈవిధముగా జరుగుచుండగానే యాస్కాచార్యులవంటి ఋషులు—లిపిబద్ధము కాని రోజులలోనే— కృత్స్నవేదమును జిహ్వాగ్రములందు వాచోవిధేయముగా ధారణమొనర్చి ప్రథమవైదిక నిఘంటు వనదగిన నిరుక్తము మొదలగు వేదాంగములను రచించి వేదస్వరూపమును యథార్థముగా ప్రదర్శించినారు. వేదరాశికి పదము క్రమము నిబంధించి శిక్షాదులచేత ఉచ్చారణ స్థిరీకరించి గురుశిష్యపరంపరగా అధ్యయ నాధ్యాపనములు సాగించి ఈ పెన్నిధిని యథామూలముగా కాపాడిరి. జైమిన్యాచార్యులు ధర్మసూత్రములను, బాదరాయణులు బ్రహ్మసూత్రములను రచించి వేదార్థమును యథాతథముగా ప్రామాణికముగా నిలుచునట్లు చేసినారు. బోధాయనాపస్తంబాదులు సూత్రగ్రథనముచేసి వేదమంత్రములకు శ్రౌతస్మార్త కర్మలలో వినియోగక్రమమును నిర్దేశించి నిబంధించి వారు.

వేదవ్యాసులు తన కాలముననే కృత్స్నవేదము అధ్యయనము చేయగల శక్తి, సామాన్యులతో లోపించినదని గ్రహించి, శాఖావిభజనముచేసి ఎవరిశాఖ వేదమునైనను వారు అధ్యయనము చేయునట్లు నియమించినారు.

ఇన్ని జాగ్రత్తలు పడినను రాను రాను వేదవాదులలో శ్రద్ధాశక్తులు లోపించుచు వచ్చినందున ఎన్నో వేదశాఖలు లుప్తములైనవి. వేదభాష్యములెన్నో పుట్టినను అవియు ఉత్సన్నము కాసాగినవి.

ఇట్టి దుఃస్థితిలో శ్రీ విద్యానగర స్థాపనాచార్యులైన శ్రీ విద్యారణ్య పూజ్యపాదులు ఆనాటికి లభ్యములైన గ్రంథజాతమును సేకరించి, భరతఖండములో మూలమూలలోనున్న వేదవిదులను శ్రీ విద్యానగరమునకు పిలిపించి, అప్పటికి ఉపలభ్యమైన వేదరాశికి తమ పర్యవేక్షణమున భాష్యము వ్రాయించి ప్రతిష్ఠించినారు. తదాదిగా నది సాయన భాష్యమనియు విద్యారణ్యమనియు పేర్లు వహించి ప్రామాణిక భాష్యముగా ప్రసిద్ధి వహించినది. అది సామ్రాజ్యస్థాపకుడగు బుక్కరాయల కంకితమైనది. రాయసోదరులు స్థాపించిన విజయనగర సామ్రాజ్యము 230 సం.లు (1336—1565) వైదిక ధర్మమునకు పట్టుకొమ్మగా నిలిచి, నెమ్మది నెమ్మదిగా క్షీణించి నశించినది. కాని బుక్కరాయల పేరపుట్టిన విద్యారణ్యము నేటికిని మొక్కవోని ప్రతిభతో నిలిచి వేదరాశి అపౌరుషేయత్వమును ఉద్ఘోషించుచున్నది.

వారి తర్వాతకూడ మరికొన్ని వేదశాఖలు విస్మృతప్రాయములైనది. ఈ స్థితిలో పాశ్చాత్యులు భరతభూమిలో అడుగుపెట్టి క్రైస్తవమత ప్రచారమునకు పూనుకొనిరి. వారిని ముందు సంస్కృతభాష ఆకర్షించినది. తర్వాత వారి దృష్టి వేదరాశివంకకు మరలినది. ముందు దానిని పఠించుటకు కారణము తమ మత ప్రచారమే యైనను, తర్వాత దాని స్వరూప పఠనమునకును ఉపక్రమించిరి. ఐనను ప్రత్యక్షముగా గాకున్నను అంతర్గతముగానైనను వారికి స్వమతాభిమానము పోలేదు. వారికి భారతీయ ప్రభుత్వము చేజిక్కినందునను, ఇతరదేశములు గూడ ఎన్నో వారికి చేజిక్కినందునను, అపారమైన అర్థబలము అంగబలము వారికి చేకూరినవి. వారు మరల ప్రాచీన కాలమున వేదాంగ నిర్మాతలు చేసినంత

కృషి, దగ్గర దగ్గరగా, చేసిరి. వారు తయారుచేసిన Vedic Index లే దానికి తార్కాణము.

వారిలో మతపక్షపాతము లేకుండ పఠించిన పండితులుకూడ, వేదము పౌరుషేయ మను స్థిర నిశ్చయముతోనే ఉపక్రమించిరి. అందుకు అనుకూలము గానే వారు వేదార్థము నిర్ణయించి మహాగ్రంథములు రచించి ప్రచారముచేసి, ఇతర ప్రపంచమునేకాక భారతీయ పండితులనుగూడ భ్రాంతిలో పడవేయసాగిరి. వారు ఋగ్వేదము 1500 B. C. నుండి రచింపబడినదని చెప్పగా భారతీయ పండితులు 20,000 B. C. ఇత్యాదిగా ఎక్కువ పురాతనత్వము ప్రతిపాదించుటకే పూనుకొన నారంభించిరి కాని దాని అపౌరుషేయత్వమును నిత్యత్వమును ప్రతిష్ఠించు ప్రయత్నమునకే పూనుకొనరైరి. పాశ్చాత్యులుమొదట ఋగ్వేదము 1500 బి. సి. దని నిర్ణయించుటకు ప్రధాన కారణము బైబిలు జెనిసిస్‌లోని సృష్ట్యాదికాలమును మించకుండుటకే యని గుర్తింపలేని దయనీయస్థితికి భారతీయ పండితులు దిగజారిరి.

పాశ్చాత్యులును పాశ్చాత్యభావ ప్రభావితులును వేదరాశినిగూర్చి తేల్చిన విషయములు స్థూలముగా నిట్లున్నది: అట్టివారినే ఈ గ్రంథము తరుచుగా చారిత్రికులని నిర్దేశించి ఖండించుచున్నది.

1. వేదము అపౌరుషేయము కాదు. వివిధ కాలములలో వివిధప్రాంతములలో ఆర్యులనే జాతివారు రచించిన గ్రంథజాతమది. ఋగ్వేదము ముందు రచితము. దాని రచనాకాలమున గూడ నూతన మంత్ర రచన సాగుచుండె ననుటకు స్పష్టమైన ఆధార వచనములు వేదముననే కలవు. పూర్వకవులయు నూతన కవులయు రచనల ప్రశంసలు కలవు.

2. వేదములో భావపరిణతి క్రమక్రమముగా కనబడుచున్నది. ఋగ్వేదకర్తలు ప్రకృతిలో కనబడుచున్న అగ్నివర్షము, మేఘము, ఉరుము, పిడుగు, సముద్రమువంటి ప్రచండశక్తులనే దేవతలనుగా భావించి స్తుతిచేసినారు. ఈ ప్రచండశక్తుల బాహ్యదర్శనమే కాని ఈశ్వరదర్శనము కాని ఆత్మదర్శనముకాని లేదు. పురోహితుల ప్రాబల్యముచేత బ్రాహ్మణములు పుట్టి యజ్ఞకర్మ విస్తృతమైనది. ఆరణ్యకములు ఉపనిషత్తులు పుట్టిననాటికి బ్రహ్మభావము, ఆత్మభావన, ఇంద్రాది దేవతలందరు ఒక్కడైన పరమేశ్వరుని విభూతులను భావపరిణతి క్రమప్రాప్తమైనది. సృష్టికర్తనుగూర్చిన జిజ్ఞాస అనంతరకాలికము.

3. విద్యారణ్య భాష్యాదులలో నిర్వచించిన వేదార్థములు ప్రామాణికములు కావు. తత్. సద్, బ్రహ్మ—ఇత్యాది పదములకు ఉపనిషత్తులందును భాష్యాదులందును జెప్పెడి తత్త్వార్థములు ఋగ్వేదమున కానరావు.

ఈ మొదలైన ప్రదర్శనములతో వేద స్వరూపమే మారి ప్రామాణికత కోల్పోవును. పాశ్చాత్య వేద పండితులు సర్వజ్ఞత్వాహంకారముతో ప్రదర్శించుచున్న వేదార్థములచే ప్రభావితులై భారతీయ పండితులు గూడ వానిని గ్రహించుట సర్వసాధారణమైనది. ఆ భావములనే బ్రిటిషువారి పాలనమందే కాక స్వతంత్ర భారతములోగూడ 3 వ క్లాసునుండి మన పిల్లలకు నూరిపోయుచు వారి రక్తమాంసములలోనికి ఎక్కునట్లు చేయుచున్నాము. ఈ సమీక్షకుడు కూడ ఆ భావమునకు వశంవదుడు కానివాడుకాదు.

ఈ దురవస్థను గమనించి బాధపడి హరిసోదరు లీ గ్రంథరచన కుపక్రమించినారు. ఇట్టి పూర్వపక్షములు వచ్చినప్పుడు పూర్వాచార్యులు యుక్తులగు ప్రతియుక్తులతో ఖండించుచు వచ్చినారు. వేదరాశిని సూక్ష్మముగా పఠించి విస్తారకృషిచేసి పాశ్చాత్యులు తెచ్చిన ఈ పూర్వపక్షములను కేవల యుక్తులతో ఖండింపబూనినచో నప్పదు. అందువలన హరిసోదరులు ఈ నూతన విప్లవమును ప్రతిఘటించుటకు నూతన మార్గ మవలంబించినారు. వారు వేదశాస్త్రములలో కనబడు 12 శబ్దములను ఎంపిక చేసినారు. అవి యన్నియు వేదమునకు అన్వయించునవే. అవి ఇవి:

1. వేదః, 2. ఋషిః, 3. బ్రహ్మ, 4. ఆమ్నాయః (శ్రుతిః), 5. స్వాధ్యాయః, 6. స్వాహా, 7. స్వధా, 8. వషట్, 9. త్రయీ, 10. కవిః—కావ్యమ్, 11. భారతీ, 12. ఛందః.

ఈ పదములనుగూర్చి వేదములేమి చెప్పుచున్నవి ? వేదాంగములు స్మృతులు శాస్త్రములు

పురాణములు ఏమనుచున్నవి ? తుదకు ప్రామాణికులగు కవుల కావ్యము లేమనుచున్నవి ? వానిలో క్రమపరిణతి గాని పరస్పర వైరుధ్యముగాని కలదా? ఆ శబ్దములకు పాశ్చాత్య పండితులిచ్చిన యర్థములు సందర్భమునకు సరిపడునా?-- ఇట్టి ప్రశ్నలు వేసికొని అర్థవివరణకు ఉపక్రమించి నారు.

12 శబ్దముల అర్థవివరణకు 696 పేజీల గ్రంథమా అని మా విద్వన్మిత్రు లొకరు అన్నట్లే, స్థూలదృష్టికి ముందు గోచరించును. ఆ మిత్రుడు వేదార్థ పరిశ్రమకూడ చేసినవాడైనందున మేముకూడ అట్టి విరుద్ధభావముతోడనే గ్రంథపఠన మారంభించితిమి. కాని లోతుగాపోయి శ్రద్ధగా గ్రంథపఠనము సాగించినకొలది మొదటి దురభిప్రాయము పటాపంచలు కాసాగినది. ఇందులో వేదవేదాంగ శాస్త్ర పురాణ కావ్యవిజ్ఞానము అపారముగా హేతుబద్ధముగా నిక్షిప్తమైన దని గోచరించినది. ఈ 12 శబ్దముల వరుసకూడ క్రమప్రాప్తమైనది కాని యాదృచ్ఛికముగా ఎన్నుకొన్నది కాదని తేలినది. ఈ 12 శబ్దముల విచారణలో సందర్భవశముగా అనేక శబ్దములవిచారణ, దాని యర్థవివరణము జరిగినది.

బ్రహ్మభావన అనంతర పరిణామ మనియు ఋగ్వేదము మొదట పుట్టినదనియు గదా చారిత్రకుల నిర్ణయము! శబ్దార్థ విచారణలో ఇందులో సర్వ సాధారణముగా ముందు ఋగ్వేదము లోని వాక్యములే గ్రహింపబడుచు వచ్చినవి. ఈ విచారణవలన బ్రహ్మభావన ఋగ్వేదమును సహా అన్నివేదములందును కలదని ఋజువు చేయబడినది. ఆ యర్థమే శ్రుతులును వేదాంగములును, స్మృతులును, శాస్త్రములును, ఇతిహాసములును, పురాణములును, ప్రామాణికుల కావ్యములును ఏకకంఠముగా ఉద్ఘోషించుచున్నది. ఋగ్వేద కాలమున అగ్ని మొదలగు ప్రకృతిశక్తుల ఆరాధనము మాత్రమే కలదను చారిత్రకులమాట పరాస్తమగుచున్నది. శబ్దార్థము చెప్పుటకు ఏ శబ్దము ఏధాతువు నుండి నిష్పన్నమైనదో కూడ తరుచుగా విచారణ చేయబడినది.

వేదరచనలో పౌర్వాపర్య మున్నదని చారిత్రకులు ప్రదర్శించు రెండుమూడు సందర్భములు ఉదాహరించి వానికి సంప్రదాయార్థముమాత్రమే ఎట్లు కుదురునో, చారిత్రకులది ఏల కుదురదో కొంచెము హరిసోదరుల ననుసరించి చూపెదము.

‘అగ్నిః పూర్వేభిః ఋషిభిరీడ్యో నూతనైరుత’ ఋగ్వేదము 1—1—2.

పై మంత్ర మాధారముగా Macdonell ఇట్లనుచున్నారు.

‘In the Rigveda reference is often made to previous singers and to contemporary poets.’

ఈ యర్థము ఆపాతమధురముగానే ఉన్నది. కాని మూలములో పూర్వ ఋషులు నూతన ఋషులు పేర్కొనబడినారే కాని Singers కాని Poets కాని లేరు.

ఇక్కడి అగ్ని శబ్దమునకు జగత్కారణుడైన పరమేశ్వరుడని వేదశబ్ద విచారణలో నిరూపించినారు. అట్టి అగ్ని తపస్సంపన్నులైన పూర్వ ఋషులకు నూతన ఋషులకు ఆరాధ్యు డయ్యెను అని ఈ మంత్రమునకు అర్థ మేర్పడుచున్నది. అనగా సర్వకాలము లందును అగ్ని ఆరాధ్యుడని కీర్తింపబడుచున్నాడు. కావుననే ఋగ్వేదము అగ్నిని ‘యుగే యుగే విదథ్యమ్’ ఋ. 6–3–5 అని కీర్తించినది— అనగా ‘సర్వ కాలములందును అగ్ని యజ్ఞాదులచే ఆరాధనీయుడు అనుచున్నది. ఋషి పదమునకు అతీంద్రియార్థ దర్శనము కలవారనియే గాని, Poets అని కాని, Singers అని కాని, మంత్ర రచయిత అని కాని అర్థము కాదు. (పుటలు 84–85 తాత్పర్యార్థము). ఈ యుదాహరణమువలన పాశ్చాత్య వేదపండితులు ఎట్టి విపరీతార్థములు చెప్పిరో బోధపడగలదు.

అట్టిదే మరియొకటి.

‘నవంను స్తోమ మగ్నయే దివః శ్యేనాయ జీజనమ్’ ఋ. 7–15–4.

'ఓ అగ్నీ, నీకు నవమైన స్తోమమును జనింప జేయుచున్నాను' అని మంత్రార్థము.

అట్టి యర్థమే.

'శుచింను స్తోమం నవజాత మద్యేంద్రాగ్నీ వృత్రహణా జుషేథామ్' ఋ. 7-93-1 అను మంత్రమునకును గలదు.

ఇక్కడ ప్రస్తావింపబడిన స్తోమములు క్రొత్తగా సృష్టింపబడినవే నిస్సంశయముగా ! అట్లే 'శస్త్రము' అనునవియు క్రొత్తగా సృష్టింప బడునవే. ఇట్టివాని ప్రస్తావనకూడ భ్రాంతి కలిగించు నట్టిదే. కాని స్తోమములు గాని శస్త్రములు గాని క్రొత్త మంత్రములు కావు. అవి సిద్ధమంత్రముల కొత్త కూర్పులు. పే. 163. ఇట్టి సూక్ష్మములు తెలిపినచో మొదట కలిగిన భ్రాంతి నివృత్తి యవును.

ఇట్లే మరి యెన్నో భ్రాంతి కలిగించు వేద సందర్భములు దాపక వివరించి వేదము పౌరుషేయమని భావించువారి భ్రాంతి తొలగునట్లు ఈ గ్రంధరచన చేసినారు.

వేదప్రామాణ్యము అంగీకరింతురు గాక, అంగీకరింప కుందురు గాక! ఏమైనను వేదము తాను పురుష ప్రోక్తమైనట్లు చెప్పలేదని, అందులో క్రమపరిణతి లేదనీ, హరిసోదరులు ఆయా సందర్భములలో హేతు బద్ధముగా స్వప్రమాణముగా సిద్ధాంతము చేసినారు.

ఈ విధముగా వేదస్వరూప ప్రదర్శనమునకు గ్రంధము ప్రవృత్తమైనను, సందర్భవశముగా వేదవాక్యముల అతీంద్రియ జ్ఞానము, వేదోక్త కర్మల అతిశయము వేదాంగముల స్మృతుల దర్శనముల విశిష్టత ప్రదర్శించు ఆర్ష విజ్ఞానమును గ్రంథమందంతట హరిసోదరులు వేదజల్లి వేద వాదులకు మహోపకృతి కావించినారు.

మరియొక విశేషము కూడ ఈ గ్రంథములో అక్కడక్కడ గోచరించును. మమ్మటభట్టువంటి ఆలంకారికులు, భవభూతివంటి మహాకవులు చెప్పిన శ్లోకములకు సర్వసాధారణముగా వ్యాఖ్యాతలు చూపని విశేషార్థములు వేదవిజ్ఞానపరమైనవి ప్రదర్శించినారు. అట్టి మహారచయితల భావములు పూర్తిగా అవగాహన మొనర్చుకొనుటకు సామాన్యముగా భాషాశాస్త్ర విజ్ఞానము చాలదని వేదవిజ్ఞాన మవసరమని చెప్పకుండ సూచించినారు. రెండు ఉదాహరణము లిత్తుము.

మమ్మటభట్టు తన కావ్య ప్రకాశ రంభములో కవి భారతి నిట్లు ప్రశంసించినాడు.

'నియతికృత నియమ రహితామ్
హ్లాదైక మయీ మనన్య పరతంత్రామ్
నవరస రుచిరాం నిర్మితి
మాదధతీ భారతీ కవేర్జయతి.'

ఈ శ్లోకమును బ్రహ్మ సృష్టికంటె కవి సృష్టి విశిష్టమైనదని వ్యాఖ్యాతలు వివరించినార. కవులంటే లౌకిక కవులే. 'ఈ మంగళ శ్లోకము కవి యగు పరమేశ్వరుని నుండి యావిర్భవించిన భారతి యగు వేదవాణికి సర్వవిధముల నన్వయించునని పు. 459-462 లలో చేసిన వివరణము అపూర్వమై ఎంతో ఆనందము కలిగించినది.

అట్లే భవభూతి ఉత్తర రామ చరితములోని

'ఇదం కవిభ్యః పూర్వేభ్యో
నమోవాకం ప్రశాస్మహే
వందే మహి చ తాం వాణీ
మమృతా మాత్మనః కలామ్॥

అను మంగళ శ్లోకములో ప్రస్తావింపబడిన పూర్వ కవులు వేదమంత్రములే యని ఇందలి ఇదం శబ్దము వేదసంప్రదాయాను గుణమనియు ఇందలి వాణి వేద వాణియే యనియు పు. 454—467 లలో చేసిన వివరణము ఎంతో హృదయంగమముగా నున్నది.

మరియొక విశేషము! కావ్యస్వరూప లక్షణ వేత్తలు తరుచుగా వేదము ప్రభు సమ్మితముగాను, పురాణములు సుహృత్సమ్మితముగాను, కావ్యములు కాంతా సమ్మితముగాను ఉపదేశించు ననుట సర్వసాధారణ విషయము. కాని హరిసోదరులు అధికారి భేదమును బట్టి వేదము ప్రభుసమ్మితముగాను, సుహృ

త్సమ్మితము గాను మాత్రమేకాక కాంతాసమ్మితముగా కూడ ఉపదేశించు మహాకావ్యమనుచు 'కవి—కావ్యమ్' అను పదార్థవివరణలో పు. 419–508 లలో చేసిన ప్రతిపాదన లెంతయేని ఆహ్లాదకరములై బుద్ధిమంతులు మననము చేయుదగినవిగా నున్నవి. ఇది గ్రహించినచో భారతీయ విజ్ఞానమంతటికీ వేదమే మూలమని నిర్ధారితమై భారతీయ సంస్కృతి విశిష్టత గోచరింపగలదు.

ఈ విధముగా గ్రంథస్థ విషయములు ప్రామాణికములుగా నుండి వేదనిత్యత్వమును, అపౌరుషేయత్వమును నిరూపించునవిగా నున్నవి. దీనికి హిందీభాషలో అనువాదము జరుగుచున్నట్లు తెలియవచ్చినది. తక్కిన భారతీయ భాషల లోనికే కాక ప్రపంచభాష లన్నింటిలోనికిని సంగ్రహముగానైనను అనువాదము చేయదగిన ఉత్తమ గ్రంథకోటిలో చేరిన దీ గ్రంథము !

గ్రంథవిషయ గౌరవమునకు తోడు అచ్చు, బైండు, జాకెట్టు, బుకుమార్కు అన్నీ రమణీయముగా ఉండి వన్నె తెచ్చుచున్నవి. మూల్యముగూడ అతి స్వల్పముగా నిర్ణయింపబడినది.

దీనికి సాంగస్వాధ్యాయ భాస్కరులు కుప్పా లక్ష్మణావధానిగారు వ్రాసిన విపుల పీఠికయు, శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి పరిచయమును, శ్రీ కంచి కామకోటి పీఠాధీశ్వరుల 'వేదములు' అను వ్యాసమును, ఇతర పండితుల యభిప్రాయములును, మధ్యమధ్య ఉదాహరింపబడిన హరిసోదరుల వేదమాతృస్తవ భాగములును గ్రంథగౌరవమును బహుగుణముగా వృద్ధి చేయుచున్నవి.

పూర్ణచంద్రునిలో కలంకమువలె ఇందులో XXXI వ పుటకు ఎదురుగా ముద్రింపబడిన శ్రీ గాయత్రీమూర్తి ఫోటో ఉత్తమ శిల్పసంప్రదాయమునకు విరుద్ధముగా ఉండి బాధ కలిగించినది. రావణాది రాక్షసులకు అనేక శిరస్సు లున్నప్పుడు అవి ఒకే వరుసలో మనకెదురుగా ఉన్నట్లు చిత్రింపబడుటయు, బ్రహ్మాది దేవతామూర్తుల శిరస్సులు బహుముఖములున్న ఒకే బ్లాకుగా కుండరించుటయు సంప్రదాయమని పెద్దలవలన వినియున్నాము. శ్రీ దేవికి సద్యోజాతాది పంచ ముఖములను శ్రీ చక్ర రాజమందు అగ్నీశాసుర వాయవ్య కోణములందును మధ్యమున ఊర్ధ్వముఖముగాను కల్పించి పూజించుట శిష్టాచారము. శివలింగ పూజలో కూడ నట్లే యుండును. గాయత్రి పంచ ముఖములు కూడ నట్లే భావించుట యుక్తము. గాయత్రి ధవళ ముఖము ఊర్ధ్వముఖము. త్రిమూర్తికి త్రికోణమునందును, షణ్ముఖునికి షట్కోణమందును ముఖములు కల్పించుట వృద్ధ సమ్మతము. ఈ శతాబ్దములో ప్రతిష్ఠించిన గాయత్రీదేవికి షణ్ముఖునికి ముఖములు రాక్షస క్రమములో విజయవాడలోను గుంటూరు నందును దేవాలయములలో మాకు చూచిన జ్ఞాపక మున్నది. ఇది కూడ ఆధునిక పద్ధతి నవలంబించుట బాధ కలిగించి పేర్కొనుచున్నాము. సంప్రదాయ మెరుగని శిల్పి గండరించిన విగ్రహమును సంప్రదాయ ప్రవర్తకులైన పీఠాధిపతులు గ్రహించి భారతీ నిరుక్తి వ్రాసిన హరిసోదరులకు అనుగ్రహింపగా వారు గ్రహించుటయు ముందుముందు శిష్టేతర సంప్రదాయ ప్రవర్తనకు మూలము కాగలదను భయముతో వినయ పూర్వకముగా దీనిని ప్రదర్శించితిమి.

ఈ ఉత్తమగ్రంథ రచయితలైన హరిసోదరులను, ప్రకాశకులైన తెనాలి సాధన గ్రంథ మండలి వారిని సర్వాత్మనా ప్రశంసించుచున్నాము. వేదవాఙ్మయమందు ఏమాత్రము అభిమానమున్న వారైనా ఈ గ్రంథము అవశ్యము పఠింపవలసియున్నది.

—శ్రీ నోరి నరసింహశాస్త్రి.

శరన్మేఘం

శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి.

మనస్తత్వాలు—పంజరకీరాలు

శ్రీమతి పవని నిర్మల ప్రభావతి.

వెన్నెల విరిసింది

శ్రీమతి తమిరిశ జానకి.

పై మూడూ ఎమెస్కోవారి ప్రచురణలు. ఒక్కొక్కటి వెల రు. 2–50 ు. ప్రతులకు: ఆంధ్ర

ప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్.

సామాజిక పరిణామాలూ— స్త్రీల సమస్యలూ

మన సమాజంలోవచ్చిన నూతన పరిణామాలలో మహిళలకు స్వాతంత్ర్యం, చదువు, వుద్యోగాలు అవసరమే కాదు. నిత్యజీవితంలో భాగమే అయాయి.

కొత్త పరిస్థితులలో కొత్త సమస్యలు ఎదురయ్యేయి. వానిని పరిష్కరించుకోవడంలో నూతన జీవిత విలువలు ఏర్పడ్డాయి.

ఇదొక పరిణామగతి. మన కళ్లముందు నడిచిపోతూంది. దినం మనకు అనుభూతం అవుతూంది. సామాజికంగా కొత్తకు అలవాటు పడిపోయాం. కాని వ్యక్తిగతంగా మనం గత కాలపు వ్యవస్థా, దాని విలువల పరిధిలోనే కొత్తను ఇరికించాలని ప్రయత్నిస్తున్నాం. అది ఇమడదు. హింసపడీ, హింసపెట్టీ జీవితాన్ని దుఃఖభాజనం చేసుకొంటున్నాం.

మిగిలిన ఏ విషయంలో కన్న స్త్రీల సమస్యల విషయంలో ఈ మొరాయింపు చాల తీవ్రంగా కనిపిస్తుంది. దానికి రెండు కారణాలు. మగవాడు తాను అనుభవించిన అధికారాన్నీ, తత్ఫలితంగా నరనరాలా జీర్ణించుకొన్న దురహంకారాన్నీ మరిచిపోలేకపోవడం.

రెండో వేపున స్త్రీ తన బానిస మనస్తత్వాన్ని మరిచిపోలేకపోవడం. ఫలితంగా సమాజం ముందుకు పోతున్నా, వ్యక్తుల మనస్సులు ఒక పట్టాన ముందుకు అడుగువెయ్యడంలేదు. తప్పనిసరయి ఓ అడుగువేసినా వెనకచూపు మానడంలేదు.

ఈ పరిస్థితికి మన యెదుటవున్న మూడు నవలలూ మచ్చులు. అయితే ఈదిగపీకుడు తత్వం మూడిటిలో ఒకే విషయంలో కాదు. ఒకే విధంగానూ లేదు.

శరన్మేఘం

ఈ నవల చదువుతే రచయిత్రి అద్యతన కాలీన సమస్యల్ని ముఖ్యంగా స్త్రీల సమస్యల్ని బాగా ఎరుగునని అర్థం అవుతుంది. కాని, రెండోవేపున ఆ సమస్యలకు మూలం ఎక్కడుందో గుర్తించినట్లుగాని, గుర్తించే వుద్దేశం వున్నట్లుగాని అర్థంకాదు.

సునంద ప్రధాన పాత్ర. ఆమె విద్యావంతురాలు. ఒక స్నేహితురాలి పెళ్లిలో పరిచయం అయిన యువకుణ్ణి పెళ్లిచేసుకోవాలనుకొంది. తల్లిదండ్రుల అభ్యంతరాన్ని లెక్కచెయ్యలేదు. పట్టుపట్టి ఆతనినే చేసుకొంది.

పెళ్లిఅయిన రెండుమూడేళ్లకి మగడు జబ్బుపడ్డాడు. నడిచేదారిలేక తండ్రిని సాయం అడిగింది. ఆయన మొదట తానా వివాహం వ్యతిరేకించిన సంగతి గుర్తుచేసి చిరాకు పడ్డాడు. సునంద అభిమానపడి ఆయన సహాయం నిరాకరించి వెళ్లిపోయింది.

తన చదువు ఆసరాతో వుద్యోగం సంపాదించుకొని, తాను నిలబడింది. భర్తకు మందిప్పించుకొంటూంది.

ఆమె ఆత్మాభిమానానికీ, మనస్థైర్యానికీ మెచ్చుకోవాలి.

కాని, రచయిత్రి వానికిచ్చిన ప్రాధాన్యం అల్పం. చదువరులలో ఆ పాత్రయెడ జాలి, అనుతాపం సృష్టించి, వారి దృష్టిని మళ్లించడానికి దానిని ఒక మలుపుగా వుపయోగించుకొన్నారు.

జీవితంలో కష్టాలు బహుముఖం. అవి అందరికీ వుంటాయి. అయితే వాటి లోతు, విస్తృతి ప్రభావం భిన్నభిన్నంగా వుంటాయి. రచయితలు చేయవలసింది వానిని నిగ్రహించి, జీవితాన్ని సుఖమయం చేసుకొనేందుకు కావలసిన ధీమా చదువరులలో సృష్టించడం. అంతేగాని, ఆ కష్టాలను అడ్డం పెట్టుకొని ఒక దయనీయస్థితి కల్పించి కళ్లనీళ్లు పెట్టించడం కాదు. సునంద జీవితాన్ని నిర్ణయించుకోడంలో చూపిన పట్టుదల, మన స్థైర్యం కొసకంటా చూపగలిగితే, నవలను దుఃఖాంతం చేసినా ఒక సామాజిక సందేశం ఇవ్వగలిగేది.

సునందకు ఆమె కష్టస్థితిలో సాయంగా వుండాలనే సదుద్దేశంతో ఆమె మరది గోపాలం తన వుద్యోగాన్ని ఆమె వుంటున్న వూరికి మార్పించుకొన్నాడు. భార్యనూ, పిల్లవాడినీ తీసుక వచ్చేసేడు. సమష్టిగా ఒకే యింట అంతా వుంటున్నారు. కాని సమష్టి కుటుంబాల ఇబ్బందులు ప్రారంభం కావడానికి ఎంతోకాలం పట్టలేదు. ఒంటరిగా వున్నప్పటి కన్న సునందకి చాకిరీ ఎక్కువైంది. ఆనాడు లేని నిందలు అదనం అయేయి. ఆ దుస్స్థితినుంచి బయట పడాలంటే ఆమె సమష్టి కుటుంబ జీవితాన్ని విడగొట్టెయ్యాలి. ఆ పని చెయ్యలేదు.

కాని, రచయిత్రి తన ప్రధాన పాత్రలో కల్పించిన ఈ బలహీనతను కప్పిపుచ్చి (తెలియకనే అయినా) గోపాలం భార్య రత్నం ఆ అదనపు కష్టాలకు కారణం అయినట్లు వ్రాస్తారు. ఆర్థికమైన ఆధారంలేక, పెళ్లియెడ పెద్దవాళ్లు కల్పించిన జరీకలల ఆనందంలో తేలిపోతూ, మగడు తెచ్చే ధనంమీద ఆకాశ సౌధాలు నిర్మించుకొంటున్న సగటు నవోఢ రత్నం. సునంద సమస్యలలో ఆమె ఆత్మార్పణం చేసుకోవాలని కోరడం ఏమిటి? సానుభూతి చూపవచ్చు. సాయమూ ఇవ్వవచ్చు. ఆ స్వాతంత్ర్యం ఆమెకుంటే ఆమె దొంగతనంగా డబ్బు దాచుకోడం; లేని పెద్దపరుగులకు పోవడం తగ్గేది. కాని రచయిత్రి వుద్దేశం సునంద యెడ పాఠకుల సానుభూతి పెంచడం. కనకనే ఆమె న్యాయమైన ఆ మార్గాన్ని చూడలేకపోయేరు.

చివరకు సమష్టి జీవితమూ, దానికి సర్దుకోవాలనే ప్రయత్నాలూ ఎదురుతిరిగి సాయం ఇద్దామని వచ్చిన గోపాలమే సునందను ఈసడించే స్థితి వచ్చింది.

చిరాకు పడ్డందుకు, మగనిని మాట అన్నందుకు అభిమానపడిన సునంద, తనకు సంబంధం లేనివాళ్లు తిట్టినా పడే స్థితి కల్పించి రచయిత్రి ఆ పాత్రను గబ్బు పట్టించేరు. తన భర్తను తిట్టడంకన్న తనకు రంకు కట్టడం అభిమానం చూపవలసిన ఘట్టం కాదా?

సునంద చిన్నతనంలో వాళ్ల పొరుగునవుండి, కలిసి ఆడుకొన్న జగపతి (అతడు సునందకన్న చిన్నవాడని సూచించడం మరవలేదు, రచయిత్రి) ఆమెతో చనువుగా వుండడం, ఆమెకు చీర పెట్టడం ఆమె భర్తకు అనుమాన కారణం అయింది. ఇక్కడ వున్నది రోగిష్టివాని మానసిక బలహీనత మాత్రమే కాదు.

జగపతి భార్య శాంత ఆరోగ్యవంతురాలే. అయితే ఆమె కూడా అటువంటి స్వభావమే చూపింది. అందుచేత దీనిని సామాజిక దౌర్బల్యంగా చెప్పాలి సుంది.

ప్రస్తుత సమాజంలో భార్యను వదలిపెట్టి, జగపతి ఆమె పీడను వదల్చుకోగలడు. కాని సునంద తప్పించుకోలేదు. ఆమెలోవున్న ఓర్పో, మంచితనమో కన్న సమాజంలో స్త్రీయొక్క స్థితి దీనికి మూలం అనడానికి సందేహించనక్కర్లేదు. ఇది ఆమె బానిస స్థితిని వేలెత్తి చూపిస్తూంది.

ఆ స్థితి తొలగడం ఈవేళ సంఘానికే అవసరం. స్త్రీల చదువులు, వుద్యోగాలు వారి పరాధీన స్థితి తొలగడానికి కావలసిన పూర్వరంగం ఇవ్వగలవు. తరువాయి మనస్సుది. అనుమానించినందుకు సునంద మగణ్ణి రోగశయ్యమీద వదలివెళ్లిపోయి, తన ఆత్మాభిమానం నిలబెట్టుకోవాలా అనేది ప్రశ్నకాదు. రోగిష్టివాని తిక్కల్ని భరించవచ్చు. పట్టించుకో కూడదు. అయితే ఆ భరించడానికి కూడా ఒకహద్దు వున్నదనే గుర్తు భర్తకు కలిగించాలి సమాజం. అదీ ముఖ్యం. స్త్రీ పురుషుల మధ్య అనుమానం సామాజికమైన జబ్బు. ఫ్యూడల్ సమాజలక్షణం. స్త్రీ పురుషుల మధ్య మనుష్యమాత్ర పరిచయాలకు కూడా అన్నా, చెల్లాయీ బంధుత్వాల ముసుగులేనిదే భరించలేని దుర్లక్షణం.

మనస్తత్వాలు—పంజరకీరాలు

రెండు పెద్దకథలు అనదగిన ఈ చిన్ని నవలల్లో కథగాని, కథాశిల్పంగాని చెప్పదగినట్లుగా లేకపోయినా, వానిద్వారా రచయిత్రి పాఠకులలో కలి

గించదలచిన భావాలు మాత్రం చాల దారుణంగా వున్నాయి.

ఈ నవలలు చదువుతే మన సమాజం ఒక పెద్ద విశాలమైన బ్రాథెల్—వ్యభిచార గృహంలా కనిపిస్తుంది. వీనిలోని పురుష పాత్రల సర్వసామాన్య కార్యక్రమం, అనుక్షణచింతనా ఎవరో ఒక స్త్రీని రేప్ చెయ్యడంకోసమే, స్త్రీ పాత్రలన్నీ రేప్ చెయ్యబడడానికి సుముఖంగా వుంటాయి. అయితే మగవాళ్లది ఏకకార్య నిష్ఠ అయినట్లు, స్త్రీలది ఏక వ్యక్తి నిష్ఠ అయినట్లూ చెప్పడానికి రచయిత్రి ప్రయత్నించేరు. (కొద్దిమినహాయింపులు ఉభయత్రా అనుమతిస్తూ) ఇంక గోపాలకృష్ణయ్య ఆదిత్యహృదయ పఠనం, మురళి వుద్యోగం వంటివి కథలలో ఆనుషంగికాలు. కన్యాఫ్యషియసు చెప్పేడంటూ ఒక మాట చెప్తుంటారు. 'రేప్ తప్పనప్పుడు అల్లరి చెయ్యక ఆనందించమ'న్నాడని. వీనితో పంజరకీరాలు చదివినప్పుడు రచయిత్రి ప్రకృథం కన్ఫ్యూషియసు సూత్రాన్ని బలపరచడంలేదు గదా అనిపిస్తుంది.

అన్నపూర్ణ పాత్ర ద్వారా రచయిత్రి చెప్పించిన మాట లివి :

'ఈ ప్రపంచం పెద్ద పంజరం...మనకు భగవంతుడు జాగ్రత్తగా అల్లియిచ్చిన పంజరాలే క్షేమకరమైనవి. అవి ఛేదించుకొని మరేదో కొత్త వలలో పడడం అవివేకం...'

రుక్మిణి తల వూపింది. 'అవును. ఊర్మిళా! నా కీ పంజరమే బాగుంది. ఈ పంజరమే నాకు సరిపోయింది.'

ఊర్మిళ ఏమీ మాట్లాడలేదు. ఆమె మన స్సంతా పల్లెటూళ్లో, తమ మేడమీద గదిలో, మాధవరావు బాహువలయంలో, నిశ్చింతగా, హాయిగా...

(పుట 218.)

ఇక్కడ కనిపించేది అభిరుచుల తేడా. అంతే.

నూతన సమాజంలో వచ్చిన చదువులు, వుద్యోగాలు, కళాభివృద్ధి స్త్రీల పరిస్థితిని పూర్తిగా మార్చివేస్తున్నాయని ఊర్మిళ, రాధ, రుక్మిణి వగైరా పాత్రల ద్వారా రచయిత్రి చెప్తున్నారు.

న్యాయంచేత ఈ నూతన పరివర్తనలు ప్రోత్సహించ తగ్గవి.

స్త్రీ జాతియెడ సహృదయత, సదభిప్రాయం మాట పక్కకు పెట్టండి, ఈ వేళ ఆ మార్పులు సాంఘికావసరం. ఆర్థిక వ్యవస్థ మారింది. యంత్రాలు వచ్చేయి. పనులు పెరిగేయి. ఎక్కువ జనం కావలసి వచ్చేరు. పనులు సులువయేయి. స్త్రీలు కూడా పనులలో చేరడానికి అవకాశం కలిగింది. వెనకటిలా వారిప్పుడు మగవాని చూపులను కప్పిస్తూ గోడలమధ్య దాగడంలేదు. వారిని సవాలుచేస్తూ సామాజికోత్పత్తి రంగంలో ప్రవేశించేరు. ఆ ప్రవేశం అద్యతనకాలంలో కుటుంబానికి ఆసరా అయింది.

స్త్రీలు వుద్యోగాలలో ప్రవేశిస్తున్న కొత్తలో మగవాళ్లు వింతగా చూడ్డం, వెంటబడడం ఆశలు చూపడం, సంసారాలు భగ్నంచేయడం, చేసుకోడం ఎక్కువగా వుండి.

నేడా స్థితిలేదు. మగవానిలాగే ఆడుది విద్యాలయాలూ, వుద్యోగ స్థలాలలో ఒక భాగం అయింది.

అయితే ఇప్పుడు వారి జీవితాలలో కొత్త సమస్యలు వచ్చేయి. వారిమీద కుటుంబ భారం ముప్పేటన పెరిగింది.

ఉద్యోగంచేసి ధనం తేవడం.

గృహకృత్యాలు చేసుకోవడం.

పిల్లల్ని నిభాయించుకోవడం.

మగవాడు పూర్వసమాజపు వాసనలు జీర్ణించిపోయి గృహకృత్యాలు, పిల్లల సర్దుబాట్లలో ఆమెకు సాయపడడం లేదు. ఆ పని అప్రతిష్ఠ అని భావన.

ఇప్పుడిప్పుడది మారుతూంది.

నూతన పరికరాలూ, పనిముట్లూ, విద్యుత్తూ, గ్యాసూ వుద్యోగినుల పనులు తేలికపరుస్తున్నాయి.

ఆహార పరిశ్రమలు, అలవాట్ల మార్పులూ మరికొంత సౌలభ్యం కలిగిస్తున్నాయి. నవయువకులు భార్యకు సాయపడడం కూడా జరుగుతూంది. అయితే పిల్లల సమస్య ఇంకా వుంది. అదీ నర్సరీలూ, క్రెచీలూవస్తే తగ్గుతుంది.

ఇవిగాక, వుద్యోగ స్థలాలలోనూ, బయటా స్త్రీలకు ఇంకా పూర్తిగా రక్షణ లేకుండా వుంది. ముఖ్యంగా ఆఫీసుల వెలుపలనే భయం ఎక్కువ. ఆంధ్రలో చీకటిపడ్డాక ఆడుది ఒంటరిగా తిరగగల పట్టణాలు లేవు. ధర్మభూమి, కర్మభూమిగా చెప్పుకొని వుబ్బితబ్బిబ్బయి మూర్ఛపోయే మనదేశంలోనే ఈ స్థితి. అభివృద్ధిసాధించిన పాశ్చాత్యదేశాలలో వినం. (అక్కడి సమస్యలు వేరనుకోండి.)

ఈ సమస్యలకి పరిష్కారం ఏమిటి? స్త్రీలలో ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణశక్తి, ఆత్మాభిమానం కావాలి. ఇటీవల పత్రికల్లో చదివాం. మనదేశంలోనే— ఒక పడుచువాడు పొరుగామె వెంటబడ్డాడు. ఆమె నిరాకరించింది. అయినా అతడు వదలలేదు. ఒక రోజున ఆమె భర్త లేనప్పుడు ఒంటరిగాచూసి మీద పడ్డాడు. ఆమె పక్కనున్న కత్తిపీట తీసుకొని ఒక్కటేసింది. వాడు చచ్చిపోయేడు.

కోర్టులేం నిర్ణయిస్తాయో వదిలేద్దాం. ఆ ఘట్టందాకా రావడం విచారకరమే. కాని ఆ పడుచును నిందించడానికి కేమాత్రం వీల్లేదు. అభినందించాలిగాని.

కత్తిపీటో, కత్తో దగ్గర లేకపోతే, ఆ ధైర్యం, బలం లేనిదైతే, వాడు ముందే ఒడుపు చూసుకుంటే ఏంచెయ్యాలనేది ప్రశ్న కాదు. ఒక మనిషి వేరొకరిని నిర్బంధించి వుపయోగించగల స్థితి సమాజంలో పోవాలి. వ్యక్తిస్వాతంత్ర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం అనే మాటలకు అర్థం అదే. దానికే మన ప్రయత్నం. మన ప్రోత్సాహమూ.

అంతేగాని కన్ఫ్యూషియను బోధను మననం చేసి 'నిశ్చింతగా, హాయిగా...' కళ్లు తేల్చమనికాదు చెప్పవలసిందీ, చెయ్యవలసిందీ.

వెన్నెల విరిసింది

ఇది కేవలం సినీమా ప్రేక్షకులకోసం వుద్దేశించి తయారుచేసిన అసందర్భాల పుట్ట గాథ.

ఇందులో జంటల్ని కూర్చిన పద్ధతి చూస్తే కాళిదాసు శాకుంతలంలో దుష్యంతుడు చూపిన ధీమా గుర్తు వస్తుంది.

'అసంశయం క్షత్ర పరిగ్రహ క్షమా
యదార్య మస్యాం మభిలష్యతేమనః'
—అంటాడాయన.

సమాజం ముందుకుపోయింది గనుక పెళ్లి చేసుకోవాలనుకొన్నా, ఆ మాట వదిలి వట్టినే ఆడుకుందామనుకున్నా యువతీ యువకులు ఈ నవలలో వరసా, వావీ కలిసే మేనత్త మేనమామల పిల్లలే అయిపోతూండడం ఎంతో సంతోషకరం. 'ఉమ్మి ఉమ్మితో కలిసిపోయింద'న్నట్టు గర్భం కలిగించి పారిపోయినవాడు మేనమామ కొడుకే అయివుంటాడనే సంతృప్తికి అవకాశం కలిగిస్తారు, రచయిత్రి. (కోమలి, రాము) ఈ నవల చదువుతే మేనత్త, మేనమామల పిల్లల మధ్యనే తప్ప ఇతరత్రా వివాహ యోగ్యత లేదేమో ననుకోవలసి వస్తుంది. ఆడా, మగా తేడా తెలియని వయస్సులోనే, అంతక్రితం మొహం చూడకపోయినా అంతస్తులు పాటించకుండా, తల్లి వ్యతిరేకతనో, తండ్రి వ్యతిరేకతనో, ఇద్దరి అయిష్టాన్నో లెక్కచేయకుండా భార్యా భర్తృభావం పెంచుకోగల పాత్రలు (సుధా, విశ్వం), వయస్సువచ్చి, ఒకేయింట ఎంతో పరిచయంగా వుంటున్నా, తమ మధ్య వున్న అన్నా చెల్లెలు వరస తమ వూహకు కూడా అందకపోయినా మనస్సు చలించని పాత్రలు (కోమలి—విశ్వం) మనగడ్డ పవిత్రతకు ప్రతీకలు, అయిదేళ్ల వయసులోనే 'అన్యకాంత లక్ష్యంబయిన మాతృభావంబున మరలి'న ప్రహ్లాదుడు పుట్టిన గడ్డయిది. బెజవాడ బయట ఎనమల కుదురు సమీపంలో రిక్షాలలోపోతున్న జంటల్ని ఆపి, ఆ యువతుల్ని చెరిచిన వార్తలు రక్తం ఉడుకెత్తిస్తున్న

ఈనాటి స్థితిలో మన భారతాత్మ పవిత్రత అచంచలం అని ఓదార్పునిస్తున్న ఈ నవల వ్రాసిన సోదరీమణికి కృతజ్ఞతాభివందన లర్పించాలి.

—'అవంతి'

బాలాభిరామం

(బాలల గేయ సంపుటి)

(రచన: శ్రీ మిరియాల రామకృష్ణ—డెమీ ఆక్టేవో 44 పేజీలు వెల రూ. 3/—ప్రతులకు: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాదు.)

నిత్యజీవితంలో మనకు తారసపడే సంగతులూ సందర్భాలూ — పిల్లలను ఆకర్షించే గేయాలలో—నలభైమూడు శీర్షికలలో చక్కగా మలచబడ్డాయి. శ్రీ గోలి శివరామ్ చిత్రణ ఈ సంపుటికి మరింత వన్నె తెచ్చింది. మచ్చుకి—

'ఎనిమిది కాళ్లా సాలీడా!—
ఎన్ని ఈగలను తిన్నావే?—
ఎక్కుతు దిగుతూ సాలీడా!—
ఎంత దారమును పేనావే?—'

— ఈ ప్రశ్న సాలీడు జీవితాన్ని కళ్లకు కట్టినట్టు చూపుతుంది. దీనికోసం మరొక 'నేచర్ స్టడీ' పాఠం అక్కర్లేదు. సాలీడు రూపురేఖలూ, దాని ఆహారమూ, అది చేసే పనీ అన్నీ ఈ రెండు ప్రశ్నలే గొప్పగా బోధిస్తాయి. 'నా కోరికలు'లో సమస్యలూ సమాధానాలూ పసిపాపకు సయితం జాతీయతనూ జన్మభూమిమీద మక్కువనూ ఉగ్గుపాలతో రంగరించి పెడుతున్నాయి.

'అడిగివద్దాం'లో రామకథను ఇంకా ఇంకా తెలుసుకుందామనే కుతూహలం తెలుగు బిడ్డలో రేకెత్తుస్తూంది.

యతిప్రాసల ఆరాటంలో తికమకలు తప్పలేదు. 'ఎల్లరిని గబగబా ఏరుకోమంటాను' (పే 10) లో 'ఎల్లరిని', కంటే 'అందరిని' అంటే బాగుండేది. (పే 25) 'నేను తేండే మీాకు పొయ్యియె...' అంత హాయిగా లేదు. క్రుంగు—క్రింద క్రొత్త—క్రారావడి తొలగిస్తే? — స్కూల్లో ఎలాగూ తప్పటంలేదు. తియ్యటి తేలిక మాటలకు అవకాశమున్నచోట ప్రౌఢ పదాలు అనవసరం. అసలే మనకి బాలసాహిత్యం తక్కువ. కనక—ఎంచటం బాగుండదు. ఇది దక్షిణ భాషా పుస్తక సంస్థవారి బహుమతి నందుకున్న గేయదామం.

* * *

అచ్యుత రామరాజు నాటికలు

రచన: శ్రీ గణపతిరాజు అచ్యుత రామరాజు—డెమీ ఆక్టేవో 108 పేజీలు వెల రూ. 3-50.

ప్రతులకు: రచయిత పేరిట 30-11-10. డాబా గార్డెన్స్, విశాఖపట్నం రాయాలి.

ఇది చతురంగం. నాలుగు నాటికల సంపుటి. నాలుగూ నాలుగు తీరులు. నాలుగు రసానుభూతులు.

'మాలిని' రవీంద్రుడి సుప్రసిద్ధ రచనకు అనువాదం. మత దురభిమానికీ, సాటిజీవుల పట్ల ఔదార్యానికీ మధ్య సంఘర్షణ ఇందులో ఇతివృత్తం.

తెలుగుగడ్డలోపుట్టి తెనుగుబిడ్డలకు 'పౌరుషం ప్రధానం' అని నూరిపోసిన ఖడ్గతిక్కనగాథ రెండవది.

పిన్నలకూ, పెద్దలకూ ఆసక్తి కలిగించే నేర్పుగా నడిచింది. మూడోనాటిక 'చిన్నపిల్లలు' ఇది ఒక ఇంగ్లీషు నాటికకు అనుసరణమని చెబితేగాని తెలియదు.

చివరివరకూ సస్పెన్సుతో ప్రతిభావంతంగా నడిచింది చిట్టచివరి నాటిక 'తీర్పు.' ప్రేక్షకులనూ, పాఠకులనూ మురిపించే స్వతంత్ర నాటిక.

బాల్యంనించీ నాటకాభిరుచీ, రంగస్థలమందు అనురక్తీ గల శ్రీ రాజుగారు ఎన్నో ప్రదర్శనలు నిర్వహించి నటనా కౌశలంతో పాత్రధారణచేసి, సవ్యసాచి అనిపించుకున్నారు. ఆ అనుభవంతోచేసిన రంగస్థల రచన ఇది— ఈ సంపుటి.

శ్రీ అంగర వెంకటకృష్ణారావుగారు పీఠికలో నాట్యశాస్త్రాన్ని కూలంకషంగా పరిశీలించి, పాశ్చాత్య రూపక చరిత్రను, తెలుగు నాటకరంగ పరిణామాన్ని చక్కగా పొందుపరిచారు. శ్రీ అడపా వారి 'ప్రశంస' యుక్తంగా ఉంది.

— శివకుమారి

ఆంధ్రకేసరి

శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులుగారి శత జయంత్యుత్సవ సంచిక (1972).

(సంపాదకుడు: శ్రీ కె. ఎస్. కోదండరామయ్య, ఎం. ఎల్. ఎ. మూల్యం: రూ. 10/—ప్రచురణ: హోసూరు తాలూకా ఆంధ్ర సాంస్కృతిక సమితి, హోసూరు (ధర్మపురి జిల్లా) తమిళనాడు.)

ఆంధ్రకేసరి ప్రకాశంగారి శత వార్షిక జయంతిని పురస్కరించుకొని—హోసూరు తాలూకా ఆంధ్ర సాంస్కృతిక సమితివారు ప్రచురించిన ప్రత్యేక సంచిక మా కార్యాలయమునకు చేరింది. ఇందు మొదటి భాగము ఆంగ్లమునకును, రెండవ భాగము తెలుగునకును పరిమితమైనది.

సర్వాంగ సుందరముగా వెలువడిన ఈ సంచికలో—ప్రకాశం జీవిత సంగ్రహమేగాక, అనేక పత్రికల నుండీ, వివిధ గ్రంథములనుండీ, పలువురు ప్రముఖుల అభిప్రాయాలు ఇందు పొందుపరుచబడ్డాయి. ఇవేగాక—'ప్రకాశమే ప్రజలు—ప్రజలే ప్రకాశం', 'ప్రజానాయకుడు ప్రకాశం'—అన్న వ్యాసాలు ఈ సంచికకు నిండుతనాన్ని చేకూర్చాయి. ప్రకాశంగారి స్మృతులను, సూక్తులను ఇందు వెల్లడించారు.

నాలుగు దశాబ్దాల ఆంధ్రకేసరి జీవిత చరిత్రనే గాక, ఆంధ్రుల స్వాతంత్ర్యోద్యమ చరిత్రనే—పాఠకుల ముందుంచిన — ఈ సంచికా సంపాదకులు శ్రీ కె. ఎస్. కోదండరామయ్యగారు అభినందనీయులు.

శ్రీ భ్రమరాంబా మల్లేశ్వర ఆంధ్ర గ్రంథాలయము

(విజయవాడ)

పై గ్రంథాలయమువారు నిరంతర సేవా కార్యక్రమముతోబాటు, అయిదు దశాబ్దముల సేవా దర్పణమైన— ఆ గ్రంథాలయము స్వర్ణోత్సవము జరుపుకొనుటేగాక, ఆ ఉత్సవాలలో 'సరస్వతీ సామ్రాజ్యమే' విజయవాడకు తరలివచ్చింది—అంటే అతిశయోక్తి కాదు, ఇది శ్రోత్రవాణి. ఆనాటి సారస్వత మహాసభలో పాల్గొన్నవారు— ఆంధ్రసాహిత్యమును మథించిన నిష్ణాతులు. వీరలుచేసిన ప్రసంగములు, రచనలు 'స్వర్ణోత్సవ సంచిక'లో పొందుపరుపబడ్డాయి. ఇది మా కార్యాలయమునకు చేరింది.

ఈ గ్రంథాలయమునుగూర్చి దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుపంతులు, మ. రా. శ్రీ. గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు, శ్రీ సి.హెచ్. స్మిత్, శ్రీ ముత్తా సుబ్బారావు, శ్రీమతి సుబ్బారావు, ఆచార్య పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, శ్రీ న్యాపతి నారాయణమూర్తిగార్ల అభిప్రాయాలూ, ఈ సంచికలో కలవు. ఇవి ఎప్పటివో అయినా, ఈ గ్రంథాలయం వారి కృషికి అవి దర్పణంలాంటిది.

ఈ గ్రంథాలయానికి తోడ్పడ్డ ప్రతివ్యక్తికీ— ఈ సంచికలో స్థానమీయటం గమనింపదగ్గ విషయం. అంతేగాక గత ఏభైయేండ్లనుండి ఈ గ్రంథాలయం సాగించిన ప్రగతిపథాన్ని చాటే — వ్యాసరాజములను సేకరించి చక్కగా ముద్రించి అందజేయటం ముదావహం. ఆంధ్రదేశంలో జరిగిన గ్రంథాలయోద్యమాన్ని ప్రతిఫలింప జేసే ఒక చుక్కాని ఈ స్వర్ణోత్సవ సంచిక.

ఈ స్వర్ణోత్సవసంచికకు సంపాదకత్వము వహించి — సర్వతోముఖప్రతిభతో తీర్చిదిద్ది వెలువరించిన శ్రీ నిడుముక్కల నాగభూషణరావు అభినందనీయులు.

లేపాక్షి (స్వప్న దర్శనము)

(కావ్యము)

(మూల్యము 3 రూ. రచయిత: శ్రీ బాడాల రామయ్య, ఎం. ఏ., ఆంధ్ర భాషోపన్యాసకులు, కన్నడ అధ్యయన సంస్థ, మానసగంగోత్రి, మైసూరు—6, ప్రతులకు: రచయిత పేర, 11—వ క్రాస్, జయనగర్. మైసూరు—9.)

నూటయిరవై పుటలు గల 'లేపాక్షి స్వప్న దర్శన కావ్యము'ను శ్రీ బాడాల రామయ్య కవి - మంచి ధారాశుద్ధి, సరళము, నిర్దుష్టము - ఐన శైలితోనూ, గంభీర భావముతో వ్రాసిన కావ్యరాజ మిది.

లేపాక్షి గొప్ప క్షేత్రము. ఆ ఊర భిక్షాటనేశ్వరుడు, ఆయనకు ఎదురుగా సీతారామలక్ష్మణుల గుడీ, ఎదురుగా వీరభద్రాలయమనూ ఉన్నవి. వీరశైవుడైన విరుపణ్ణ వీరభద్రాలయమును నిర్మించినాడు. ఆయన విజయనగర సామ్రాజ్యమున ఒక సేనా నాయకుడు. త్రోవలో దుర్గాలయం కూడా ఉంది. శిల్పమునకు నిధానమైన ఈ దేవాలయంలో రామాయణ భారత, భాగవత కథాచిత్రములు చిత్రములై యున్నవి.

ప్రపంచఖ్యాతినందిన 'నంది' విగ్రహము ఈచోట వెలసిన శిల్పములలో పరమ మనోహరమైనది. ఈ నందిని చూచే కీ॥ శే॥ అడివి బాపిరాజు 'లేపాక్షి బసవయ్య లేచి రావయ్యా'— అని భావకుడైనాడు.

అదేవిధంగా శ్రీ బాడాల రామకవిగారికీ — స్వప్నంలో లేపాక్షిలో వెలసిన చిత్రములన్నీ కన్పించి తమ కథను చాటినవట. అంతటితో ఈయన భావకుడై, జీవశక్తితో జిగిబిగిగా - కావ్యమును రచించి - ఆంధ్ర భాషా యోషకు అపూర్వాలంకారములు చేకూర్చినారు.

ఇంకా ఇట్టి అనేకానేక కావ్యములు వ్రాయాలని ఈ కవిని కోరుతూ విరమిస్తున్నాను.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1. Editor : S. Radhakrishna.